ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 20.03.2026 | సంపుటి : 12 సంచిక : 240 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# కుప్పకూలుతున్న అమెరికా సామ్రాజ్యవాదం



## అగ్రరాజ్య ఏకఛత్రాధిపత్యానికి క్రమంగా గండి • మొహం చాటేస్తున్న యూఎస్ మిత్రదేశాలు

- డాలర్‌కు బదులుగా యువాన్‌లో చమురు వ్యాపారం చేసే యోచన
- ట్రంప్ యుద్ధ చర్యలపై ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న నిరసనలు
- హర్మ్యూజ్ జలసంధి విషయంలో ఇప్పటికే భంగపడ్డ అగ్రదేశం
- స్వదేశీయుల్లోనే వ్యతిరేకతతో కక్కలేక.. మింగలేని పరిస్థితి

**ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చెలాయించాలని ఊగిపోయే అగ్రరాజ్యం ఈసారి భారీస్థాయిలో భంగపడ్డది. నిత్య యుద్ధోన్మాద చర్యలతో సొంత దేశస్తులతోనే వ్యతిరేకత ఎదుర్కొంటున్న ట్రంప్ సర్కార్.. ఇతర దేశాల నుంచీ ఎలాంటి మద్దతు లభించక ముందుకెళ్లలేక, వెనక్కి రాలేక కొట్టుమిట్టాడుతోంది. ఆర్థిక సంక్షోభం, భగ్గుమంటున్న ధరలు, ఎగుమతులు దిగమతుల్లో తీవ్ర ఆటంకాలు.. వెరసి వీటన్నింటికీ అమెరికా చర్యలే కారణమని నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ట్రంప్ టెంపరితనం వల్ల అమెరికా సామ్రాజ్యవాదమూ మసకబారుతోంది.**

**జనంసాక్షి, స్పెషల్ కరస్పాండెంట్, మార్చి 19 (జనంసాక్షి):** ఇజ్రాయెల్ ఒత్తిడితోనే ఇరాన్‌పై ట్రంప్ యుద్ధా నికి దిగారని అమెరికా జాతీయ ఉగ్రవాద నిరో ధక సంస్థ చీఫ్ జోసెఫ్ కెంట్ తన పదవికి రాజీ నామా చేశారు. మనస్సాక్షిని చంపుకొని ట్రంప్ చర్యలకు మద్దతు ఇవ్వలేనని పేర్కొన్నాడు. అదేవిధంగా, అమెరికా, ఇజ్రాయెల్ భీకర దాడు లు చేస్తున్నప్పటికీ ఇరాన్ పాలన చెక్కుచెద రలేదని, కేవలం బలహీనపడిందని అమెరికా నిఘా విభాగం చీఫ్ తులసి గబ్బార్డ్ వెల్లడించా రు. ఈ ఇరువురి నిరసన ఇరాన్‌పై ట్రంప్ అనైతిక చర్యలను ప్రతిబింబిస్తోంది. ఇరా న్‌పై యుద్ధం ప్రారంభించి 20రోజులు కావొ స్తుండగా.. ఈ చర్యలు ఆసియా, ఐరోపా దేశాల్లో తీవ్ర ఆందోళనలకు దారితీసింది. ప్రజల్లో కూడా తీవ్ర నిరసన పెరిగింది. ప్యూ రీసెర్చి సెంటర్ సర్వే ప్రకారం, ట్రంప్ ఆమోదం రేటు 37 శాతానికి పడిపోయింది. స్వతంత్ర ఓటర్లలో ట్రంప్ ఆమోదం 25 శాతానికి పడిపో గా, 66 శాతం మం ది వ్యతిరే కిస్తున్నట్లు, కేవలం 27 శాతం అమెరికన్లు మాత్రమే ట్రంప్ విధానాలను సమర్థిస్తున్నట్లు వెల్లడైంది.

**మారనున్న చమురు వ్యాపారం**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కేవలం భౌగోళిక రాజకీయాలకే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా గణనీయమైన ప్రభావం చూపుతు న్నాయి. ముఖ్యంగా ప్రపంచ చమురు సరఫరాకు కీలకమైన హర్మ్యూజ్ జలసంధి చుట్టూ జరుగుతున్న పరిణామాలు అంతర్జాతీయ కరెన్సీ వ్యవస్థలో మా ర్పులకు దారితీసే సూచనలిస్తున్నాయి. ప్రపంచ చ మురు రవాణాలో సుమారు 20 శాతం హర్మ్యూజ్ జలసంధి గుండా జరుగుతున్నది. ప్రస్తుత పరిస్థి తుల్లో అమెరికా విధిస్తున్న

మిగతా 2లో..



# ఇంధన వనరులపై ఇజ్రాయెల్ దాడులు

**భగ్గుమన్న చమురు ధరలు • ఖతార్ ఎల్ఎన్‌జీ ప్లాంట్‌పై ఇరాన్ భీకర దాడులు**

- సౌదీ అరేబియాలోని అరామ్‌కో రిఫైనరీపై డ్రోన్ దాడి
- ఇజ్రాయెల్ అజెండా అమలు కోసం అమెరికా దుస్సాహసం
- సొంత ప్రజలపైనే భారం మోపుతోంది
- అగ్రరాజ్యంపై ఇరాన్ మండిపాటు
- యుద్ధం కోసం రూ.18లక్షల కోట్లు ఇవ్వండి! : పెంటగాన్
- పశ్చిమాసియాకు వేలాదిగా యూఎస్ బలగాలు..!

టెహ్రాన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగు తున్నాయి. ఇరాన్‌లోని అణు,గ్యాస్ క్షేత్రాలే లక్ష్యంగా అమెరికా, ఇజ్రా యెల్ చేసిన దాడులతో యుద్ధం మరింత తీవ్రంగా మారింది. దీంతో ఇరాన్ కూడా గల్ఫ్‌లోని ఇంధన కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోంది.తాజాగా సౌదీ అరేబియాకు చెందిన అరామ్‌కో రిఫైనరీపై డ్రోన్ దాడి జరిగింది. ఎర్రసముద్రంలోని యాన్బు పోర్టు సమీపంలో ఈ రిఫైన రీ ఉంది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగగా.. రిఫైనరీ స్వల్పంగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఎవరైనా గాయపడ్డారా లేదా అనే విషయం తెలియరాలేదు. యుద్ధం నేపథ్యంలో హర్మ్యూజ్ జలసంధిని

మిగతా 2లో..

## సంయమనం పాటించండి

- చమురు క్షేత్రాలపై ఇరుపక్షాల దాడులను ఖండించిన భారత్ తక్షణమే నిలిపివేయాలని సూచన
- పలువురు దేశాధినేతలతో మోదీ మంతనాలు.. తాజాగా ఫ్రాన్స్ అధ్యక్షుడికి ప్రధాని ఫోన్

2లో..

**సామాజిక సమస్యలను,సమాజంలోని రుగ్మతలను పరిష్కరించుకోవడానికి**

# సినిమా ఓ ఆయుధం



## గద్దర్ అవార్డుల ప్రదానోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** సమాజంలో ఉన్న రుగ్మతలు, సామాజిక సమ స్యలను పరిష్కరించుకోవడానికి సినిమా ఒక ఆ యుధమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో తెలంగాణ గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరి గింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లా డారు. "సినీ పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్ రావడానికి ఎన్టీఆర్, ఏఎన్నార్ కృషి చేశారు. రామోజీ ఫిల్మ్‌సిటీని ఏర్పాటు చేసి చిత్ర పరిశ్రమ శాశ్వతంగా హైదరాబాద్ నగరంలో వేళ్లూనుకునే విధంగా రామోజీరావు తీవ్రంగా కృషి చేశారు. వారితో పాటు సినీ కార్మికుల సంక్షేమం, పరిశ్రమ అభివృద్ధికి ప్రభాకర్‌రెడ్డి, దాసరి నారా యణరావు పాటుపడ్డారు. నెట్‌ఫ్లిక్స్ జీసీసీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసుకున్నారంటే.. హాలీ వుడ్ హైదరాబాద్‌కు వచ్చినట్టే. తెలంగాణ ప్రభు త్వం సినీ పరిశ్రమ ప్రాముఖ్యతను గుర్తించి అంత ర్జాతీయ స్థాయిలో సినిమాలను ప్రోత్సహించి, సినిమా నిర్మాణానికి సంబంధించి అన్ని అనుమ తులు ఇవ్వడానికి సింగిల్ విండో విధానాన్ని తీసుకొస్తోంది. ఎవరైనా సినిమా నిర్మించాల నుకుంటే కథతో వస్తే.. రీల్స్‌తో బయటకు వెళ్ల డానికి రామోజీఫిల్మ్‌సిటీ లాంటి ఎన్నో సంస్థలు హైదరాబాద్‌లో

మిగతా 2లో..

## ఇది రైతునామ సంవత్సరం

రైతును రాజుగా చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం

రవీంద్రభారతిలో ఉగాది వేడుకల్లో సీఎం రేవంత్

2లో..

## ప్రభుత్వ విప్‌లుగా అద్దంకి దయాకర్, బల్మూరి

- నియమించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు





హైదరాబాద్(జనంసాక్షి): ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంక ట్‌లను తెలంగాణ ప్రభుత్వం విప్‌లుగా నియమిం చింది. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. మరోవైపు శాసనసభలో విప్‌లుగా ముగ్గురు ఎమ్మెల్యేలను రాష్ట్ర ప్రభుత్వం నియమిం చింది. ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణరావు, యన్నం శ్రీనివాస్‌రెడ్డి, మేముల వీరేశంలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



# నేడు సభలో బడ్జెట్ పద్దు

**అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క**

**అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉంటుందని వెల్లడి**

**హైదరాబాద్(జనంసాక్షి):**రాబోయే బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోద యోగ్యంగా, రాష్ట్ర ప్రగతికి దిక్సూచిగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అత్యంత వైభవంగా నిర్వహించిన ఉగాది ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన, ఈ సందర్భంగా పంచాంగ శ్రవణం వీక్షించి ప్రజలకు శుభాకాం క్షలు తెలిపారు.ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా

# రైతు సంక్షేమ సర్కారు మాది

- పంటల వైవిధ్యంతోనే మెండుగా లాభాలు
- రైతులు ఈ దిశగా ఆలోచించాలి
- సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్వహించిన రైతు మహోత్సవంలో మంత్రి తుమ్మల
- కాళేశ్వరం వల్లే పామాయిల్‌కు సిద్దిపేట అనుకూలం
- హరీశ్‌రావు

వార్త 2లో

## అస్సాంలో భాజపా తొలి జాబితా

**జాలుక్‌బారీ నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ బరిలోకి..**

**దిస్‌పూర్(జనంసాక్షి):** అస్సాం అసెంబ్లీ ఎన్నికలకు సం బంధించి భాజపా తన అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. మొత్తం 88 మంది అభ్యర్థుల పేర్లను పేర్కొంది. అస్సాం ముఖ్య మంత్రి హిమంత బిశ్వశర్మ జాలు క్‌బారీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ఇది ఆయనకు కం చుకోట. 2001, 2006, 2011, 2016, 2021ల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలన్నింటిలోనూ హిమంత ఇక్కడి నుంచే విజయం సాధించా రు. ఇక, కాంగ్రెస్ పార్టీ నుంచి వ చ్చిన కీలక నేతల పేర్లు కూడా తా జా జాబితాలో ఉన్నాయి. ఇటీవల భాజపాలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభాగం మాజీ అధ్యక్షుడు

మిగతా 2లో..

# కబ్జా భూములపై హైడ్రా పంజా

**రూ.600 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం**

**హైదరాబాద్(జనంసాక్షి):**హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతు న్నాయి. వెంగళరావునగర్ డ్రగ్ కంట్రోల్ కార్యాలయం ఎదురుగా ఉన్న 2 ఎకరాల్లోని నిర్మాణాలని భారీ బందోబస్తు నడుమ జేసీబీ సహాయంతో 11 గుడిసెలు, షెడ్లని హైడ్రా అధికారులు తొలగించారు. కూల్చివేతలను స్థాని కులు అడ్డుకొని ఆందో ళనకు దిగారు. ఏళ్ల తరబడి కుటుంబాలతో ఉంటు న్న స్థలం ప్రభుత్వానికి కాదని ప్రైవేట్ వ్యక్తులది అని వాపోయారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే నివాసాలు కూల్చిరోడ్డున పడేశారని స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. ఇప్పటికే ఆ స్థలంలోని ఇళ్లు ఒకసారి కూల్చేశారని, మరోసారి తొల గించడంపై బాధిత కుటుంబాలు

మిగతా 2లో..





# పార్టీ ఆవిర్భావ నాడే ఎజెండా ప్రకటిస్తా

- పార్టీ పేరు 'తెలంగాణ ప్రజా జాగృతి'
- ప్రకటించిన పార్టీ అధ్యక్షురాలు కవిత
- నమోదు ప్రక్రియ కోసం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కల్వకుంట్ల కవిత.. 'తె లంగాణ ప్రజా జాగృతి' పేరుతో నూతన రాజ కీయ పార్టీ నమోదు కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి జనవరి 23వ తేదీన దరఖాస్తు చేసుకున్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 29ఎ కింద రాజకీయ పార్టీ నమోదు కోసం చేసిన తన దరఖాస్తును కేంద్ర ఎన్నికల సం ఘం వేగంగా పరిశీలించి నిర్ణయం వెలువ రించేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ కవిత దిల్లీ హైకోర్టును

మిగతా 2లో..

# మోదీది మాటల గారడీ

**12 ఏళ్ల ప్రధాని పాలనలో దేశానికి చేసిందేమీ లేదు: మంత్రి పొన్నం ప్రభాకర్**

**కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంపై ఎందుకు వివక్ష చూపిందో కేంద్ర మంత్రులు బండి, కిషన్‌రెడ్డిలు సమాధానం చెప్పాలని డిమాండ్**

**పార్టీ ఎవ్వరినీ వదులుకోవాలని అనుకోదు**

**జీవన్‌రెడ్డి విషయం పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని వెల్లడి**



**కరీంనగర్ (జనంసాక్షి):** ప్రధాని మోదీ తన 12 ఏళ్ల పాలనలో మాటల గారడీ తప్ప, దేశానికి చేసిందేమీ లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. గురువారం కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉగాది వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రంపై ఎందుకు వివక్ష చూపిందో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు సమా ధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీవన్‌రెడ్డి విష యంలో పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని, పార్టీ ఎవ్వరినీ వదులుకోవాలని అనుకోదని చెప్పారు."అసెంబ్లీలో వందేమాతరం గేయం సమయంలో కొంతమంది ఎమ్మెల్యేలు బయటకు పోవడంపై ఒక కేంద్ర మంత్రిగా బండి సంజయ్ స్పీకర్ దృష్టికి తీసుకుపోవచ్చు. ఎవరు చేసినా అది తప్పే. అది జరిగిందా లేదా? అని చూడాలి. మూసీ ప్రాజెక్టును అప్రతిష్ఠ పాలు చేయాలని చూస్తున్నారు. గాంధీ స్మృతివనం కడతామంటే ఎన్నో విమర్శలు చేస్తున్నారు. మూసీ నిర్వాసితుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వమని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పారు. సామాజిక న్యాయం, ప్రజాసంక్షేమం కోరుకుంటూ ప్రజల ఆశీర్వాదంతో ముందుకు పోతున్నాం" అని మంత్రి పొన్నం తెలిపారు.

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
20.03.2026

## సంయమనం పాటించండి

చమురు క్షేత్రాలపై ఇరుపక్షాల దాడులను భారత్ ఖండించింది. ఇలాంటి దాడులు ఆమోదయోగ్యం కాదు, తక్షణమే నిలిపివేయాలని సూచించింది. ఇది ప్రపంచ ఇంధన సరఫరాను మరింత అతలాకుతలం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి దాడులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు ప్రమాదకరమని వెల్లడించింది.పశ్చిమాసియాలో నెలకొన్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని భారత ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుత పరిస్థితులు కేవలం దేశానికే కాకుండా, యావత్ ప్రపంచానికి పరీక్షగా మారాయని పేర్కొంది. దేశ ఇంధన అవసరాలు తీరేలా చూసుకోవడానికి సంబంధిత దేశాలతో నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉన్నామని తెలిపింది. ఈ మేరకు విదేశాంగశాఖ సహా వివిధ విభాగాల ప్రతినిధులు మీడియా సమావేశంలో వెల్లడించారు.“కువైట్ యువరాజుతో ప్రధాని మోదీ మాట్లాడారు. ఆయా దేశాలు, భాగస్వామ్య పక్షాలతో దౌత్యపరంగాను చర్చలు జరుపుతున్నాం. వీటి ఫలితంగా రెండు ఎల్‌పీజీ నౌకలను హర్మూజ్ జలసంధి మార్గంలో తీసుకురాగలిగాం” అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ పేర్కొన్నారు. మరోవైపు.. చిన్న, మధ్య తరహా, ఇతర వినియోగదారులకు పంపిణీ చేసేందుకుగానూ రాష్ట్రాలకు అధిక పరిమాణంలో బొగ్గును కేటాయించాలని బొగ్గు మంత్రిత్వశాఖ ఇప్పటికే కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

పలువురు దేశాధినేతలతో మోదీ మంతనాలు

పశ్చిమాసియాలో ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్న వేళ.. పలు దేశాధినేతలతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడుతున్నారు. తాజాగా ఒమన్ సుల్తాన్, మలేషియా ప్రధాని, ఫ్రాన్స్ అధ్యక్షుడితో సంభాషించారు. ఘర్షణలు తక్షణమే తగ్గించాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్‌తో మాట్లాడినట్లు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఉద్రిక్తతలు తగ్గించేందుకు అవసరమైన చర్చలకు ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు. హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకలు సురక్షితంగా వెళ్లే అంశానికి ఇరుదేశాలు కట్టుబడి ఉన్నాయన్నారు. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతోనూ ఇదే విషయమై చర్చించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు మరో పోస్టు చేశారు. “ పశ్చిమాసియా ప్రాంతంలోని నెలకొన్న పరిస్థితులు, అక్కడ ఉద్రిక్తతలు తక్షణమే తగ్గించాల్సిన ఆవశ్యకతపై చర్చించాం” అని పేర్కొన్నారు. ఘర్షణలకు ముగింపు పలికేలా చర్చలు, దౌత్య మార్గాలను పునప్రారంభించాల్సి ఉందన్నారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం నెలకొల్పేందుకు ఇరుదేశాలు సమన్వయంతో ముందుకు సాగేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు.

భారత నౌకల ఎంట్రీకి ఇరాన్ నిరాకరణ అంటూ పోస్టులు.. కేంద్రం ఏమందంటే..?

పశ్చిమాసియాలో భీకర పోరు కొనసాగుతోంది. ఈ క్రమంలో యుద్ధానికి సంబంధించిన వదంతులు సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తుతున్నాయి. తాజాగా హర్మూజ్ జలసంధి మీదుగా భారత్ నౌకలు వెళ్లేందుకు ఇరాన్ నిరాకరించిందంటూ నెట్టింట పోస్టులు దర్శనమిస్తున్నాయి. తాజాగా వీటిపై భారత విదేశాంగశాఖ స్పందించింది. అవన్నీ ఫేక్ అని స్పష్టంచేసింది. భారత్ ఇటీవల ఇరాన్‌కు చెందిన మూడు నౌకలను స్వాధీనం చేసుకుందని.. అవి తిరిగి అప్పగించేవరకు హర్మూజ్ జలసంధి మీదుగా ఆ దేశ నౌకలు ప్రయాణించడాన్ని టెహ్రాన్ నిరాకరించిందని నెట్టింట పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో సిబ్బందితో సహా పలు నౌకలు అక్కడ చిక్కుకుపోయాయని, ఇది భారత్‌లో ఇంధన సరఫరాలపై తీవ్ర ప్రభావం చూపొచ్చునేది ఆ పోస్టుల సారాంశం. అయితే, ఇవి నిరాధారమైనవని తాజాగా ప్రభుత్వం స్పష్టంచేసింది. ఈ మేరకు విదేశాంగశాఖ ఫ్యాక్ట్ చెక్ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. సామాజిక మాధ్యమాల్లో తప్పుదోవ పట్టించే ఇలాంటివాటితో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. కాగా.. భారత జెండాలతో ఉన్న నౌకలు హర్మూజ్ జలసంధి మీదుగా ప్రయాణించేందుకు ఇటీవల ఇరాన్ అనుమతించిన సంగతి తెలిసిందే.

## నేడు సభలో బడ్జెట్ పద్దు

ప్రభుత్వంలో ప్రజలం దరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ ‘పరాభవ’ నామ సంవత్సరంలో దుష్టశక్తులకు పరాభవం కలగాలని, రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా విలసిల్లాలని కోరుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తమ ప్రభుత్వం ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలోని అన్ని రంగాలు దిగ్విజయంగా వృద్ధి చెందాలని, ముఖ్యంగా తెలంగాణ యువతకు అద్భుతమైన ఉద్యోగ అవకాశాలు లభించాలని ఆశించారు. ప్రతి కుటుంబం ఈ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరుతూ, ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన పార్టీ శ్రేణులను అభినందించారు.

## కబ్జా భూములపై హైడ్రా పంజా

తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాయి.హైదరాబాద్ వెంగళరావునగర్‌లో కూల్చివేతలపై హైడ్రా స్పందించింది. హౌసింగ్ బోర్డుకు సంబంధించిన భూమిలో ఆక్రమణలు తొలగించి 3 ఎకరాల స్థలాన్ని కాపాడినట్లు పేర్కొంది. ఆ భూమి విలువ రూ.600 కోట్ల వరకు ఉంటుందని హైడ్రా అంచనా వేస్తోంది. 1975 కంటే ముందు రహ్మతుల్లా అనే వ్యక్తి వద్ద 45 ఎకరాల ప్రైవేట్ భూమిని హౌసింగ్ బోర్డు కొనుగోలు చేసి 660 ప్లాట్లతో లేఔట్ వేయగా అందులో పార్కు కోసం కొంత స్థలం, ప్రజావసరాలకోసం మరో 5 ఎకరాలు ఖాళీగా ఉంచారని హైడ్రా తెలిపింది. ఖాళీగా ఉన్న 5 ఎకరాల్లో 2 ఎకరాలు ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేపట్టారని తెలిపింది. అయితే ఆ నిర్మాణాల జోలికి వెళ్లకుండా ఆక్రమణకు గురవుతున్న 3 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించినట్లు హైడ్రా వివరించింది. హౌసింగ్ బోర్డుకు చెందిన 3 ఎకరాల భూమిపై హైకోర్టు స్టే ఉన్నా కొందరు తమ స్థలంగా పేర్కొంటూ షెడ్లు, గుడిసెలు నిర్మించి వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు హైడ్రాకు ఫిర్యాదులు అందాయని తెలిపింది. ఆ ఫిర్యాదులను పరిశీలించి ఆధారాల కోసం వారితో సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించింది. బాధితులుగా చెప్పుకుంటున్న వారివద్ద సరైన ఆధా రాల్లేవి, హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ నిర్మాణాలు చేపట్టారని హైడ్రా వివరించింది. అందుకే అక్రమ నిర్మాణాలు తొలగించి 3 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేసినట్లు హైడ్రా పేర్కొంది. హైడ్రా వద్ద కూలగొట్టేందుకు ఏం డాక్యుమెంట్ ఉందో చూపె ట్టండి అంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఇప్పటికే రెండుసార్లు ఇళ్లను కూలగొట్టడంతో ఆ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు.గతంలో ఈ స్థలంపై హైకోర్టు స్టే ఇవ్వగా కొత్తగా షెడ్లు వేసి వ్యాపారులు నిర్వహిస్తుండడంతో హైడ్రాకు ఫిర్యాదులు రావడంతో ఈ క్రమంలో బుధవారం ఆక్రమణలను తొలగించారు.

# కుప్పకూలుతున్న అమెరికా సామ్రాజ్యవాదం

ఆర్థిక ఆంక్షల నుంచి బయటపడటానికి ఇరాన్, దాని మిత్రదేశాలు డాలర్‌కు బదులుగా చైనా కరెన్సీ యువాన్‌లో చమురు వ్యాపారం చేయాలనే ఆలోచనకొచ్చినట్టు తెలుస్తోంది. ఇప్పటివరకు అంతర్జాతీయ చమురు లావాదేవీలలో ఎక్కువ భాగం డాలర్‌లోనే జరిగింది. అయితే యువాన్ వాడకం పెరిగితే డాలర్‌పై గ్లోబల్ డిమాండ్ తగ్గే అవకాశం ఉంది. యుద్ధ నౌకలు పంపాలని ట్రంప్ పిలుపునిచ్చినా.. చైనా, జపాన్, దక్షిణ కొరియా, బ్రిటన్ దేశాలు తిరస్కరించడం అమెరికాకు శృంగభంగంగా మిగిలింది. ఫ్రాన్స్, ఇటలీ, పోలాండ్ కూడా సైనిక సహాయం నిరాకరించాయి. ఆయిల్ ధరలు 40 శాతం మేర పెరగడం, ఆర్థిక వ్యవస్థలు కుదుపునకు గురికావడం వంటి పరిస్థితులకు అమెరికానే బాధ్యత వహించాలని పలు దేశాలు పేర్కొంటున్నాయి.

**ఏక్ నిరంజన్‌గా ట్రంప్**

ఇరాన్‌ను బూచీగా చూపాలని ట్రంప్ చేసిన ప్రయత్నాలు విఫలం కావడం అమెరికా సామ్రాజ్యవాదానికి తీవ్ర శరాఘాతం. నాటో కూడా ఈ యుద్ధంలో పాల్గొనబోమని తేల్చింది. బాల్టిక్ దేశాలు, పోలాండ్ కొంతవరకు మాట్లాడినా.. బ్రిటన్, జర్మన్, ఫ్రాన్స్, కెనడా, నార్డిక్ దేశాలు స్పష్టంగా వెనుకాడాయి. యూరప్ దేశాలు “లీగల్, ఎథికల్ సమస్యలు” అని చెప్పి దూరంగా ఉన్నాయి. స్పెయిన్, టర్కీ స్పష్టంగా వ్యతిరేకించాయి. ఒకవిధంగా ఈ యుద్ధంతోనే ట్రంప్ రాజకీయ భవితవ్యం కూడా ప్రశ్నార్థకంలో పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. లోపలి రాజీనామాలు, బయట అంతర్జాతీయ ఒంటరితనం – ఇది అమెరికా అసలు ముఖంగా కనిపిస్తోంది. చైనా–రష్యా నాయకత్వం, ఆసియా–ఆఫ్రికా దేశాల స్వేచ్ఛా ఆకాంక్షలు అమెరికా సామ్రాజ్యవాదాన్ని సవాలు చేస్తున్నాయి. ఇరాన్ యుద్ధం ఈ సత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది.

**డాలర్‌కు భారీ దెబ్బ**

ఇరాన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి డాలర్ బలహీనపడుతోంది. యువాన్ డాలర్‌తో పోలిస్తే బలపడి 6.89 స్థాయికి చేరుకుంది. ప్రపంచ దేశాలు డాలర్‌పై ఆధారపడటం తగ్గిస్తున్నాయి. యుద్ధ ఖర్చులు, ఆయిల్ ధరలు, షిప్పింగ్ ఇన్సూరెన్స్ – ఇవన్నీ అమెరికా ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయి. హార్మూజ్ జలసంధి మూసివేత కారణంగా ముడి చమురు ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో ఇండియాలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి రోజువారీ జీవితం ఇబ్బందుల్లో పడింది. ఎల్పీజీ సిలిండర్ల కొరత ఏర్పడటంతో వంట గ్యాస్ సమస్య తీవ్రమైంది. యుద్ధ పరిస్థితులు చమురు సరఫరా గొలుసులను దెబ్బతీస్తే.. దేశాలు డాలర్‌కు ప్రత్యామ్నాయాలను అన్వేషించే అవకాశం ఉంది. మరోవైపు, చమురు దిగుమతుల కోసం భారత్ యువాన్‌ను ఎక్కువగా వినియోగించాల్సి వస్తే ఆ కరెన్సీకి డిమాండ్ పెరుగుతుంది. విదేశీ మారక నిల్వలలో కూడా డాలర్‌తో పాటు యువాన్ వాటాను పెంచాల్సిన అవసరం రావచ్చు. హార్మూజ్ జలసంధిని తెరవలేకపోవడం, నాటో దళాలు సహకరించ కపోవడం, మిత్రదేశాలైన బ్రిటన్–జర్మనీలు వెనుకాడడం, చైనా–రష్యా పరోక్ష సహాయం, డాలర్ పతనం, యువాన్ ఉత్థానం.. ఇవన్నీ కలిసి అమెరికా సామ్రాజ్యవాదానికి ఒక భారీ గుణపాఠమని విశ్లేషకులు భావిస్తున్నారు.



ఈ నెల 19 నుంచి 22 వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రజాపాలనలో రైతు ఉత్సవాలు కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు ముఖ్యమంత్రిని కలిసి ఆ మేరకు ఆహ్వానాన్ని అందించారు. ప్రభుత్వం “ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక” కార్యాచరణలో భాగంగా ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నాలుగు రోజులపాటు “ప్రజాపాలనలో రైతు ఉత్సవాలు” నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈ నెల 22న నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ పామ్ కర్మాగారాన్ని ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా ప్రారంభించి రైతులకు అంకితం చేయనున్నారు. దానికి సమీపంలో రూ. 80 కోట్లతో నిర్మించనున్న రిఫైనరీ యూనిట్‌కు శంకుస్థాపన చేస్తారు.ముఖ్యమంత్రి స్థానిక రైతులతో ప్రత్యక్షంగా ముఖాముఖి మాట్లాడిన అనంతరం తొలివిడత రైతుభరోసా నిధులను విడుదల చేస్తారు.

# ఇంధన వనరులపై ఇజ్రాయెల్ దాడులు

ఇరాన్ మూసివేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి సౌదీ అరేబియా ఎర్రసముద్రం ద్వారా చమురును రవాణా చేస్తోంది. తాజాగా దీనిపై కూడా దాడి జరగడం గమనార్హం. కాగా.. ఖతార్‌లోని రస్ లాఫాన్ ఇండస్ట్రియల్ సిటీపై ఇరాన్ దాడి చేసిన సంగతి తెలిసిందే. ఇక, కువైట్ లోని రెండు చమురు శుద్ధి కార్మాగారాలే లక్ష్యంగా ఇరాన్ దాడి చేసింది. తొలుత మిన్ అల్ అహ్మదీపై డ్రోన్ దాడి జరగ్గా.. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని తెలుస్తోంది. అనంతరం మరో చమురు శుద్ధి కర్మాగారంపై కూడా డ్రోన్ దాడి జరగడం గమనార్హం.

**ఇజ్రాయెల్ అజెండా అమలు కోసం అమెరికా దుస్సాహసం: ఇరాన్**

ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై భీకర యుద్ధం చేస్తోన్న అమెరికా.. ఇందుకోసం భారీగా ఖర్చుపెడుతోంది. ఇప్పటికే రూ.వేలాది కోట్ల విలువైన ఆయుధాలను వినియోగించగా.. రానున్న రోజుల్లో దీనిని కొనసాగించేందుకు భారీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. ఈ క్రమంలో 200 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.18 లక్షల కోట్లు) పైగా నిధులు ఇవ్వాలని అమెరికా పార్లమెంట్‌కు చేసిన ప్రతిపాదనను ఆమోదించాలని పెంటగాన్ కోరినట్లు తెలిసింది. ఈ మేరకు వాషింగ్టన్ పోస్టు కథనాన్ని ప్రచురించింది. దీనిపై ఇరాన్ స్పందిస్తూ.. ఇజ్రాయెల్ అజెండాను అమలు చేసేందుకు సొంత పౌరులపైనే అమెరికా భారం మోపుతోందని విమర్శలు గుప్పించింది.“ఇరాన్, అమెరికాలపై రుద్దిన ఈ యుద్ధం మొదలై మూడు వారాలు మాత్రమే అయ్యింది. 200 బిలియన్ డాలర్లు అనేది చిన్న మొత్తమే. ఇజ్రాయెల్ అజెండా కోసం రూ.లక్షలాది కోట్లు ఖర్చుపెడుతున్నారు. అమెరికా ఆర్థికవ్యవస్థను దెబ్బతీస్తుంది. సామాన్య అమెరికన్లపైనే యుద్ధభారం పడుతోంది ” అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వ్యంగ్యంగా స్పందించారు.ఈ యుద్ధంలో పాల్గొనడం అమెరికాకు ఇష్టం లేదని అరాగ్చీ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. అమెరికాను నెతన్యాహు ఇందులోకి లాగారని అన్నారు. అమెరికాలోని కొందరు అధికారుల కారణంగా అక్కడి పౌరులు ఈ యుద్ధ భారాన్ని మోస్తున్నారని అన్నారు. మరోవైపు, ఇరాన్ గ్యాస్ క్షేత్రాలపై దాడి గురించి ఇజ్రాయెల్ తమకు చెప్పలేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు.పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు ఎప్పుడో తెలియని అనిశ్చితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచదేశాల నెత్తిన మరో కత్తి వేలాడుతోంది..! ఇప్పటికే హర్మూజ్ అంతరాయాలు, గ్యాస్, చమురు క్షేత్రాలపై దాడులతో ఇంధన ధరలు భగ్గుమంటున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు కుదేలవుతున్నాయి. చమురు క్షేత్రాలపై దాడులతో యుద్ధం మరోస్థాయికి చేరిన నేపథ్యంలో ఇంటర్నెట్‌పై ఇరాన్ గురిపెట్టనున్నట్లు ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి హర్మూజ్‌లో ఇరాన్.. ఎర్ర సముద్రం దక్షిణ ముఖద్వారం బాబ్ అల్ మండేబ్ జలసంధిలోని సముద్రగర్భ కేబుళ్లను హూతీలు టార్గెట్ చేస్తారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండుచోట్ల సముద్రం అడుగున వేల కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ కేబుళ్లు.. ప్రపంచ ఇంటర్నెట్‌కు అత్యంత కీలకం. వీడియో కాల్స్, ఈమెయిల్స్, బ్యాంకింగ్ లావాదేవీలు, ఏఐ సర్వీసులకు సంబంధించిన డేటానంతా మోసుకెళ్తాయి. ఎర్రసముద్రం అడుగునుంచి 17 కేబుళ్లు వెళ్తున్నాయి. ఐరోపా, ఆసియా, ఆఫ్రికాలోని ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో వీటిదే ప్రధానపాత్ర. అలాగే పర్షియన్ గల్ఫ్‌లో కూడా. భారతదేశ విదేశీ డేటా కనెక్షన్లకు ఇవి కీలకం.

టెక్ కంపెనీల్లో వణుకు..

అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు గల్ఫ్ దేశాల్లో డేటాసెంటర్ల కోసం బిలియన్ల కొద్దీ డాలర్లను కుమ్మరించాయి. ఈ ప్రాంతాన్ని కృత్రిమ మేధకు ఒక ముఖ్యమైన కేంద్రంగా మార్చాలన్నది టెక్ సంస్థల ప్రణాళిక. ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని యూజర్లు, మార్కెట్లను డేటా సెంటర్లతో ఈ కేబుళ్లు అనుసంధానిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీమైన్స్ అమర్చడం, ఉద్దేశపూర్వకంగా కత్తిరించడం, ఏదైనా ప్రమాదం వంటివి జరిగితే కొన్ని వారాలు లేక నెలలు పనిచేయవు. ఎందుకంటే.. దెబ్బతిన్న కేబుళ్లను సరిచేసేందుకు ప్రత్యేక నౌకలు ఆ జలసంధుల వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అలా వెళ్లడం అసాధ్యంగా కనిపిస్తోంది.ఇరాన్ అనుబంధ గ్రూప్ హూతీ తన మిత్రులకు మద్దతుగా ఎర్రసముద్రంపై విరుచుకుపడుతుంటుంది. హమాస్‌పై ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా 2024లో ఎర్రసముద్రంలో పలు కేబుళ్లపై దాడులు చేసింది. దాంతో ఆసియా, ఆఫ్రికాలో ఇంటర్నెట్ వేగం నెమ్మదించింది. వాటిని సరిచేయడానికి నెలల సమయం పట్టింది. ఇప్పుడు హర్మూజ్‌లో ఇరాన్ సీమైన్స్‌ను పరిచిన సంగతి తెలిసిందే. ఇవి ఇంటర్నెట్‌కు ప్రమాదంగా పరిణమించాయి. ఇదిలాఉంటే, ప్రస్తుతం సముద్రగర్భంలో 300కు పైగా కీలక ఫైబర్ ఆప్టిక్ లైన్లు ఉన్నాయి. ఫోన్‌కాల్స్, రోజువారీ జరిగే బిలియన్ డాలర్ల అంతర్జాతీయ నగదు లావాదేవీలు, దౌత్య సందేశాలు వంటివి వీటినుంచే సాగుతుంటాయి. ప్రపంచ కమ్యూనికేషన్లలో 90శాతానికి ఇవే ఆధారం. శాటిలైట్ కనెక్షన్, ఉపరితల కేబుళ్లతోపాటు ప్రపంచ కమ్యూనికేషన్ వ్యవస్థలకు సముద్రగర్భ కేబుళ్లు అత్యంత కీలకంగా వ్యవహరిస్తాయి. సాధారణంగా, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు బహుళ యాక్సెస్ పాయింట్లను ఏర్పాటుచేస్తారు. ఏదైనా సమస్య వల్ల ఒకటి విఫలమైనా.. మిగిలిన పాయింట్ల నుంచి వినియోగదారులకు ఇంటర్నెట్ అందుతుంది. అయితే సేవలు నెమ్మదిస్తాయి.

పశ్చిమాసియాకు వేలాదిగా యూఎస్ బలగాలు..!

అమెరికా– ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం ఇప్పుడే సద్దుమణిగే అవకాశాలు కన్పించడం లేదు. ఇరాన్‌తో జరుగుతోన్న పోరును తదుపరి దశకు తీసుకెళ్లేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగా వేలాదిగా యూఎస్ బలగాలను పశ్చిమాసియాకు తరలించాలని యోచిస్తున్నట్లు సమాచారం.

## మరింత దిగొచ్చిన బంగారం, వెండి ధరలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):భౌగోళిక ఉద్రిక్తతల వేళ భారీగా పెరిగే స్వభావం కలిగిన బంగారం, వెండి యూటర్న్ తీసుకుంటున్నాయి. డాలరు బలోపేతం కావడం, అమెరికాలో ట్రెజరీ బాండ్లపై రాబడులు పెరగడంతో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే వీటి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. తాజాగా ద్రవ్యోల్బణ భయాల నేపథ్యంలో వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచుతూ అమెరికా ఫెడ్ తీసుకున్న నిర్ణయం వీటి ధరలపై మరింత ప్రభావం చూపింది. వడ్డీ రేట్లు అధిక స్థాయిలో ఉన్నప్పుడు బంగారం, వెండి వైపు పెట్టుబడులు తగ్గుతాయని, ఈ కారణంగానే అంతర్జాతీయంగా వీటి ధరలు దిగొచ్చాయని అనలిస్టులు పేర్కొంటున్నారు. దీన్ని అనుసరించి దేశీయంగానూ బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి.మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో ఏప్రిల్ కాంట్రాక్ట్ కిలో వెండి ఒక్కరోజులోనే 8 శాతం మేర పతనమైంది. ఏకంగా రూ.19 వేలు మేర తగ్గి రూ.2.29 లక్షలకు చేరింది. బంగారం సైతం 4 శాతం మేర తగ్గుముఖం పట్టింది. 10 గ్రాముల బంగారం ఏప్రిల్ నెల డెలివరీ దాదాపు రూ.6 వేలు మేర క్షీణించి రూ.1.46 లక్షలకు చేరింది.అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్‌లో నిన్నటి వరకు 5 వేల డాలర్ల వద్ద ట్రేడవుతూ వచ్చిన బంగారం ఔన్సు ధర ప్రస్తుతం 4,682 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి సైతం ఔన్సు 70 డాలర్ల వద్ద కొనసాగుతోంది. సాయంత్రం 4.50 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.1.52 లక్షలు పలుకుతోంది. వెండి కిలో రూ.2.36 లక్షలుగా ఉంది.

### అస్సాంలో భాజపా తొలి జాబితా

భూపేన్ కుమార్ బోరా బిహ్‌పురా నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతున్నారు. ఇక, బుధవారం కాంగ్రెస్‌ను వీడి భాజపాలో చేరిన ప్రద్యుత్ బోర్డోలోయ్ దిస్పూర్ నుంచి ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. కాగా.. 126 అసెంబ్లీ స్థానాలు ఉన్న అస్సాంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

సామాజిక సమస్యలను,సమాజంలోని రుగ్మతలను పరిష్కరించుకోవడానికి

# సినిమా ఓ ఆయుధం



అందుబాటులో ఉన్నాయి. గద్దర్.. ప్రజా యుద్ధనౌక. గద్దర్ అనే ఒక పేరు కొన్ని లక్షల మందిని ప్రభావితం చేసింది. సామాజిక రుగ్మతల మీద యుద్ధం చేయడానికి ప్రోత్సహించిన గొప్ప గళం. గద్దర్ గళమంటే తెలియని వారు ఈ దేశంలో లేరు. ఎన్నో ఉద్యమాలకు ఆయన ఊపిరి పోశారు” అని సీఎం గుర్తు చేశారు.అంతకుముందు ఉగాదిని పురస్కరించుకుని తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. మాదాపూర్ హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ ఈ వేడుకకు వేదికైంది. తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రముఖ నటుడు చిరంజీవి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికెట్ పొందిన చిత్రాలకు సంబంధించి ఇప్పటికే విజేతల వివరాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. వారిలోని పలువురికి డిప్యూటీ సీఎం పురస్కారాలు అందజేశారు. ప్రశంసా పత్రంతోపాటు నగదు ప్రోత్సాహకాన్ని విజేతలు అందుకున్నారు. జ్యూరీ కమిటీకి గోల్డెన్ మెమెంటో, ప్రశంసా పత్రంతోపాటు రూ.లక్ష నగదు ప్రోత్సాహకాన్ని టీఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు అందజేశారు. ఉగాది పండగని పురస్కరించుకుని తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవాన్ని గురువారం నిర్వహించారు. మాదాపూర్‌లోని హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ ఈ వేడుకకు వేదికైంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై, విజేతలకు అవార్డులు అందజేయనున్నారు. ఇప్పటికే విజేతలను ప్రకటించిన సంగతి తెలిసిందే. విజేతల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి..

### ఇది రైతునామ సంవత్సరం

హైదరాబాద్(జనంసాక్షి): రైతును రాజుగా చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అన్నదాతలు బాగున్నప్పుడే రాష్ట్రం సుఖశాంతులతో ఉంటుందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటి చేస్తామని పునరుద్ఘాటించారు. కర్షకులు ఆత్మగౌరవంతో బతికేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందన్న ఆయన రైతుభరోసా ద్వారా ఇప్పటికే 18వేల కోట్లను ఇచ్చామన్నారు. ఈనెల 22 నుంచి రైతుభరోసా కార్యక్రమం ప్రారంభమవు తుందన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో భాష, సంస్కృతి, దేవాదాయ శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన పంచాంగం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.సాగునీటి ప్రాజెక్టులు, రైతుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశంలో తెలంగాణ ప్రతిష్ఠను పెంచుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భూభారతి చట్టాన్ని తీసుకువచ్చి రైతుల సమస్యలను పరిష్కారించామని వెల్లడించారు. ఫలితంగా ఈనాడు రైతులు సంతోషంగా తమ యాజమాన్య హక్కులను పొందుతున్నారని తెలిపారు. సాదాబైనామాలకు కూడా త్వరలోనే పరిష్కారం చూపిస్తామన్నారు. ఉగాది అనేది రైతుల పండుగని అభివర్ణించారు. కర్షకుల అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషిచేస్తుందని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో 70 శాతం వ్యవసాయ ఆధారిత కుటుంబాలే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్రమంతులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి, పొన్నం, కొండా సురేఖలు పాల్గొన్నారు. ఉగాది వేడుకల సందర్భంగా మధ్యాహ్నం మూడు గంటలకు రవీంద్రభారతిలో కవి సమ్మేళనం ఉంది.శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ మేరకు దేవాలయశాఖ భద్రాచల సీతారామచంద్రస్వామి ఆలయం తరఫున సీఎంకు ఆహ్వానించారు. బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డి కొండా సురేఖను ఆహ్వానించారు. ఇవాళ్టి నుంచి ఏప్రిల్ 2 వరకు శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు జరగుతున్నాయి. ఈనెల 27న స్వామివిరి తిరుమంజనం ఉంటుంది.

## మసకబారిన ఖతార్ కలికితురాయి..!

టెహ్రాన్:ఖతార్ ఈశాన్య ప్రాంతంలో ఒకప్పుడు ఎటువంటి హడావుడి లేని రస్ లఫాన్ నగరం ఇప్పుడు ప్రపంచంలోనే గ్యాస్ వాణిజ్యానికి ఆయువుపట్టుగా ఉంది. దాదాపు 20 ఏళ్లలో ఈ ప్రదేశం లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ పరిశ్రమకు హబ్‌గా ఎదిగింది. తాజాగా ఇక్కడి గ్యాస్ పరిశ్రమపై ఇరాన్ (ఎతీజీని) దాడి చేయడంతో అంతర్జాతీయ మార్కెట్లు భారీ నష్టాల్లో కూరుకుపోయాయి. ఖతార్ రాజధాని దోహాకు ఈశాన్యంగా 80 కిలోమీటర్ల దూరంలో పర్షియన్ గల్ఫ్ తీరంలో రస్ లఫాన్ నగరం ఉంది. భౌగోళికంగా వ్యూహాత్మక ప్రదేశంలో ఉండటంతో ఇది ఆసియా, ఐరోపా ఎగుమతులకు అత్యంత అనువైన ప్రదేశం. విశాలమైన తీర ప్రాంతంతో ఇది మెగా నౌకాశ్రయంగా, ఎగుమతులకు అనుకూలమైనదిగా పేరొందింది. 1971లో ఖతార్ నార్త్ ఫీల్డ్ నాన్ అసోసియేటెడ్ గ్యాస్ క్షేత్రాన్ని (చమురు నిల్వలు తక్కువగా.. గ్యాస్ నిల్వలు అత్యధికంగా ఉండేవి) కనుగొంది. దీనిని ఇరాన్‌తో కలిసి పంచుకొంది. ఖతార్ వైపు దానిని నార్త్ ఫీల్డ్‌గా(నార్త్ డోమ్).. ఇరాన్ వైపు దానిని సౌత్ ఫార్స్ క్షేత్రాలుగా పిలుస్తారు. ప్రాథమికంగా ఇక్కడ లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ ఉత్పత్తి అవుతోంది. ఈ సౌత్ ఫార్స్ క్షేత్రాన్నే పేల్చేస్తానని తాజాగా ట్రంప్ హెచ్చరించారు.1980ల్లో ఈ గ్యాస్‌తో తమ ఆర్థికస్థితిని పూర్తిగా మార్చేసుకోవచ్చని ఖతార్ పాలకులు గుర్తించారు. ఆరంభంలోనే ఖతార్ పాలకులు దార్శనికత ప్రదర్శించారు. ముడి గ్యాస్‌గా విక్రయిస్తే పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండదని భావించి.. దానిని ప్రాసెస్ చేసి ఎల్ఎన్‌జీగా మార్చి విక్రయించాలని నిర్ణయించారు. వాస్తవానికి అప్పటికి ఎల్ఎన్‌జీ భవిష్యత్తుపై ఎవరికీ స్పష్టత లేదు. అయినా సరే ఇందుకోసం ఓ భారీ పారిశ్రామిక హబ్‌ను ఏర్పాటు చేయాలని భావించారు. ఇందుకోసం భారీ నౌకలు ఆగేలా లోతైన సముద్రతీరం ఉన్న రాస్ లఫాన్ నగరాన్ని ఎంపిక చేశారు. ఖతార్ ఎనర్జీ (అప్పటి ఖతార్ పెట్రోలియం) చొరవతో రెండు జాయింటు వెంచర్లను ఏర్పాటుచేశారు. డజన్ల కొద్దీ ఎల్ఎన్‌జీ ట్రెయిన్లు (ఎల్ఎన్‌జీని ప్రాసెస్ చేసే యూనిట్లు) నిర్మించారు. భారీ స్టోరేజీ ట్యాంకులు, ఎక్స్‌పోర్టు టెర్మినళ్లు వంటి వాటిని అనుసంధానంగా ఏర్పాటు చేశారు. ఇక్కడి అత్యాధునిక పోర్టు వద్ద ప్రపంచంలోనే అతిపెద్ద ఎల్ఎన్‌జీ క్యారియర్లను నిలపవచ్చు. 1996లో తొలిసారి ఎల్ఎన్‌జీ షిప్‌మెంట్ ఇక్కడినుంచి జపాన్‌కు పయనం కావడంతో రాస్ లఫాన్ నగరం వెలుగులోకి వచ్చింది. 2000 సంవత్సరం నాటికి ఇది ఖతార్ కలికితురాయిగా మారింది. 2010 నాటికి అతిపెద్ద పారిశ్రామిక నగరాల్లో ఒకటిగా ఎదిగింది. దీంతోపాటు ఎల్ఎన్‌జీ ఎగుమతి చేసే అతిపెద్ద పోర్టు కూడా ఇక్కడే ఉంది.

# రైతు సంక్షేమ సర్కారు మాది

**సిద్ధిపేట(జనంసాక్షి):**రైతులు పంటల వైవిధ్యం గురించి మరింత ఆలోచించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నా.. రైతుల సంక్షేమం గురించే ఆలోచిస్తానన్నారు. డిమాండ్ బాగా ఉండి, లాభాలు బాగా వచ్చే పంటల వైపు రైతులు మళ్లాలని సూచించారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో నిర్వహించిన రైతు మహోత్సవంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్‌ను మరింత ప్రోత్సహించాలని కేంద్రాన్ని కూడా అడిగినట్లు చెప్పారు. పామాయిల్ దిగుమతిపై పన్ను పెంచితే.. దేశంలో రైతులకు మేలు కలుగుతుం దన్నారు. ఆయిల్ రిఫైనరీకి కూడా శంకుస్థాపన చేయబోతున్నట్లు చెప్పారు. “పామాయిల్ రిఫైనరీ కూడా సిద్దిపేటలోనే పెట్టాలని ముఖ్యమంత్రికి ప్రతిపాదించాను.



రాష్ట్రానికి మధ్యలో ఉన్నందున అందరికీ ప్రయోజనం కలుగుతుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పామా యిల్ ఫ్యాక్టరీ నిర్మాణాలను మొదలుపెట్టాం” అని తుమ్మల అన్నా రు.మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. మొదట్లో సిద్దిపేట ప్రాంతం ఆయిల్‌పామ్ పంటకు అనుకూలం కాదని శాస్త్రవేత్తలు చెప్పినట్లు తెలిపారు. గాలిలో తేమశాతం తక్కువగా ఉన్నందున పంట దిగుబడి రాదని అప్పట్లో చెప్పారన్నారు. “ఆ తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు కింద కట్టిన జలాశయాల వల్ల సిద్దిపేట ప్రాంతంలో గాలిలో తేమశాతం పెరిగింది. క్రమంగా ఆయిల్‌పామ్ సాగుకు సిద్దిపేట అనుకూలంగా మారిందని శాస్త్రవేత్తలు చెప్పారు. వెంటనే సిద్దిపేట ప్రాంతంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి కృషి చేశాం. ప్రభుత్వం రూ.300 కోట్లతో సిద్దిపేట జిల్లాకు పామాయిల్ ఫ్యాక్టరీ మంజూరు చేసింది. కరువొచ్చినా.. వరదొచ్చినా.. ఆయిల్‌పామ్ పంటకు ఇబ్బంది ఉండదు. రైతులకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం ఇచ్చి సాగును ప్రోత్సహించాలి. ఖమ్మం జిల్లా తర్వాత సిద్దిపేట జిల్లాలోనే అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగవుతోంది. ఆయిల్‌పామ్ సాగులో ఉత్తమ రైతు అవార్డు సిద్దిపేట జిల్లా వాసికి రావడం సంతోషం” అని హరీశ్‌రావు అన్నారు.

## పార్టీ ఆవిర్భావ నాడే ఎజెండా ప్రకటిస్తా

**- పార్టీ పేరు ‘తెలంగాణ ప్రజా జాగృతి’**

**- ప్రకటించిన పార్టీ అధ్యక్షురాలు కవిత**

**- నమోదు ప్రక్రియ కోసం దిల్లీ హైకోర్టులో పిటిషన్**

ఆశ్రయించారు. అయితే, దరఖాస్తులో చాలా లోపాలున్నాయంటూ ఆమెకు ఫిబ్రవరి 23నే సమాచారం పంపామని ఈసీఐ తరఫు న్యాయవాది ఫిబ్రవరి 27న విచారణ సందర్భంగా దిల్లీ హైకోర్టుకు తెలిపారు. ఆ రోజు కవిత తరఫు ముఖ్య న్యాయవాది ఆసుపత్రిలో ఉన్నందున విచారణను వాయిదా వేయాలని కోరడంతో కేసు మార్చి 19కి వాయిదా పడింది. ఆ పిటిషన్ గురువారం మరోసారి విచారణకు రానుంది.

**పార్టీ ప్రారంభించినప్పుడే అజెండా, లక్ష్యాలు ప్రకటిస్తా: కవిత**

కొత్త పార్టీ అజెండాపై కసరత్తు జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపారు. పార్టీ ప్రారంభించినప్పుడే అజెండా, లక్ష్యాలు ప్రకటిస్తానన్నారు. ‘డాడీ, మోడీ, చిన్న మోడీ’పైనే తన పోరాటం ఉంటుందన్నారు. సామాజిక తెలంగాణ ధ్యేయంతో సర్వోదయ తెలంగాణ దిశగా ముందుకు వెళ్తామన్నారు. గాంధీజీ సర్వోదయ సిద్ధాంతాన్ని లోతుగా అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు.

# భూవివాదం వేధింపులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య

- ఆరేండ్లుగా కేసులు, బెదిరింపులు..
- సూసైడ్ నోట్‌లో తీవ్ర ఆరోపణలు



**భూదాన్ పోచంపల్లి, మార్చి 19 (జనంసాక్షి) :** భూవివాదంతో నెలకొన్న మానసిక ఒత్తిడిని తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... బోదాసు శ్రీనివాస్ (38), తండ్రి యాదయ్య, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం అన్నోజిగూడ సూర్యనగర్ కాలనీలో నివసిస్తూ శామీర్‌పేట్‌లోని సాయి లైఫ్ సైన్సెస్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దంతూరు గ్రామం, దంతూరు గ్రామంలోని తన వ్యవసాయ భూమిపై కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కొందరు భూ కబ్జాదారులు తప్పుడు సాక్ష్యాలు సృష్టించి కోర్టులు, పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గత ఆరు సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ వివాదంతో మానసికంగా తీవ్రంగా బాధపడుతున్న శ్రీనివాస్, మార్చి 19 తెల్లవారుజామున తన నివాసంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మరణానికి ముందు తన బాధలను వివరిస్తూ సుసైడ్ నోట్ రాసినట్లు సమాచారం. భూమి వివాదంలో భాగంగా పలువురు వ్యక్తులు తనను మానసికంగా వేధించి, బెదిరింపులకు గురిచేశారని అందులో పేర్కొన్నట్లు తెలిసింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు.

# అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** అకాల వర్షాలు, వడగండ్ల వానకు నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేలు పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, తీగల సాగర్ డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, వడగండ్ల వానకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లాలో 217 మేకలు మృత్యువాతపడ్డాయని, వనపర్తి జిల్లాలో పిడుగుపాటుకు ఒక వ్యక్తి మృతి చెందారని, మంచిర్యాల, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. విద్యుత్ సరఫరా లో అనేక జిల్లాల్లో అంతరాయం ఏర్పడిందని, కూరగాయలు, మొక్కజొన్న, వరి, పత్తి, మిరప పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, మహబూబ్‌నగర్ జిల్లాలో మొక్కజొన్న, పుచ్చకాయలు వర్షానికి తీవ్రంగా దెబ్బతిన్నాయని, మామిడికాయలు నేలరాలిపోయాయని, పదివేల ఎకరాలకు పైగా మిర్చి, మామిడి పుచ్చకాయ, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని, వికారాబాద్ జిల్లా పూడూరు మండలం నిజాంపేట మామిడిపల్లి సమీపంలో వడగండ్ల వర్షానికి 217 మేకలు మృత్య వాత పడ్డాయి. రాష్ట్రంలో జరిగిన పంట నష్టాన్ని సమగ్రంగా పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని, నష్టపోయిన రైతులకు భరోసా ఇవ్వాలని కోరారు.

# సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్లైన్ శిక్షణ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ అఫ్ సైబర్ సెక్యూరిటీ దేశ, విదేశాలలో అత్యంత ప్రాధాన్యత కలిగినటువంటి సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్లైన్ ట్రైనింగ్‌కు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆన్లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. ఇంటర్ పాస్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా ఒ ఇంజనీరింగ్ చదువుతున్న, పూర్తి చేసిన విద్యార్థులు ఈ సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్లైన్ ద్వారా ట్రైనింగ్ పొందేందుకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్, డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ ఒ ఎథికల్ హాకింగ్, పీజీ డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హాకింగ్. మాస్టర్ ప్రోగ్రాం ఇన్ సైబర్ సెక్యూరిటీ ఒ ఎథికల్ హాకింగ్. శిక్షణ కాలం 5 నుండి 10 నెలల వరకు,శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో సర్టిఫికెట్స్ ప్రధానం చేస్తామని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ, విదేశాలలో విస్తృత ఉపాధి అవకాశాలుంటాయని, సైబర్ సెక్యూరిటీ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు సాఫ్ట్వేర్, ఐ.టి, బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్ కేర్, రిటైల్, ఈ కామర్స్, ఎడ్యుకేషన్ రంగం లో సైబర్ సెక్యూరిటీ ఆఫీసర్, ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, ఇన్ఫర్మేషన్ అనలిస్ట్, పెనిట్రేషన్ టెస్టర్, సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ ఇంజనీర్, సెక్యూరిటీ సిస్టమ్స్ అడ్మినిస్ట్రేటర్, ట్రైనర్ మొదలగు ఉద్యోగావకాశాలున్నాయని తెలిపారు. ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు **www.nationalcyber-securityacademy.org** వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

# 80 శాతం రాయితీతో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సులకు శిక్షణ

- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ లో దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నేషనల్ స్కిల్ అకాడమీ ద్వారా 80% రాయితితో 100 కి పైగా కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సులకు ఆన్‌లైన్‌లో శిక్షణ, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ప్రోగ్రామ్ ఇంటర్, ఇంజినీరింగ్ , డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చు. నేషనల్ స్కిల్ అకాడమీ విద్యార్థులు సరికొత్త సాఫ్ట్వేర్ టెక్నాలజీలలో తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి ఒక ప్రత్యేకమైన అవకాశాన్ని అందిస్తోంది. దరఖాస్తుదారులు ఏఐ అండ్ ఎంఎల్, డేటా సైన్స్ లో పీజీ డిప్లొమా, డిప్లొమా కోర్సులతో పాటు 100 కి పైగా కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల నుండి ఏదైనా కోర్సు ఎంపిక చేసుకోవచ్చు. బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, పైథాన్, మెషిన్ లెర్నింగ్ మరియు బిజినెస్ అనలిటిక్స్ ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, బ్లాక్‌చెయిన్, డీప్ లెర్నింగ్, సెలీనియం, సేల్స్‌ఫోర్స్, జావా, ఒరాకిల్, సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, వెబ్ డిజైన్ కోర్సు లతో పాటు 100 కి పైగా కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల నుండి ఏదైనా కోర్సు ఎంపిక చేసుకోవచ్చు. కోర్సులు ఈ-లెర్నింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో శిక్షణ అందించబడుతుంది, తర్వాత పరీక్షలను నిర్వహిస్తారు. పాస్ అయిన విద్యార్థులు ఉచితంగా కేంద్ర ప్రభుత్వ ఆమోదించిన సర్టిఫికేట్‌ను అందుకుంటారు. కోర్సు వ్యవధి 2 నెలల నుండి 10 నెలల వరకు ఉంటుంది, సబ్జెక్ట్‌లో ఇన్ డెప్త్ నాల్డెజ్ పొందేందుకు విద్యార్థులకు ఇది చక్కటి అవకాశంగా నిలుస్తోంది. ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విదేశాలలో అధిక వేతనాలతో ఉత్తమ ఉపాధి అవకాశాలు గలవు. ఆసక్తి గల అభ్యర్థులు www.national-skillacademy.in లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని నేషనల్ స్కిల్ అకాడమీ డైరెక్టర్ వెంకటరెడ్డి తెలిపారు.

# ఎల్‌బీనగర్‌లో తీవ్ర ఉద్రిక్తత

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి అరెస్ట్
- యువ జన కాంగ్రెస్ డ్రగ్స్ టెస్ట్ వైట్ ఛాలెంజ్ విషయంలో గొడవ




**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఎల్‌బీనగర్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బుధవారం యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఎల్‌బీ నగర్ అంబేద్కర్ విగ్రహ కూడలిలో డ్రగ్స్ టెస్ట్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతు 'నేను నా కుటుంబం సభ్యుల తో డ్రగ్స్ టెస్ట్ కు వస్తే ఎల్ బి నగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి బయపడి తన గంజాయి బ్యాచ్ తో వచ్చి టెస్ట్ లకు ఇవ్వకుండా బి ఆర్ ఎస్ నాయకులు తమ చిత్త శుద్ధి నిరూపించుకోకుండా గొడవలు శృష్టించి సమస్య ను పక్క దారి పట్టించాలనుకోవడం సిగ్గు చేటు' అని అన్నారు. శాంతి యుతంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు టెస్ట్ లు ఇస్తుంటే కావాలని గొడవ చేయడం ఏమిటి అని ప్రశ్నించారు. ఇపటికైనా ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి తన అనుచరులు డ్రగ్స్ టెస్ట్ చేపించుకొని వైట్ చాలంజ్ కు కట్టిబడి ఉండాలి అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈగల్ టీమ్ ఏర్పాటు చేసి తెలంగాణ ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చూడాలి అనుకుంటే బి ఆర్ ఎస్ నాయకులు మాత్రం డ్రగ్స్ ను ప్రాచ్చుహిస్తూ తెలంగాణను బదనాం చేయాలి అనుకుంటే యూత్ కాంగ్రెస్ అడుగు అడుగున అడ్డుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమములో టీపీసీసీ మెంబర్ జక్కిడి ప్రభాకర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ దరపెల్లి రాజశేఖ రెడ్డి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి యరల రామ్ రెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల జైపాల్ రెడ్డి బుడ్డ సత్యనారాయణ అశోక్ గౌడ్ డివిజన్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్ గౌడ్ మరియు కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు మహిళా సోదరి మణులు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- క్వింటాలుకు 2400 మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రైతు ఐక్యవేదిక విజ్ఞప్తి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించి క్వింటాలుకు 2400 రూపాయల మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంట చేతికొచ్చినప్పటికీ కోనుగోలు కేంద్రాలను అధికారులు సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో ఇదే అదనుగా భావించి ప్రైవేట్ వ్యాపారులు, దళారులు, పౌల్ట్రీ నిర్వాహకులు గ్రామాల్లో రైతుల వద్ద నుంచి మొక్కజొన్నను మద్దతు ధర కంటే తక్కువ ధరకే 1600 నుండి 1900 రూపాయల వరకే దళారులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు నిట్ట నిలువునా దోపిడీకి గురవుతుండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారనీ తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల ఇబ్బందులను,ఆర్థిక నష్టాలను దృష్టిలో ఉంచుకొని మార్క్ ఫెడ్ ద్వారా మొక్క జొన్న కోనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి 2400 మద్దతు ధరతో కొనుగోలు చేసి మొక్కజొన్న రైతులను ఆదుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావులు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి విజ్ఞప్తి చేశారు.

# రూ. 52.77 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

**ముగ్గురి అరెస్ట్**



**కొత్తగూడెం (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలో పోలీసులు భారీ గంజాయి స్మగ్లింగ్ ముఠాను పట్టుకున్నారు. జూలూరుపాడు పోలీసులు, సీసీఎస్ (జజూ) సిబ్బంది సంయుక్తంగా బుధవారం సాయంత్రం నిర్వహించిన వాహన తనిఖీల్లో సుమారు 105.54 కిలోల గంజాయి పట్టుబడింది. దీని మార్కెట్ విలువ దాదాపు రూ. 52,77,000 ఉంటుందని కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. స్థానిక పోలీస్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గంజాయి ముఠాను పట్టుకున్న తీరును ఆయన వివరాలను వెల్లడించారు. గంజాయి తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జూలూరుపాడు పోలీసులు, సీసీఎస్ సిబ్బంది సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు కార్లను పోలీసులు ఆపారు. ఆ కార్లలో సోదాలు చేయగా దాచి ఉంచిన 52 గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. కార్లలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించగా.. ఆంధ్ర రాష్ట్రంలోని కలిమెల, డొంకరాయి ప్రాంతాల నుండి గంజాయిని కొనుగోలు చేసినట్లు అంగీకరించారు. ఈ గంజాయి పొట్లాలను భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం మీదుగా హైదరాబాద్‌కు తరలించి విక్రయించాలని చూశామని వీరు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లాకు చెందిన శివాకర్ ప్రమోద్ కుమార్ (35), బైరెడ్డి భార్గవ్ (30), రంగారెడ్డి జిల్లా వనస్థలిపురానికి చెందిన అందేకర్ శ్రీనివాస్ (40)లు కార్లలో గంజాయి తరలిస్తూ పట్టబడ్డారు. ఈ ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు.. రెండు కార్లు, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు అబి, లక్ష్మణ్, ఫారుక్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ హెచ్చరించారు. 2025 జనవరి నుండి ఇప్పటివరకు జిల్లాలో 86 కేసుల్లో సుమారు రూ. 34 కోట్ల రూపాయల విలువైన 68,44 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే ఈ ముగ్గురు నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసి, వారి ఆస్తులను జప్తు చేశామని.. త్వరలోనే మరికొందరిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో చాకచక్యంగా వ్యవహరించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, జూలూరుపాడు ఎస్సై బాదావత్ రవి, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విలేకరుల సమావేశంలో జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ లక్ష్మీ, ఎస్ఐ బాదావత్ రవి, ఏఎస్సై, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఆగి ఉన్న స్కూల్ బస్సును ఢీకొట్టిన లారీ

- 9మంది విద్యార్థులకు గాయాలు
- సిద్దిపేట జిల్లా ఇబ్రహీంనగర్‌లో ఘటన

**సిద్దిపేట (జనంసాక్షి) :** ఆగి ఉన్న స్కూలు బస్సును వెనుక నుంచి వచ్చిన సిమెంటు లోడ్ లారీ అతివేగంగా ఢీకొట్టింది. దాంతో తొమ్మిది మంది విద్యార్థులకు గాయలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటలోని రావూస్ పాఠశాలకు చెందిన బస్సు మండలంలోని ఆయా గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకొచ్చే క్రమంలో ఇబ్రహీంనగర్ గ్రామంలో స్కూల్ పిల్లలు ఎక్కడానికి ఆగింది. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన సిమెంట్ లోడ్ లారీ బలంగా బస్సును ఢీకొన్నది. దాంతో బస్సులో ఉన్న తొమ్మిది మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనం ద్వారా సిద్ధిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యం అందించారు. కాగా విద్యార్థులకు తీవ్ర గాయాలు కాకపోవడంతో.. పిల్లల తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న చిన్నకోడూరు ఎస్ఐ చంద్రమోహన్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# ఆయిల్‌పామ్ రైతులకు లాభాల పంట

- ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- అనువైన స్థలం కోసం కలెక్టర్‌తో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన



**నిజామాబాద్ (జనంసాక్షి) :** రైతులకు లాభాల పంట ఆయిల్ పామ్ పంట అని, దాని అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండలం గుత్ప గ్రామ శివారులో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయిల్ పామ్ ఇండస్ట్రీ నెలకొల్పేందుకు అనువైన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధిక లాభాలను అందిస్తూ, అనేక ప్రయోజనాలు సమకూర్చే ఆయిల్ పామ్ పంట సాగు దిశగా రైతులను ప్రోత్సహించేలా జిల్లా యంత్రాంగం తోడ్పాటుతో ప్రత్యేక చొరవ చూపుతున్నామని, ఫలితంగా జిల్లాలో సుమారు 7 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంట సాగు జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. స్థల నిర్ధారణ జరిగిన వెంటనే ఫ్యాక్టరీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని అన్నారు. దేశ వ్యాప్తంగా స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా 75 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు జరగాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం పది శాతం విస్తీర్ణంలోపే ఈ పంట సాగు చేస్తున్నారని తెలిపారు. స్థానికంగానే ఆయిల్ పామ్ పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తే, రైతులు అధిక లాభాలు ఆర్జించడంతో పాటు ప్రజలకు కూడా మేలు చేసిన వారవుతారని అన్నారు. ఆయిల్ పామ్ పంట సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలను అందిస్తోందని, ఇన్ పుట్ సబ్సిడీని రైతు ఖాతాలో జమ చేస్తోందని తెలిపారు. ఆయిల్ పామ్ మొక్కలకు అయ్యే వ్యయంలో కూడా అధిక మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తూ సబ్సిడీ రూపంలో కంపెనీలకు చెల్లిస్తుందని అన్నారు. ఆయిల్ పామ్ బోర్డు ఉన్నందున పంట అమ్మకం, ధర విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం ఉండదని భరోసా కల్పించారు. ఎకరం విస్తీర్ణంలో సుమారు పది టన్నుల వరకు దిగుబడి వస్తుందని, అంతర పంట వేసుకొని అదనపు లాభాలను సైతం పొందవచ్చని సూచించారు. ప్రస్తుతం మార్కెట్లో ఈ పంటకు ఉన్న డిమాండ్ ను బట్టి చూస్తే ఎకరానికి కనీసం రూ. రెండు లక్షల పైగా ఆదాయం ఆర్జించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. స్థల పరిశీలన జరిపిన వారిలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మెన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మెన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, రమణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
శుక్రవారం 20 మార్చి 2026

# అభివృద్ధి పేరుతో పర్యావరణ కాలుష్యం

## జీవుల మనుగకే ప్రమాదం

ప్రపంచం ఒక వైపు అభివృద్ధి, సాంకేతిక ప్రగతి, ఆర్థిక వృద్ధి అనే పేర్లతో ముందుకు సాగుతున్నప్పటికీ, మరో వైపు అదే ప్రగతి భూమి పర్యావరణాన్ని నాశనం చేస్తోంది. ముఖ్యంగా యుద్ధాలు, ఆయుధ పోటీ, పారిశ్రామికీకరణ, నియంత్రణ లేని వినియోగ సంస్కృతి కలిసి భూమి మీద కాలుష్యాన్ని భయంకర స్థాయికి తీసుకెళ్లాయి. ఇవి కేవలం ప్రస్తుత తరానికి మాత్రమే కాకుండా, భావితరాల భవిష్యత్తును కూడా ప్రమాదంలోకి నెడుతున్నాయి. ఈ నేపథ్యంలో యుద్ధాలు మరియు పారిశ్రామిక వ్యవస్థల వల్ల పెరుగుతున్న కాలుష్యాన్ని శాస్త్రీయంగా, విశ్లేషణాత్మకంగా పరిశీలించడం అత్యవసరం.

ప్రస్తుతం ప్రపంచ రాజకీయాల్లో యుద్ధాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో జరుగుతున్న ఘర్షణలు, ఇరాన్‌పై దాడులు, అలాగే ఉక్రెయిన్–రష్యా యుద్ధం ప్రపంచాన్ని తీవ్ర అస్థిరతలోకి నెట్టాయి. యుద్ధం అనేది కేవలం మానవ ప్రాణనష్టం మాత్రమే కాదు; అది ప్రకృతి వనరుల నాశనం, వాతావరణ కాలుష్యం, జీవ వైవిధ్యానికి ముప్పు వంటి అనేక సమస్యలను తెస్తుంది. బాంబులు, క్షిపణులు పేల్చడం వల్ల భారీగా కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, సల్ఫర్ సమ్మేళనాలు వాతావరణంలోకి విడుదల అవుతాయి. ఒక పెద్ద యుద్ధంలో ఒకే రోజు విడుదలయ్యే కార్బన్ ఉద్గారాలు కొన్ని దేశాల వార్షిక ఉద్గారాలకు సమానంగా ఉంటాయని పర్యావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఇరాన్‌లోని అణు కేంద్రాలు, ఆయిల్ గనులపై దాడులు జరిగితే, అవి కేవలం ఆ ప్రాంతానికే కాకుండా ప్రపంచ వాతావరణానికి కూడా పెద్ద ప్రమాదం. ఆయిల్ గనులు తగలబడితే, నెలల తరబడి కార్బన్, బ్లాక్ కార్బన్, విష వాయువులు వాతావరణంలోకి చేరుతాయి. 1991లో గల్ఫ్ యుద్ధ సమయంలో కువైట్‌లో ఆయిల్ గనులు తగలబడిన ఘటన ఒక ఉదాహరణ. ఆ సమయంలో వేల టన్నుల కాలుష్య కణాలు వాతావరణంలోకి వెళ్లి, వర్షపాతం నమూనాలను మార్చాయి, మానవ ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపాయి. అదే పరిస్థితి మళ్లీ పునరావృతం అవుతుందనే భయం ప్రస్తుతం ఉంది.

ఇక ఉక్రెయిన్–రష్యా యుద్ధం కూడా కాలుష్యాన్ని విపరీతంగా పెంచింది. యుద్ధంలో ఉపయోగించే ట్యాంకులు, యుద్ధవిమానాలు, క్షిపణులు అన్నీ భారీగా ఇంధనం వినియోగిస్తాయి. అంతేకాకుండా, యుద్ధ ప్రాంతాల్లో ఉన్న రసాయన పరిశ్రమలు, గనులు, విద్యుత్ కేంద్రాలు ధ్వంసం కావడం వల్ల ప్రమాదకర రసాయనాలు నేలలో, నీటిలో కలుస్తాయి. యుద్ధం కారణంగా అటవీ ప్రాంతాలు దగ్ధమవుతాయి, జంతుజాలం నశిస్తుంది, వ్యవసాయ భూములు అనుపయోగంగా మారుతాయి. ఈ పరిస్థితులు ఒక ప్రాంతాన్ని దశాబ్దాల పాటు పునరుద్ధరించలేని స్థితిలోకి నెట్టేస్తాయి.

యుద్ధాలతో పాటు పారిశ్రామికీకరణ కూడా కాలుష్యానికి ప్రధాన కారణం. అభివృద్ధి చెందిన దేశాలు తమ ఆర్థిక వృద్ధి కోసం భారీ పరిశ్రమలను ఏర్పాటు చేశాయి. ఈ పరిశ్రమలు గాలి, నీరు, నేల కాలుష్యానికి మూల కారణాలుగా మారాయి. కార్ఖానాల నుంచి వెలువడే కార్బన్ డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి గ్రీన్ హౌస్ వాయువులు గ్లోబల్ వార్మింగ్‌కు దారితీస్తున్నాయి. శాస్త్రీయంగా చూస్తే, ఈ వాయువులు భూమి వాతావరణంలో వేడి నిల్వచేసి ఉష్ణోగ్రతలను పెంచుతాయి. దీనివల్ల హిమపర్వతాలు కరుగుతాయి, సముద్ర మట్టం పెరుగుతుంది, వాతావరణ మార్పులు తీవ్రతరమవుతాయి. ప్లాస్టిక్ కాలుష్యం కూడా ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ప్రతి సంవత్సరం కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లోకి చేరుతున్నాయి. ఈ ప్లాస్టిక్ కణాలు సూక్ష్మ స్థాయిలో మారి 'మైక్రోప్లాస్టిక్స్' గా మారి మన ఆహార గొలుసులోకి ప్రవేశిస్తున్నాయి. చేపలు, పక్షులు, జంతువులు ఈ ప్లాస్టిక్‌ను తినడం వల్ల మరణిస్తున్నారు. అంతేకాకుండా, మనుషులు కూడా ఈ మైక్రోప్లాస్టిక్స్‌ను తాగునీరు, ఆహారం ద్వారా తీసుకుంటున్నారు. ఇది ఆరోగ్యానికి పెద్ద ప్రమాదం.

ఇ–వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) మరో పెద్ద సమస్య. పాత మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, టీవీలు వంటి పరికరాలను సరైన రీతిలో నిర్వర్తించకపోవడం వల్ల సీసం, పాదరసం, క్యాడ్మియం వంటి విష లోహాలు నేలలోకి, నీటిలోకి చేరుతున్నాయి. ఇవి మానవ శరీరంలో చేరితే నాడీ వ్యవస్థ, మూత్రపిండాలు, గుండెపై తీవ్ర ప్రభావం చూపుతాయి.

రవాణా రంగం కూడా కాలుష్యానికి ముఖ్య కారణం. వాహనాల నుంచి వెలువడే కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు గాలి నాణ్యతను దిగజార్చుతున్నాయి. నగరాల్లో వాయు కాలుష్యం కారణంగా శ్వాస సంబంధ వ్యాధులు, గుండె సమస్యలు పెరుగుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, గాలి కాలుష్యం ప్రతి సంవత్సరం లక్షల మంది మరణాలకు



కారణమవుతోంది. మెడికల్ మరియు ఫార్మా పరిశ్రమల వ్యర్థాలు కూడా ఒక పెద్ద సమస్యగా మారాయి. ఆసుపత్రుల నుంచి వెలువడే బయోమెడికల్ వ్యర్థాలు, ఔషధ అవశేషాలు నీటిలో కలిసితే అవి సూక్ష్మజీవులపై ప్రభావం చూపి యాంటీబయోటిక్ రెసిస్టెన్స్‌ను పెంచుతాయి. ఇది భవిష్యత్తులో చికిత్సకు లొంగని వ్యాధులకు దారితీస్తుంది.

గనులు, ఎరువులు, రసాయన పదార్థాల ఉత్పత్తి కూడా పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నాయి. గనుల తవ్వకం వల్ల అటవీ ప్రాంతాలు నశిస్తాయి, నేల నిర్మాణం దెబ్బతింటుంది. రసాయన ఎరువులు, పురుగుమందులు వ్యవసాయ భూముల్లో అధికంగా వాడడం వల్ల నేలలో సూక్ష్మజీవులు నశిస్తాయి, నీటి కాలుష్యం పెరుగుతుంది. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ముఖ్యంగా బొగ్గు ఆధారిత ప్లాంట్లు, భారీగా కార్బన్ ఉద్గారాలు విడుదల చేస్తాయి. ఈ మొత్తం పరిస్థితిని సమగ్రంగా పరిశీలిస్తే, మానవుడు తన స్వార్థపూరిత అభివృద్ధి కోసం భూమిని నాశనం చేస్తున్నాడని స్పష్టంగా తెలుస్తుంది. యుద్ధాలు ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నాయి. శాస్త్రీయంగా చూస్తే, గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు, జీవ వైవిధ్య నష్టం...ఇవ్వన్నీ ఒక దాని మీద మరొకటి ఆధారపడి, అంతర్గత సంబంధాలు, లింకులు కలిగి ఉంటాయి. ఒకటి పెరిగితే మరొకటి కూడా పెరుగుతుంది.

ఈ నేపథ్యంలో అభివృద్ధి చెందిన దేశాల బాధ్యత మరింత ఎక్కువ. ఎందుకంటే గత రెండు శతాబ్దాలుగా వారు భారీగా పరిశ్రమలు నడిపి, గ్రీన్ హౌస్ వాయువులను వాతావరణంలోకి విడుదల చేశారు. ప్రస్తుతం కూడా ప్రపంచ కార్బన్ ఉద్గారాల్లో పెద్ద భాగం ఈ దేశాల నుంచే వస్తోంది. అందువల్ల పర్యావరణ నష్టానికి వారు నష్టపరిహారం చెల్లించాలి అనే వాదనకు శాస్త్రీయ మరియు నైతిక ఆధారాలు ఉన్నాయి. దీనిని 'క్లైమేట్ జస్టిస్' (వాతావరణ న్యాయం) అంటారు.

అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇంకా ఆర్థికంగా ఎదుగుతున్న దశలో ఉన్నందున, వారు కూడా పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకోవాలి. కానీ ప్రధాన బాధ్యత మాత్రం చరిత్రాత్మకంగా కాలుష్యం సృష్టించిన దేశాలదే. వారు శుద్ధ ఇంధన సాంకేతికతలను అభివృద్ధి చేసి, ఇతర దేశాలకు అందించాలి. అలాగే యుద్ధాలను ప్రేరేపించే విధానాలను ఆపాలి.

మొత్తంగా చూస్తే, యుద్ధాలు, పారిశ్రామికీకరణ, వినియోగ సంస్కృతి ఇవి అన్నీ కలిసి భూమి పర్యావరణాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఇది కొనసాగితే భూమి నివాసయోగ్యత కూడా ప్రమాదంలో పడుతుంది. అందువల్ల ప్రపంచ దేశాలు యుద్ధాలకు బదులుగా శాంతి, సహకారం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

చివరిగా...ఈ భూమి మనకు వారసత్వంగా రాలేదు; మనం దాన్ని భావితరాల నుంచి అప్పుగా తీసుకున్నాం అనే భావనతో ప్రతి దేశం వ్యవహరించాల్సిన సమయం ఇది. లేకపోతే, మనం వదిలేది అభివృద్ధి కాదు విషపూరితమైన భూమి మాత్రమే.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# ఇబన్ బతూతా

## అరుదైన ప్రపంచ యాత్రికుడు



మనకి మార్కోపోలో తెలిసినంతగా ఇబన్ బతూతా అనే అరబ్బు యాత్రికుడు తెలియదు. దానికి అనేక కారణాలు. ముఖ్యంగా పాఠ్య పుస్తకాల్లో ఇబన్ బతూతా గురించి పెద్దగా ప్రస్తావించరు. అంతే కాదు ఇంకొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మార్కోపోలో కంటే మూడు రెట్లు ఇబన్ బతూతా ప్రపంచాన్ని చుట్టివచ్చాడు. క్రీ.శ.1304 లో జన్మించి క్రీ.శ. 1369 లో కన్నుమూసిన ఈ మహా ప్రపంచ యాత్రికుని జీవిత గాథ తెలుసుకుంటే అతని స్మృతికి జోహార్లు అర్పించకుండా ఉండలేము. విజ్ఞానం సముపార్జించడానికి చైనా వరకు వెళ్ళినా ఫర్వాలేదు అనే మహమ్మద్ ప్రవక్త యొక్క వాక్కుల తో ప్రభావితమయ్యి ఎక్కడో ఉత్తర ఆఫ్రికా లోని మొరాకో దేశం లోని టాంజిర్ లో పుట్టిన ఇబన్ బతూతా ప్రపంచ యాత్ర చేయడానికి బయలు దేరాడు. తన ఇరవైయో ఏటా ఇంటి నుంచి బయలు దేరి దాదాపు 25 ఏళ్ళు యూరపు,ఆసియా,ఆఫ్రికా ఖండాల్లోని 40 దేశాలు తిరిగి మళ్ళీ ఇంటికి చేరుకున్నాడు.




అప్పటి ప్రయాణ సాధనాలు కేవలం కంచర గాడిదలు, ఒంటెలు, గుర్రాలు, పడవలు ఇంకా నౌకలు మాత్రమే. వీటినన్నిటినీ ఇబన్ బతూతా సమయాన్ని బట్టి వాడుకుంటూ తన ప్రయాణాల్ని కొనసాగించాడు. తన ప్రయాణాల్లో కొన్ని చోట్ల అమీర్లు,సుల్తాన్లను మెప్పించి వాళ్ళ ఆదరణ పొందాడు. మరి కొన్ని చోట్ల సరైన వసతులు,తిండి లేక బాధపడిన రోజులూ ఉన్నాయి. అన్నిటినీ సహిస్తూ తను అనుకున్న ప్రదేశాలు తిరుగుతూ అనేక అనుభవాలను పొందాడు. తమ పూర్వికుడైన అల్ ఇద్రీసీ వేసిన పటాల్ని దగ్గర పెట్టుకున్నాడు. అవి ఆయనకి ఎంతో ఉపయోగపడ్డాయి. మనం ఈరోజున అక్షాంశాలు, రేఖాంశాలు అనే విభజన చేసుకుని భూమి మీద ఎంతో సులువుగా తిరగగలుగుతున్నాం అంటే అది అల్–ఇద్రీసీ మహాశయుని చలవ వల్లనే అని గుర్తుపెట్టుకోవాలి. డచ్ దేశానికి చెందిన మెర్కేటర్ లాంటి భూగోళ శాస్త్రవేత్తలని ఆయన పటాలు ప్రభావితం చేశాయి.

ఇబన్ బతూతా సున్నీ మత శాఖకి చెందిన వ్యక్తి.అరబిక్ భాషలో పాండిత్యం సంపాదించి కాజీగా పనిచేయడానికి తగిన విద్య అభ్యసించాడు. కైరో, జెరుసలేం, మక్కా లాంటి ప్రాంతాల్లో మూడేళ్ళు ఉన్నాడు బతూతా. కొన్ని నగరాలకి ఇప్పుడున్న పేర్లు అప్పటిలో లేవు అలాగే అప్పటి కొన్ని ప్రముఖ నగరాలు ఇప్పుడు లేవు. ఆ విషయం ఆయన వర్ణనల ద్వారా తెలుస్తుంది. ఆయన బయలు దేరిన ఆ కాలం లో మన దగ్గర ఎర్రాప్రగఢ మహాభారత అనువాదం చేస్తున్నాడు. ఇంగ్లండ్ లో చాసర్ కాంటర్బరీ టేల్స్ రాస్తున్నాడు. ఎడారుల్లో ,అడవుల్లో,జనావాసాల్లో ప్రయాణిస్తూ మసీదులు ఉన్నచోట స్థానికుల కోరిక మేరకు కాజీగా పనిచేస్తూ ముందుకి సాగిపోయాడు. ప్రస్తుతం ఉన్న కాబుల్, అలెగ్జాండ్రియా, డమస్కస్,ఇట్లా ఎన్నో ప్రాంతాల్లో విడిది చేస్తూ మక్కా లో కొన్ని ఏళ్ళు గడిపి తన ప్రయాణాల్ని సాగించాడు.

అక్కడ తనకి కలిగిన ఎన్నో అనుభవాలను, సామాజిక స్థితిగతుల్ని విపులంగా రాశాడు. అయితే ఢిల్లీ వచ్చిన దగ్గరనుంచి కొన్నింటిని మనం చదివి తెలుసుకోవాలి. మధ్యయుగాల భారతంని మన కళ్ళముందు ఉంచుతాడు. మహ్మద్ బిన్ తుగ్లక్ బతూతాని కాజీగా నియమించగా ఢిల్లీలో ఏడేళ్ళు ఆ ఉద్యోగాన్ని చేసి,సుల్తాన్ యొక్క సాయంతో మలబార్ తీరానికి వస్తాడు. అక్కడి పరిస్థితుల్ని ఎంతో విపులంగా వర్ణించాడు. అక్కడి నుంచి మాల్దీవులకి పడవు ల్లో బయలుదేరడం, ఆ అనుభవాలు మనకి ఆసక్తికరంగా అనిపిస్తాయి. కాశీ నుంచి దౌలతాబాద్‌కి 40 రోజుల్లో వస్తాడు,అది చదివినపుడు ప్రస్తుత ప్రయాణ వేగాలు గుర్తు వచ్చి ఔరా ఎంత అభివృద్ధి జరిగింది అనిపించక మానదు.

మాల్దీవుల్లో చాలా వరకు ముస్లింలు ఉన్నప్పటికీ స్త్రీలకి బుర్ఖా పద్ధతి లేదని చెబుతాడు. ఇక్కడి ప్రజలు నైతిక ప్రవర్తన గలవారని అంటూ కొబ్బరికాయలు,తమలపాకులు ,సుగధ ద్రవ్యాల్ని విదేశీయులకి అమ్మి ధనం ఆర్జించుచు న్నారని రాశాడు బతూతా. మలబార్ దగ్గర లోని హిన్నావర్ సుల్తాన్ ఈయనకి భోజనం పెట్టి బాతు,కోడి మాంసాలు వడ్డిస్తాడు. అలాగే గడ్డ పెరుగు కూడా చాలా బాగుందని అంటాడు.చెట్ల కింద మామిడి కాయలు పడి ఉన్నా ఎవరూ దొంగతనం గా తీసుకోవడం లేదని వివరించాడు. మాల్దీవుల నుంచి సిమ్హళం చేరతాడు.మార్తాండ సింగై అరియార్ అనే హిందూ రాజు ఆ రోజుల్లో సిమ్హళాన్ని పాలించినట్లు రాస్తూ, విలువైన రాళ్ళు ఇక్కడ బాగా దొరుకుతు న్నాయని చెబుతాడు. బెంగాల్ కి వెళ్ళి,అక్కడి నుంచి బర్మా ప్రాంతం, మళ్ళీ కిందికి సుమత్రా దీవులకి చేరి అక్కడి నుంచి కాంబోడియా వెళతాడు. అక్కడ నుంచి క్వాన్ జౌ అనే చైనా ఓడరేవు కి చేరతాడు.అక్కడ అనేక దేశాల నౌకలు ఉన్నట్లు చెబుతాడు. ఎన్నో ఎన్నెన్నో చిన్న పట్టణాలు ,అక్కడి అనుభవాలు ఆసక్తిగా ఉంటాయి. చైనా లోని ఆలయాలు తమకి దానాల ద్వారా వచ్చిన సంపదని ముసలివారికి,పేదవారికి వినియోగిస్తున్నట్లు తెలుసుకుంటాము. ఆ తర్వాత చైనా నుంచి తిరుగు ప్రయాణం మొదలుపెడతాడు. అప్పటికీ తనకి 45 ఏళ్ళు వచేస్తాయి. ఇంటికి చేరుకునే లోపులోనే తల్లి,తండ్రి ఇద్దరు మరణిస్తారు. వాళ్ళ సమాధుల్ని దర్శించుకుని నిర్వేదం గా జీవితం గడుపుతున్న ఇబన్ బతూతా ని తన అనుభవాల్ని రాయవలసిందిగా స్నేహితులు కోరుతారు. మార్కోపోలో కంటే మూడు రెట్లు ప్రపంచ దేశాల్లో తిరిగి,లక్షా ఇరవై వేల కిలో మీటర్లు చుట్టి వచ్చిన నువ్వు మన అరబ్బుల యొక్క గొప్పదనాన్ని చాటడానికయినా ప్రయాణ అనుభవాల్ని రాయమని స్థానిక సుల్తాన్ ఇబన్ బతూతాకి చెప్పి మాట తీసుకుంటాడు. ఒక లేఖకుడిని కూడా సాయంగా ఇస్తాడు.

ఏడు భాగాలుగా ఈ గ్రంథాన్ని రిహ్లా అనే పేరుతో రాయడం జరిగింది. దురదృష్టవశాత్తు ఈ గ్రంథం అల్జీరియా లో మూడు వందల ఏళ్ళ కి పైగా ఎవరికీ కనిపించకుండా పోయింది.చివరకి దీని ఫ్రెంచ్ అనువాదం 1853 –58 మధ్య కాలం లో రావడంతో, ఆ తర్వాత ఇంగ్లీష్ లోకి కూడా తర్జుమా చేశారు.మొరాకోలో ఇబన్ బతూతా స్మృత్యర్థం ఒక మ్యూజియం నిర్మించారు. ఎన్నో శిల్పాలు పెట్టారు.అక్కడి ఓ విమానాశ్రయానికి కూడా ఆయన పేరు పెట్టారు.దుబాయ్ లో కూడా బతూతా మాల్ అని ఓ పెద్ద నిర్మాణం చేశారు. మన తెలుగు పాఠకులకి ఇబన్ బతూతా ప్రయాణాల్ని అందించడానికి కృషి చేసిన మాచవరపు ఆదినారాయణ ఎంతో అభినందనీ యులు. 272 పేజీల ఈ పుస్తకాన్ని "సాహితి" సంస్థ ప్రచురించింది.వెల రూ.300/– అమెజాన్ లోనూ, అన్నీ ప్రముఖ పుస్తకాల షాపుల్లోనూ లభ్యమవుతోంది.

మూర్తి కె.వి.వి.ఎస్. (7893541003)

### కాల చక్రంలో కాలం ఆగదు

ఉగాది తెలుగు వారి తొలి పండుగ
ఇంటింటా మామిడి తోరణాలు
ఆరోగ్య ప్రదాయిని షడ్రుచుల పచ్చడి
కష్ట సుఖాలు చేదు తీపిల సమ్మేళనం
విశ్వావసు లోని యుద్దలు తొలిగి
పరభావ నామ సంత్సరం
విజయాభ కావాలి
పరాభవం చేరిన వేళలో
పులకింతలే మనకిదే సోత్తం
ఉక్రెయిన్ రష్యా రణం
మిగిల్చింది స్మశానపు దిబ్బలు
ట్రంపు తెంపరి తనం
ఇరాక్ మొండి పట్టు
ఇజ్రాయిల్ .ఇరాక్ ల యుద్ధం
సామాన్యుడి నడ్డి విరిచే
కష్టాల మబ్బులు తొలిగించి
కిరణాలు జల్లు కురిపించే వేళ
కలల కొంగు విప్పే ఎగిరే వెల
కొత్త ఆశల పయనం ఈ కాలం
తెలుగు తనం ఉట్టి పడాలి
ప్రకృతి తో ముడిపడి
రాశులు ,కాలగమనం
ఋతు చక్ర సంబంధం యుగాది
మనుషుల్లో మమత అనురాగలు
కోయిలల కుయాలి
మనుగడ కోసం స్వార్థం
వీడి సమైక్య రాగం అలపించాలి
సమృద్ధిగా చిగురించే నూతనం
పరభావ నామ సంత్సరం
ప్రేమ పంటలు పండించాలి
శాంతి సౌఖ్యలు నింపి
ప్రతి ఇంట వెలుగులు నింపాలి
రాశులు ఫలితాలు కాదు
మన రాశి కన్న సంకల్పం ఉండాలి
సర్వేజన సుఖినోభావంతు
విశ్వశ్రేయస్సు ను పెంచాలి
తెలుగు వారి పండుగ ఘనమైంది కానీ
గ్రహణం కాదు అని నిరూపించాలి
దేవన్ పల్లి పుర జనులకు
ఉగాది శుభాకాంక్షలు

ఉమాశేషారావు వైద్య, లెక్చరర్

### పొందే విజయం కన్నా..
### కొనసాగే పోరాటమే మిన్న..!!

గెలుపా
దాని దేముందిలే
అదొక మజిలీ..
విజయమా
అదెంతలే
అదీ వొక భావనేగా..
గెలుపోటములే
సమస్త మనుకునుడా
అదెలా కుదుర్దీ..
గెలుపైనా
ఓటమైనా
ఒకానొక
స్థలకాల
పరిమితుల్లో
అనేకానేక ప్రభావాల
బింబ ప్రతిబింబాల
పరావర్తన జ్వాలే కదా..
అలుపెరుగని
ఆచరణలుగా
సాగిన అడుగుల
సాక్షాత్కరింపబడిన
తత్వాలపు గతిగా
తేలిన తక్షణ సత్యం కదా..
గెలుపని
గోలజేయుడూ
చిందుల ఈలలేసి
ఎగురులాడులదేముందిలే..
ఇంటా.. బయటా..
ప్రపంచ మంతా..
దారి దప్పిన యుద్దాలై
నీతి మాలిన
దొంగ దాడులు
పురివిప్పిన విలయాన
ఓటమనీ
పరమ పరాభవాలనీ
ఓదార్పులేని
వొలపోతలై
కరిగి కరిగి ఇంకి
కన్నీటి భాష్పాల
విస్ఫోటనా విలాపాలై
పిడచ గట్టుకుపోవడంగాదు..
మరిగి మరిగి
పొగలు గక్కుతూ
అవిరులైన ఆవేషాలు
వొరదెత్తి పోటెత్తడం కదా
నిజమైన బతుకంటే..
పడ్డ చోటనే
గాయాల్లో గుంకి
సొగిల పడకుండా
పెను తుఫానులై
పెట్రేగడం కదా
జీవించడమంటే..
అయినా
చెరో కొసన
పీఠమేసుకు
మొరిగేటి
గెలుపోటముల
గోల నడుమ
మెట్టుమెట్టుకు పొదిగి
మూలమూలకు ఒదిగి
రెప్పవాల్చని అనుభవాలు
శ్రవిస్తున్నా కనుమూయని
మాయని గాయాల
గుణపాఠాల మాటేమిటి..
ఎడతెరిపి లేకుండా
కురుస్తున్న శతఘ్నుల వర్షానికీ
ఛిద్రం కాకుండా నిలిచిన
లక్ష్యం మీద ధ్యాసే ధ్యానమై..
చెక్కుచెదరని సంకల్పం
ఎల్లప్పుడూ ఎక్కుపెట్టి
నలుగురికోసం ప్రాణమిచ్చే
నేలతల్లి ముద్దుబిడ్డలకు
గెలుపే సర్వస్వం కానేరదు..
ప్రియమైన మిత్రమా
సహచర చెలికాడా..
చేతిలో ఏమిలేవనుకోకేం
చెలిమలన్నీ ఊటల గర్భాలతో
తేటగా మిగిలే ఉన్నాయి..
చిరుగాలి ఆగిపోలేదని
చిగుళ్ల తలలూపి
చెబుతున్నదేమిటో
వింధామా నేస్తమా..
ఏదేమైనా ఎవరేమన్నా
ఏటికి ఎదురీదే సంధి వేళ
పొందే విజయం కన్నా!
కొనసాగే పోరాటమే మిన్న!!

డా. ఇక్బాల్ పాషా
9440775732

# "మూడో కన్ను" తెరిచినప్పుడు... కనిపించే సాహిత్య ప్రపంచం!

మూడో కన్ను తెరవగానే ప్రపంచం మొత్తం మన కళ్లముందే ప్రత్యక్షమైనట్లు. మూసుకున్న కళ్లతో జీవితం చూడగలమని భావించడం ఒక అపోహ మాత్రమే. ఆ అపోహల పొరలు తొలగినప్పుడే నిజమైన ప్రపంచం మనకు కనిపిస్తుంది. చూడటానికి రెండు కళ్లే సరిపోవు; నిజాన్ని గ్రహించడానికి జ్ఞానం అనే మూడో కన్ను అవసరం.




అదే భావాన్ని గుర్తు చేసేలా ముక్కామల చక్రధర్ గారి "మూడో కన్ను" ఒక మేల్కొలుపు స్వరం. ఆయన విశ్లేషణలు మనం గమనించని అనేక విషయాలను ఒక్కసారిగా వెలుగులోకి తీసుకొస్తాయి. సాధారణంగా మన కళ్లకు కనిపించని కోణాలను ఆయన స్పష్టంగా చూపిస్తారు. ఇప్పటివరకు మనకు తెలియని నిజాలు నెమలి పురివిప్పి నాట్యం చేసినట్లు ఒక్కసారిగా మన కళ్లముందు విరబూస్తాయి. నెమలి నాట్యం చూసినప్పుడు మన కళ్లకు కలిగే ఆకర్షణ ఎంత మధురమో, "మూడో కన్ను" వ్యాసాలు చదివినప్పుడు మన ఆలోచనలకు కలిగే ఆకర్షణ కూడా అంతే గాఢంగా ఉంటుంది.

సమాజంలో దాగి ఉన్న వాస్తవాలు, కాలగర్భంలో కనుమరుగైపోయిన కవులు, మనం అలవాటుగా చూసి మర్చిపోయిన సాహిత్య సత్యాలు, ఇవన్నీ ఆయన మూడో కన్ను తెరిచిన క్షణంలోనే మన ముందుకు వస్తాయి. ఆలోచించని విషయాలను ఆలోచింపజేయడం, ప్రశ్నించని విషయాలను ప్రశ్నింపజేయడం, కనిపించని వాస్తవాలను స్పష్టంగా చూపించడం. ఇదే నిజమైన మూడో కన్ను పని.

అందుకే మూడో కన్ను అంటే కోపం కాదు, వినాశనం కాదు. అది అవగాహన. అది జ్ఞానం. అది మేల్కొలుపు. ఆ కన్ను (పుస్తకం) తెరిచినప్పుడే మనం చూస్తున్న ప్రపంచం వెనుక దాగి ఉన్న అసలు ప్రపంచం మనకు అర్థమవుతుంది. "ఆయన 'యాది' ఎట్లా మరుస్తాం..?" ఈ వ్యాసం చదివిన తర్వాత సామల సదాశివ గారిని మరవడం అసాధ్యమే అనిపిస్తుంది. ఈ వ్యాసంలో ప్రస్తావించిన ఎన్నో విషయాలు చాలా మందికి తెలియనివే అని చెప్పాలి. ఉదాహరణకు, ఉర్దూ గజల్స్‌ను మొదటిసారిగా తెలుగువారికి పరిచయం చేసింది సదాశివ గారేనని మనలో ఎంతమందికి తెలుసు? అంతేకాదు, తెలంగాణ ఉద్యమం సమయంలో ఉద్యమకారులు బయట ప్రపంచంలో జరుగుతున్న విషయాలు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రేడియో బృందంలో సదాశివ గారు కూడా కీలకంగా ఉన్నారని తెలిసినప్పుడు ఆయన వ్యక్తిత్వం ఏంటో అర్థమవుతుంది.

ఇలాంటి మరెన్నో అరుదైన విషయాలను విపులంగా అక్షరీకరించడం చక్రధర్ గారికే సాధ్యమనే భావన కలుగుతుంది. ముఖ్యంగా సదాశివ గారు మరియు విశ్వనాథ సత్యనారాయణ గారి మధ్య జరిగిన ఒక సందర్భాన్ని ఆయన ఎంతో చక్కగా , హృద్యంగా వివరించిన తీరు ఈ వ్యాసానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ వ్యాసం చదివిన తరువాతే ఆ ఇద్దరు మహనీయుల మధ్య ఉన్న ఆత్మీయత, ఆలోచనా లోతు మనకు స్పష్టంగా అర్థమవుతుంది.

"తెలంగాణ తామర పువ్వు దాశరథి" అనే వ్యాసం చదివినప్పుడు నాకు తెలియని ఎన్నో విషయాలు తెలిసి ఆశ్చర్యపోయిన సందర్భం. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అంటూ తెలంగాణ గర్వాన్ని గీతంగా పలికించిన దాశరథి కేవలం విప్లవ కవియే కాదు; భక్తి గీతాలను కూడా అంతే అలవోకగా రాయగల అరుదైన ప్రతిభ కలిగిన మహాకవి అని ఈ వ్యాసం స్పష్టంగా తెలియజేస్తుంది. విప్లవ స్వరంతో సమాజాన్ని మేల్కొలిపిన కవి, భక్తి భావంతో హృదయాలను కదిలించిన కవి. ఈ రెండు పరస్పర విభిన్నమైన ధోరణులను సమానంగా మిళితం చేసి తెలంగాణ సాహిత్యంలో ఒక శక్తిగా ఎదిగిన దాశరథి వ్యక్తిత్వాన్ని చక్రధర్ గారు ఎంతో హృద్యంగా, విశ్లేషణాత్మకంగా వివరించారు.

ఆయన రచనలు దాశరథి కేవలం ఒక కవి కాదు; తెలంగాణ ఆత్మను పలికించిన స్వరం అనే భావన స్పష్టంగా ప్రతిధ్వనిస్తుంది.

కవిత్వంలో ఒక ప్రత్యేక ప్రయోగం గా నిలిచిన "ముక్త పద గ్రస్తం" దాశరథి గారు పాట రూపంలో వినియోగించిన తీరు ఎంత అద్భుతమో ఈ వ్యాసం చదివినప్పుడు మరింత స్పష్టమవుతుంది. నిజానికి ముక్త పద గ్రస్తం అనే అలంకార శైలిపై ఈ కాలం వారికి అంతగా పరిచయం లేకపోయినా, దాశరథి కవిత్వంలో అది ఎలా ఒదిగిపోయిందో ఎంతో హృద్యంగా వివరించారు. అలాంటి అరుదైన సాహిత్యాంశాలను ఈ వ్యాసంలో పొందుపరచడమే కాకుండా, వాటిని సామాన్య పాఠకులకు సులభంగా అర్థమయ్యే రీతిలో అందించడం నిజంగా ప్రశంసనీయం. చక్రధర్ రచించిన "కూసుమంచి అగ్రహారం నుంచి మూడో కన్ను వరకు" వంటి రచనలు చదివినప్పుడల్లా ఆయన సాహిత్య దృష్టి ఎంత విశాలమో అనిపిస్తుంది. ఆయన రచనల పట్ల నాకు కూడా అపారమైన అభిమానం ఉందని ఈ సందర్భంగా చెప్పక తప్పదు.

"పూల పాటల పండుగ బతుకమ్మ"
తెలంగాణ ఆత్మను పలికించే ఆడబిడ్డ ల ఆనందోత్సవం.

తెలంగాణ ఉద్యమ కాలంలో బతుకమ్మ ఆట పాటలు కేవలం పండుగ సంబరాలు మాత్రమే కాదు, ఉద్యమానికి ఊపిరి పోసిన శక్తి గా మారాయి. గ్రామాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా మహిళలు బతుకమ్మ చుట్టూ చేరి పాడిన పాటలు ఉద్యమానికి ధైర్యాన్ని, ఆశను నింపాయి. ఆ పూల మధ్య పుట్టిన గానమూ, ఆత్మగౌరవం కోసం ఎగిసిన నినాదం కలిసి తెలంగాణ ఆత్మను ప్రపంచానికి చాటి చెప్పాయి.

అందుకే ఉద్యమ సమయంలో బతుకమ్మ ఆటపాటలతో ఉద్యమానికి ఊపిరినందించిన ఆ క్షణాలు ప్రపంచ చరిత్రలోనే ఒక గొప్ప ఘట్టంగా నిలిచాయంటారు రచయిత ముక్కామల చక్రధర్ గారు .

"దిగంబర కవితో కొన్ని గంటలు" అనే వ్యాసం చదువుతుంటే అది కేవలం ఒక రచనగా కాకుండా, మనసులో నిద్రపోయిన జ్ఞాపకాలను మెల్లగా మేల్కొలిపే అనుభూతిగా అనిపిస్తుంది. ఒక మంచి వ్యాసం పాఠకుడిని తన జీవితంలోని చిన్న చిన్న సంఘటనల వద్దకు తీసుకెళ్తేనే అది సార్థకమవుతుంది. ఈ వ్యాసం కూడా అచ్చం అలాంటి అనుభూతిని కలిగిస్తుంది.

ఈ వ్యాసం చదువుతున్నప్పుడు నా చిన్నప్పటి జ్ఞాపకాలు కళ్లముందు తిరిగాయి. చిన్నప్పుడు మా ఇంటికి అమ్మమ్మ, తాత వచ్చేవారు. వాళ్లు వచ్చిన రోజుల్లో ఇంటి అంతా ఒక ప్రత్యేకమైన ఆనందంతో నిండిపోయేది. కానీ వారు మరుసటి రోజు వెళ్తారని తెలిసిన క్షణం మనసులో ఒక విచిత్రమైన బాధ కలిగేది. "ఇంకో రెండు రోజులు ఉంటే బాగుండును" అనే ఆలోచన సహజంగానే మనసులో మెదిలేది.

అప్పుడు చిన్న పిల్లల అమాయకత్వంతో ఎన్నో చిన్న చిన్న ప్లాన్లు వేసేవాళ్లం. వాళ్లు వెళ్లే ముందు వారి బ్యాగ్ దాచిపెడితే, అది దొరకక ఇంకో రోజు అయినా ఉండిపోతారేమో అనే బాల్యపు ఊహలు మనసులో మెదిలేవి. ఆ చిన్న ప్రయత్నాల వెనుక దాగి ఉండేది ప్రేమ మాత్రమే.

అలాగే ఈ వ్యాసంలో కూడా దిగంబర కవి నగ్నముని తో గడిపిన ఆ కొన్ని గంటలు రచయితకు ఎంతో విలువైనవి గా అనిపిస్తాయి. నవ్వుతూ, మాట్లాడుకుంటూ గడిపిన ఆ క్షణాలు తక్కువ సమయం అయినప్పటికీ హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాపకాలుగా మారాయి. మనకు ఇష్టమైన వారితో గడిపిన సమయం ఎప్పుడూ చాలదనే భావన ఈ వ్యాసంలో స్పష్టంగా కనిపిస్తుంది.

అంతిమంగా ఈ వ్యాసం మనకు ఒక సత్యాన్ని గుర్తుచేస్తుంది– మన జీవితంలో గొప్ప జ్ఞాపకాలు పెద్ద సంఘటనల వల్ల కాకుండా, ఇలాంటి చిన్న చిన్న అనుభూతుల వల్ల ఏర్పడతాయి. అవి గడిచిపోయినా, మనసులో మాత్రం ఎప్పటికీ నిలిచిపోతాయి.

"మూడో కన్ను"లోని అన్ని వ్యాసాలు అద్భుతమే. ప్రతి వ్యాసానికి తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలి, ప్రత్యేకమైన అనుభూతి ఉంది. ఇక్కడ నేను కొన్ని వ్యాసాల గురించి మాత్రమే ప్రస్తావించాను. ఎందుకంటే ప్రతి వ్యాసం గురించి నేనే పూర్తిగా చెబితే, మీరు చదివే ఆసక్తి తగ్గిపోతుంది. ఈ రచనల అసలు రుచిని తెలుసుకోవాలంటే మీరు స్వయంగా చదవాలి. అందుకే మీరందరూ 'మూడో కన్ను'ను తప్పక చదవాలి. అప్పుడు మాత్రమే ఆ వ్యాసాల లోతు, భావం, అందం నిజంగా అనుభూతి అవుతుంది."

ప్రతి వారం విశాలాంధ్రలో వెలువడే ఆయన కాలమ్ చదవని రోజు లేదనడం లో ఎలాంటి అతిశయోక్తి లేదు. కూచిమంచి అగ్రహారం నుంచి "మూడో కన్ను" వరకు ఆయన రాసిన వ్యాసాల్లో నేను చదవని దాదాపు ఒక్కటీ లేదు. ఆయన నుంచి ఎప్పుడు వాట్సాప్ సందేశం వస్తుందా అని ఎదురు చూసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికీ ఆ ఆసక్తి ఏమాత్రం తగ్గలేదు అనుకోవచ్చు.

ముక్కామల గారి "మూడో కన్ను" నిజంగా అదిరిపోయింది. ఆలోచింపజేసే దృష్టి, ప్రత్యేకమైన శైలి, మనసును తాకే భావాలతో ప్రతి వ్యాసం నిలిచిపోతుంది. ఇక ఆయన "నాలుగో కన్ను" ఎప్పుడు తెరుస్తారో అని ఆసక్తిగా ఎదురు చూడాల్సిందే.



కోట దామోదర్
మొబైల్: 9391480475

# దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

- చెన్నయ్య క్షేత్రం ఆధ్యాత్మికతతో వెల్లివిరియాలి
- భాజపా రాష్ట్ర మహిళ నేత బాల త్రిపుర సుందరి

**ఉర్కొండ, మార్చి 19 (జనం సాక్షి) :** ఊరుకొండ మండల పరిధిలోని బొమ్మరాజు పల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ చేన్నయ్య గుట్ట స్వామి బ్రహ్మోత్సవాలలో పరబ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా తాడెం చిన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన భాజపా రాష్ట్ర మహిళా నేత బాల త్రిపుర సుందరి మాట్లాడుతూ,పౌరాణిక చారిత్రక ప్రాశస్తం ఉన్న పుణ్యక్షేత్రాలలో బొమ్మరాజు పల్లి చెన్నయ్య గుట్ట ఒకటని చెప్పవచ్చు. ప్రకృతి ఒడిలో పరవశించే ఈ క్షేత్రం భక్తుల పాలిట కల్పవల్లిగా నేటికి వరకు కూడా విరజి ల్లుతుంది.చెన్నయ్యగుట్టపై కొలువై ఉన్న దైవాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేసి,ఈ సందర్భంగా క్షేత్ర ప్రాముఖ్యతను, అక్కడ నెలకొన్న ప్రశాంత వాతావరణ ఆమె కొనియాడారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని క్షేత్రంలో మరిన్ని మౌలిక సరూపాయలు కల్పించాల్సిన అవసరము ఎంతైనా ఉందని నొక్కి చెప్పారు. ఈ ఆధ్యాత్మిక క్షేత్రం ఒక మారుమూల గ్రామానికి పరిమితమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందాలని ఆమె ఆకాంక్షించారు. ఇలాంటి పుణ్యక్షేత్రాలు అభివృద్ధికి గొప్ప ఊతాన్ని స్థాయి. వర్ధిల్లి, భక్తుల



కోరికలు తీర్చే మహోన్నత క్షేత్రంగా నిలవాలని మనమందరం కోరుకుందామని తెలియపరిచారు. మహిళ నేత చూపిన చొరవ ఈ క్షేత్ర ప్రగతికి ఒక శుభారంభమని గ్రామస్తులు అభినందించడం జరిగింది. ఈ సందర్భంలో నాగర్ కర్నూల్ జిల్లా ఓబిసి అధ్యక్షులు పాకుల్ దాస్ నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ, రాజకీయాల కతీతంగా ఆధ్యాత్మికతను గౌరవించే సాంస్కృతి మనది. చెన్నయ్యగుట్ట క్షేత్ర వైభవాన్ని కొనియడటం, ఆ ప్రాంత ప్రజల లో భక్తులలో నూతన ఉత్తేజాన్ని ఆధ్యాత్మిక కథను వెల్లివిరిసిందని, ఈ క్షేత్రం ముమ్ముందు ఆధ్యాత్మికత వెలుగులను పంచే దివ్యధామంగా విరజిల్లాలని భక్తులతో సంభాషించారు. రాజకీయ బాధ్యతతో తీరికలేకుండా గడిపే నేతలు తమ మూలాలను మరువకుండా ఇలాంటి పుణ్యక్షేత్రాలను సందర్శించడం విశేషం అంటూ, చెన్నయ్య గుట్టను ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్ది పవిత్రతను కాపాడాలని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు భక్తులతో దైవచింతనపై ఉన్న మక్కును చాటి చెప్పారు. చెన్నయ్య గుట్ట ప్రకృతిలో వెలిసిన ఒక అపురూపమైన క్షేత్రం. ప్రశాంతమైన వాతావరణం చుట్టు కొలువై ఉన్న ప్రకృతి అందాల నడుమ వెలసిన ఈ గుట్ట భక్తులకు మనశ్శాంతిని ప్రసాదిస్తుందని ఈ క్షేత్రం ఆధ్యాత్మికంగా మరింత వర్ధిల్లాలని, చెన్నయ్యగుట్ట పర్యటన కేవలం ఒక రాజకీయ కార్యక్రమంలో కాకుండా, ప్రజలతో అనుసంధానం అయ్యే వేదికగా నిలిచిందని చెప్పడంలో అత్యవశక్తి లేదు, ప్రజా సమస్యల పరిష్కారంలో చెన్నయ్యగుట్ట దీవెనలు సఫలం కావాలని కోరుకుందాం అని నినదించారు. ఈ దివ్య క్షేత్ర కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సర్పంచ్ చెరుకు తిరుపతమ్మ,ఉప సర్పంచ్. బోయ తిరుపతయ్య రాష్ట్ర కార్మిక సంఘం అధ్యక్షుడు మణికంఠ,కల్వకుర్తి బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్, భాజపా సీనియర్ నాయకుడు బక్క మన్యం, బుడుమ జంగన్న, వాగుల్దాస్ చింటూ, ఆరంపల్లి సత్యనారాయణ యాదవ్, చెరుకు వెంకటేష్ .సంగోది ప్రవీణ చారి. ప్రభాస్ రాజు. గోవిందు విజయ్ .శివాజీ.మండల శివ,ఆంజనేయులు, మురుగని సాయి, జోలం శ్రీకాంత్, మద్ల శ్రీకాంత్,హరి కుమార్, తాడెం నాగరాజు, గ్రామ భాను, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, మార్చి 19 (జనంసాక్షి) :** పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, తెలంగాణ ప్రభుత్వం పేదలకు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఉగాది పర్వదినాన ప్రారంభించడం చాలా సంతోష దగ్గ విషయమని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఊరెళ్ళ 1, 2 వార్డులల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతవెంకట్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉగాది పర్వదినాన పేద ప్రజల సొంతింటి కల నెరవేరడంతో ఆ కుటుంబానికి మర్చిపోలేని రోజుగా ఉంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గృహవసతి కల్పించడమే ప్రభుత్వ లక్షమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఆగి రెడ్డి, దావల్గారి గోపాల్ రెడ్డి పైండ్ల మధుసూదన్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, దూత మల్లేష్, దప్పు సువర్ణ చందు, మాజీ జెడ్పిటిసి కాలే శ్రీకాంత్, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పడాల ప్రభాకర్, కుంచం శివకుమార్, రాజేందర్, సునుగంటి కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఈదమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి భూమి పూజ



**యాచారం, మార్చి 19 (జనం సాక్షి) :** మానవ ఆధ్యాత్మిక దైవచింతనను పెంపొందించేవి ఆలయాలు అని గౌరారం వెంకటరెడ్డి చెప్పారు. మండల పరిధిలోని మల్కీజుగుడ గ్రామంలో స్థల ప్రదాత గౌరారం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఈదమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్మాణం కోసం వెంకటరెడ్డి, గౌరారం రామ్ రెడ్డి రూ. 10 లక్షల విరాళం ఇచ్చారు. అనంతరం వెంకటరెడ్డి మాట్లాడారు. దేవాలయ నిర్మాణం త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. ఆలయాలు దైవచింతనను పెంపొందించే నిలయాలు అన్నారు. దేవాలయాల నిర్మాణానికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ప్రజల కోసం దేవాలయాన్ని నిర్మించడం ఆనందం కలిగించే విషయం అన్నారు. ఈ కార్యక్రమం లో ఈదమ్మ తల్లి దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులు వరికుప్పల సుధాకర్,దావన్ క్రిష్ణయ్య, దావన్ ఇద్దయ్య, దంతే యాదయ్య,దంతే నరయ్య,వరికుప్పల చిన్న జంగయ్య, దావన్ బుచ్చయ్య, దావన్ నర్సింహ్మా, దంతే శంకరయ్య, దంతే ఇద్దయ్య, దావన్ వీరేశం,వరికుప్పల ఇద్దయ్య (మెకానిక్),దంతే వెంకటేష్,దావన్ వెంకటేష్, దావన్ రమేష్,దంతే శ్రీశైలం, దావన్ రాజు,దంతే సుధాకర్,దావన్ రామకృష్ణ,దావన్ శ్రీకాంత్,దంతే రాజు,దంతే ప్రభాకర్,దావన్ ప్రసాద్, దంతే వినోద్,దంతే శివ,వరికుప్పల సతీష్, దంతే తరుణ్,దావన్ సాయి,దంతే దినేష్,వరికుప్పల వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింలకు పవిత్రమైన పండుగ రంజాన్

- జిల్లా ఆర్‌టిఏ మెంబర్ జైపాల్ రెడ్డి




**శామీర్‌పేట్, మార్చి 19 (జనం సాక్షి) :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సింగాయిపల్లి ప్రాంతంలో గురువారం రోజు రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం తరఫున ముస్లిం సోదర,సోదరీమణు లకు అందజేస్తున్న రంజాన్ తోఫా దుస్తుల కిట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు పారనంది బాల్ రాజు ,మహమ్మద్ జాఫర్ , కమటం యాదగిరి , రాజబోయిన శ్రీనివాస్ యాదవ్ ,వజ్జల శేశాంత్ పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న దుస్తుల కిట్లను పంపిణీ చేసి శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు రంజాన్ నెల ముస్లింలకు అత్యంత పవిత్ర మైనదని,ఉపవాస దీక్షలు, ప్రార్థనలు మరియు దానధర్మాలతో ఈ నెలను భక్తిశ్రద్ధలతో జరుపు కుంటారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సోదరుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో రంజాన్ తోఫా కిట్లను అందజేస్తూ వారి పండుగను ఆనందంగా జరుపుకునేలా సహకరిస్తోందని తెలిపారు.

# కాలాన్ని తెలుసుకొని మెలిగితేనే దైవానుగ్రహం

- రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్

**నాగర్‌కర్నూల్, మార్చి 19 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల సీతారామచంద్రస్వామి దేవాలయంలో గురువారం నాడు శ్రీ పరభవ నామ ఉగాది సంవత్సర పంచాంగ శ్రవణం వేదమూర్తులైన బ్రాహ్మణులచే శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. మానవుడు కాలాన్ని తెలుసుకొని మెలుగుతే దైవానుగ్రహం ప్రాప్తిస్తుందని అన్నారు. ముఖ్యంగా తిథి వార నక్షత్ర యోగ కరణములు సవ్యంగా ఉన్నవారికి సంపద ఆయుషు పాప నివారణ రోగాలు తగ్గడం కార్యసిద్ధి ఏర్పడతాయని అన్నారు. కార్యసిద్ధి కొరకు పంచాంగం ఉపయోగపడుతుందని అన్నారు. వర్జ్యం దుర్మహూర్తం రాహుకాలంలో శుభకార్యాలు చేరాదని కాలానికి అనుగుణంగా వెళ్లాలని అన్నారు. కలియుగం ప్రారంభమై 5127 సంవత్సరాలు అయిందన్నారు. ఈ సంవత్సరం రాజు గురువు ఉన్నాడని మంత్రి కుజుడు ఉన్నాడని సైన్యాధిపతి చంద్రుడు



ఉన్నాడని అన్నారు. గురువు రాజు కావడంతో గురువుల యొక్క పాత్ర విశేషంగా పెరుగుతుందన్నారు. మే నెలలో 11 నుండి 29 వరకు కర్తరి ఉందని శుభకార్యాలు చేరాదన్నారు. 2027 జులై 15 నుండి ఆగస్టు 12 వరకు గురుమౌఢ్యమి ఉన్నదన్నారు. జూన్ 2 నుండి 13 వరకు యమునా నది పుష్కరాలు వస్తాయని యమునా నది స్నానము మధురలో చేయడం శ్రేయస్కరమన్నారు. జనవరి 14,15,16 భోగి సంక్రాంతి కనుమ జరుపుకోవాలని అన్నారు. అధిపతి కేతువు ఉండడంతో గురువులతో తీర్థయాత్రలు అధికంగా ఉంటాయని అన్నారు. అన్నదాన సత్రాలు పెరుగుతాయని అన్నారు. దీపావళి ఆది సోమ వారాలలో అమావాస్య తిథి ఉన్నందున సోమవతి అమావాస్య రోజు జరుపుకోవడం శ్రేయస్కరం అన్నారు. శివ దర్శనాలు, వెంకటేశ్వర స్వామి దర్శనాలు చేయాలన్నారు. మీన రాశి నుండి మేష రాశి వరకు రాశి ఫలితాలు ఆదాయ, వ్యయ ఫలితాలను తెలిపారు. రైతులకు రెండు పంటలు సమృద్ధిగా పన్నుతాయని అన్నారు. గురువుల యొక్క విశిష్టత ప్రాధాన్యత విశేషంగా ప్రాప్తి ఉంటుందన్నారు. ఈ సంవత్సరంలో వివాహయోగం అధికంగా ఉందని అన్నారు. యువత వివాహాలు అధిక పెరుగుతుందన్నారు. అనంతరం రామాలయ కమిటీ వారిచే ఏర్పాటుచేసిన షడ్రుచుల పచ్చడిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కందాడై శ్రీనివాసచార్యులు, కరుణశ్రీ, అర్థం రవీందర్, రాగిశెట్టి పుల్లయ్య, మన్యపు రెడ్డి, శ్రీనివాసులు, నర్మదా, సూర్య కుమార, కాంతయ్య, రమాదేవి, గిరి, విఠల్ సింగ్, నరసింహ, సుధాకర్, భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా బండ్ల ఊరేగింపు

- గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

**కొల్చారం, మార్చి 19 (జనం సాక్షి) :** కొల్చారం మండలంలో ఉగాది పండగను పురస్కరించుకొని గురువారం మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఉగాది పండుగ ప్రజలు రైతులు వైభవంగా జరుపుకున్నారు. వరిగుంతం రాంపూర్ కొల్చారం రంగంపేట తో పాటు ఆయా గ్రామాలలో గ్రామ దేవతలకు దుర్గమ్మ నల్ల పోచమ్మ తో పాటు దేవతలకు బండ్ల ఊరేగింపు నిర్వహించారు పాల్గొన్నారు. ఈ సందర్భంగ రాంపూర్ సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్ మాట్లాడుతూ ఉగాది పండుగ ప్రజలు సంతోషంగా జరుపుకున్నారని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం గ్రామంలో ఉన్న గ్రామ దేవతలకు బండ్ల ఊరేగింపు కార్యక్రమం



నిర్వహిస్తామని తెలిపారు రైతులు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ప్రశాంత్ ఉపాధ్యక్షుడు మోహన్ నర్సింలు సాయిరాం నాగరాజు సంతోష్ మధు రవి తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎలక్షన్ కమిషన్‌ను మోసం చేసిన టేకుల సుదర్శన్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, మార్చి 19 (జనం సాక్షి) :** ఎలక్షన్ కమిషన్ మోసం చేసిన టేకుల సుదర్శన్ రెడ్డి పై అనర్హత వేటు వేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కమలాకర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 7వ వార్డులో బీ ఆర్ ఎస్ పార్టీ తరఫున పోటీ చేసిన టేకుల సుదర్శన్ రెడ్డి ఎలక్షన్ కమిషన్ కు తప్పులతడక నివేదికను అందజేశారని అన్నారు.పూర్తి సాక్షాదారాలతో మున్సిపల్ కమిషనర్, ఆర్డిఓ, కలెక్టర్, ఎలక్షన్ కమిషన్ కి అందజేశామని భార్యాభర్తల పేరు మీద 49 ఎకరాలు ఉన్న రికార్డులు నమోదు చేయలేదని, 5 ప్లాట్లు, 2 కార్లు, ఒక ఇల్లు, కోట్ల రూపాయల విలువచేసే ప్రాపర్టీలు ఉన్న తప్పుల నివేదికతో ఎలక్షన్ కమిషన్కు అందజేసి ఎలక్షన్ కమిషన్ ను మోసం చేసిన



సుదర్శన్ రెడ్డి పైన చట్ట పరంగా చర్యలు తీసుకోవాలన్నారు, కోర్టు పైన చట్టాల పైన తనకు పూర్తి నమ్మకం ఉందని అన్నారు.ఎలక్షన్ కమిషన్ కు అఫిడవిట్ లో చూయించింది మాత్రం తన పేరు మీద 13 ఎకరాల30 గుంటలు, భార్య పేరుమీద 3 ఎకరాల 33 గుంటలు మాత్రమే చూయించారు, తన పేరు మీద ఆస్తులు ఉన్న ఎన్నికల అఫిడవిట్ లో ఎందుకు నమోదు చేయలేదు, అదేవిధంగా నిరుపేదల పొట్ట పొట్టి లాక్కున్న భూధాన్ భూమిని త్వరలోనే ఎమ్మెల్యే సహకారంతో అర్హులైన పేదలకు పట్టాలు అందజేస్తామని తెలిపారు, సర్వే నెంబరు 289/14 లో నిరుపేదలకు చెందిన భూధాన్ భూమిని అన్యాయంగా బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుపేదల పొట్ట కొట్టి లాక్కున్న భూమిని బాధిత రైతులకు పంచగా మిగిలిన 11 ఎకరాలను అర్హులైన నిరుపేదలకు 300 గజాల ఇళ్ల పట్టాలు త్వరలో అందజేస్తామని తెలిపారు.

## ఉగాది మన జీవితాల్లో కొత్త కాంతులు నింపాలి

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, మార్చి 19 (జనంసాక్షి) :** ప్రకృతిలో మార్పుతో పాటు మన జీవితాల్లో ఉగాది తెలుగు నూతన సంవత్సరం కొత్త కాంతులు నింపాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి దేవాలయంలో ఉగాది పంచాంగ శ్రావణ కార్యక్రమం, భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూరు నియోజకవర్గ ప్రజలందరికీ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. షడ్రుచులు తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు ను పచ్చడిగా స్వీకరించి జీవితంలో కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలనే గొప్ప సందేశం ఇచ్చేది ఉగాది అన్నారు.ఈ నూతన సంవత్సరంలో చెడు పరాభవం చెంది మంచితనం విజయం సాధించాలని ఆకాంక్షించారు.వసంత రుతువు ఆరంభాన చైత్రశుద్ధ పాడ్యమిన వచ్చే ఈ ఉగాది ప్రకృతిలో మార్పు తేవడంతో పాటు మన జీవితాల్లో సైతం కొత్త కాంతులు నింపాలని, ఈ ఏడాది పాడిపంటలు సమృద్ధిగా పండి, సమస్త ప్రజలకు వారి వృత్తిలో అన్ని జయాలే కలగాలన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన ఫెస్టివల్ కమిటీ చైర్మన్ మేడి మహేష్, కమిటీ సభ్యులు, మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, మర్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు తో పాటు కౌన్సిలర్ లు, పలువురు రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# సహజ పానియాలను అలవాటు చేసుకోవాలి

- ఈసీఐఎల్ చౌరస్తాలో జెవివి ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ

**కాప్రా, మార్చి 19 (జనం సాక్షి) :** సహజ పానీయాలను అలవాటు చేసుకొని కూల్‌డ్రింక్స్ వినియోగాన్ని తగ్గించాలని జన విజ్ఞాన వేదిక పిలుపునిచ్చారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జన విజ్ఞాన వేదిక మేడ్చల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఈసీఐఎల్ చౌరస్తాలో ఉగాది పండగ సందర్భంగా "కూల్‌డ్రింక్ మానేద్దాం – సహజ పానీయాలను తాగుదాం" అనే నినాదంతో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన ప్రొఫెసర్ బి.ఎన్.రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ పెద్ది శ్రీనివాస్ గుప్తా, వాసవి క్లబ్ కోశాధికారి తారకేశ్వర్ లు మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే కూల్‌డ్రింక్స్ ఆరోగ్యానికి హానికరమని, వీటి వినియోగం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. మన పూర్వీకులు అనుసరించిన సహజ పానీయాలు శరీరానికి శక్తిని,



ఆరోగ్యాన్ని అందిస్తాయని తెలిపారు. ఉగాది పచ్చడి వంటి సంప్రదాయ ఆహారాలు జీవన విధానంలో భాగమని, ఇవి మన సంస్కృతి, ఆరోగ్య పరిరక్షణకు ప్రతీకలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్, కోశాధికారి పి.నాగరాజులు మాట్లాడుతూ.. రసాయనాలతో తయారయ్యే కూల్‌డ్రింక్స్ శరీరానికి మేలు చేయవని, వీటి బదులు నిమ్మరసం, పానకం, రాగిజావా, కొబ్బరినీళ్లు, మజ్జిగ వంటి సహజ పానీయాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చున్నారు. పండుగల సందర్భాల్లో సంప్రదాయ ఆహారాల ప్రాముఖ్యతను గుర్తించి, ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. అధిక చక్కెరలు, రసాయనాలు కలిగిన కూల్‌డ్రింక్స్ వినియోగం వల్ల ముఖ్యంగా పిల్లలు, యువత ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. వేసవి కాలంలో సహజ పానీయాలే ఉత్తమమని, ఇంటి వద్దే తయారు చేసుకునే పానకం, నిమ్మరసం, బెల్లం నీరు వంటి సహజ పానీయాలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఉన్నత అధికారులు మాట్లాడుతూ.. ఆరోగ్యం కోసం సహజ పానీయాలను ప్రోత్సహిస్తున్న జన విజ్ఞాన వేదికను అభినందించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా కోశాధికారి జెన్నీ నాయకులు సోమయ్యచారి శేషు, నాగేశ్వరరావు, నరసింహారావు, వెంకయ్య, వెంకట్, అశోక్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఐలాండ్‌ను పునః ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



**తూప్రాన్, మార్చి 19 (జనం సాక్షి) :** తూప్రాన్ మున్సిపల్ నర్సాపూర్ చౌరస్తా వద్ద ఎంతో ప్రతిష్టత్మాకంగా ఏర్పాటు చేసిన ఐలాండ్ గత రెండు సంవత్సరాలుగా అశ్రద్ద వహించి మెయింటనెయన్స్ లేక వెల వెల బోయిన ఐలాండ్ ను చైర్ పర్సన్ గా ఎన్నిక కాగానే వెంటనే పెయింటింగ్ చేయించి, మంచి పూల మొక్కలను నాటి విద్యుత్తు దీపాల వెలుగులు ప్రచురించే విదంగా తయారు చేసి మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ పునః ప్రారంభం చేశారు. వైస్ చైర్ పర్సన్ సమత కాశి రెడ్డి, కౌన్సిలర్లు సత్యలింగం, చెలిమేల రాములు, జైపాల్ నాయక్, ఐలేష్ యాదవ్, లక్ష్మి మల్లేష్, బొడ్డు రాధా కుమారి శ్రీనివాస్, మన్నే స్వామి, చందా అశోక్, తూప్రాన్ మున్సిపల్ ప్రజలు, బి. అర్. ఎస్ పార్టీ నాయకులు పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
20 మార్చి 2026

# కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రచారంపై ఉన్న శ్రద్ధ 6 గ్యారంటీల అమలుపై లేదు

- **బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు వారణాసి కల్పన**



**వనపర్తి బ్యూరో, మార్చి 19 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వానికి, ప్రచారంపై ఉన్న శ్రద్ధ 6 గ్యారంటీల అమలుపై లేదని,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు, వారణాసి కల్పన విమర్శించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు,ఆదేశాల మేరకు ఆరు గ్యారంటీలు 420 హామీల అమలులో వైఫల్యం చెందడంపై బీజేపీ వనపర్తి జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ 2023 శాసనసభ ఎన్నికల ముందు నాటి పీసీసీ అధ్యక్షుడు నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 6 గ్యారంటీ లైన గృహజ్యోతి పథకంలో ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి కొంతమందికి అమలు చేసి మిగతా లబ్ధిదారులను గాలికొదిలేసారని రైతు భరోసాలో రైతు, కౌలు రైతులకు ఎకరాకు 15000 వ్యవసాయ కూలీలకు 12000 పంట పెట్టుబడి సాయం ఇస్తామని ప్రగల్బాలు పలికి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లయిన కేవలం ఒక దఫా మాత్రమే రైతు భరోసా ఇచ్చి మిగతా నాలుగు దఫాలు రైతులకు ఎగనామం పెట్టారని చేయూత పథకంలో ఒంటరి మహిళ వృద్ధాప్య బీడీ చేనేత కల్లుగీత డయాలసిస్ హెచ్ఐవి రోగులకు 2016నుండి 4016, దివ్యాంగులకు 4016నుండి 6016 ఇస్తామని, నమ్మబలికి 27 నెలలైనా ఒక్కరికి కూడా పెన్షన్లు పెంచలేదని, అదే సమయంలో అర్హులైన వృద్ధాప్య, ఒంటరి మహిళలు, బీడీ, చేనేత కల్లుగీత, కార్మికులు, డయాలసిస్ రోగులు పథకం అమలు చేయనందుకు, కాంగ్రెస్ ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఉచిత ఇంటి స్థల నిర్మాణానికి, ఐదు లక్షల ఆర్థిక సాయం, పేరు చెప్పి ప్రజా పాలన పేరుతో, ఒకటికి మూడుసార్లు దరఖాస్తులు తీసుకొని, మూడు మూడు అర్హుల జాబితాలతో ఇల్ల నిర్మాణానికి, ఎదురుచూస్తున్న ,అభాగ్యులను నిలువునా కాంగ్రెస్ పార్టీ ముంచేసిందని, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వకుండా ఉద్యమకారులను అవమానపరిచాడని మహాలక్ష్మి ద్వారా పథకంలో ప్రతి మహిళకు నెలకు 2500 ఊసే లేదు 500 రూపాయలకే ఉచిత సిలిండర్ ఆచూకీ లేదని యువ వికాసం పథకంలో విద్యార్థులకు ఐదు లక్షల రూల విద్య భరోసా కార్డు ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ పాఠశాలలో భరోసా కార్డు లేదు ఇంటర్నేషనల్ స్కూలు ఒకటి కూడా ప్రారంభించలేదని తీవ్రంగా విమర్శించారు. మరో జిల్లా ప్రధాన కార్యదర్శి వారణాసి కల్పన మాట్లాడుతూ విద్యార్థులకు ఉచిత స్కూటీ పథకం పేరుతో బాలికలను కూడా మోసం చేశారని కల్యాణ లక్ష్మిలో లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పి మూడేళ్లయిన పథకం అమలుకు నోచుకోకపోవడం లేదని ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తానని మాట తప్పి అన్నదాతల ఉసురు పోసుకుంటున్నాడని నిరుద్యోగ భృతి పేరుతో నిరుద్యోగుల ఓట్లు వేయించుకొని గెలిచినాక నిరుద్యోగులకు పంగనామం పెట్టారని రైతులకు అవసరమయ్యే యూరియా ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పి ఒక బస్తాకు కూడా దిక్కు లేదని బీసీలకు విద్యా ఉద్యోగంలో మరియు కాంట్రాక్టర్లు 42% రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పి 60 శాతంకి పైగా ఉన్న బీసీ జనాభా ఓట్లతో గద్దెనెక్కి నేడు అగ్రవర్ణాల పాట పాడుతూ బీసీలను తీవ్ర అవమానపరుస్తున్నాడని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒకే ఒక్క పథకం ఉచిత బస్సు అమలు చేసి అందులో కూడా మహిళలు మహిళలకు జుట్టు పట్టుకొని కొట్టేవి కొట్లాడుకునే విధంగా పంచాయతీ పెట్టి తమాషా చూస్తున్నాడని బస్టాండ్ లో తప్ప ఎక్కడ బస్ స్టాప్ లలో మహిళలు కనబడితే ఆర్టీసీ డ్రైవర్లు బస్సు ఆపి ఆపడం లేదని దానికి కారణం బస్సుల కొరతతో ఒక బస్సులో రెండు బస్సులకు సరిపడా ప్రయాణికులతో బస్సు డ్రైవర్ తీవ్ర నరకయాతన పడుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వానివి కేవలం ప్రచారానికి పనికొచ్చే హామీలు తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదని పథకాల అమలు డిమాండ్ చేస్తూ ఈరోజు అన్ని మండల కేంద్రాల్లో తాసిల్దార్ గారికి మెమోరండం ఇవ్వడం జరిగిందని మార్చు 20వ తేదీన రైతాంగ సమస్యలపై జిల్లాలోని రైతులతో కలిసి సంపూర్ణ రుణమాఫీ రైతుబంధు మిగిలి ఉన్న రైతు భరోసా నిధుల విడుదల సీఎం ఫసల్ బీమా యోజన అమలుకై కలెక్టరేట్ ముట్టడి నిర్వహించి అన్నదాతల ఆక్రోసాన్ని మొద్దు నిద్రలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చూయించబోతున్నామని హెచ్చరించారు.

## భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు..



**ఊర్కొండ, మార్చి 19 (జనం సాక్షి) :** మండల పరిధిలోని ఊర్కొండపేట గ్రామంలో ఉగాది వేడుకలను గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని గ్రామ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ అర్చకులు దత్తాత్రేయ శర్మ పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన ఏడాదిలో రాశి ఫలాలు, వర్షాలు, పంటల దిగుబడి దేశ కాల పరిస్థితుల గురించి భక్తులకు వివరించారు. ఈ ఏడాది అందరికీ శుభప్రదంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అబ్దుల్ రషీద్, ఉప సర్పంచ్ రేపాని శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అందోల్‌లో ఘనంగా ఉగాది సంబురాలు



**జోగిపేట్, మార్చి 19 (జనం సాక్షి) :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని అందోల్ మండలంలోని గ్రామాలలో ఉగాది సంబరాలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లోని ప్రజలు ఉదయం నుండి ఆయా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి నూతన వస్త్రాలు ధరించి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా గ్రామాల సర్పంచులు తన మిత్రులకు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా మండలంలోని నేరడిగుంట గ్రామంలో సంగమేశ్వర ఆలయంలో భక్తులు పోటెత్తారు. భక్తులు బార్లు తీరి సంగమేశ్వరుని దర్శించుకున్నారు. అలాగే జోగిపేట పట్టణంలోని జోగినాథ్ ఆలయం రాజరాజేశ్వర ఆలయం శివాలయం మందిరాలలో భక్తులు బారులు తీరి దర్శనం చేసుకున్నారు. సాయంత్రం వేళలో ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడలిల వద్ద గ్రామ పురోహితులచే పంచాంగ శ్రవణం పాటించారు. జోగిపేట లోని జోగినాథ ఆలయంలో పురోహితులు కృష్ణమూర్తి పంతులుచే పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ కార్యక్రమంలో అందోల్ జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి మాజీ కౌన్సిలర్ సురేందర్ గౌడ్ కౌన్సిలర్ పట్లోళ్ల ప్రవీణ్ కుమార్, మాజీ ఎంపీపీ రామా గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ డిపి నాగభూషణం పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు ఆకుల మా నయ్య, టిఆర్ఎస్ అధ్యక్షులు చాపల వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు నరసింహులు, కొత్త శ్రీశైలం, కాంగ్రెస్ నాయకులు గుర్రపు కృష్ణ ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో అట్టహాసంగా రైతు మేళ ఉత్సవాలు ప్రారంభం



**నంగునూర్, మార్చి 19 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో ఏర్పాటు చేసిన ఆయిల్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన ప్రజా పాలనలో రైతు ఉత్సవాలు కార్యక్రమాన్నిరాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యానవన, పట్టుపరిశ్రమ, మత్స్య, విత్తనాభివృద్ధి సంస్థ, చేనేత ఉ జౌళి శాఖలతో పాటు వివిధ వ్యవసాయ ఉత్పత్తుల సంస్థలు, విజయ డైరీ, వ్యవసాయ యాంత్రికరణ సంస్థలస్టాళ్లను ప్రారంభించి పరిశీలించారు .శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, స్వయంగా ఆయిల్ పామ్ సాగు చేసి మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. మొదటి రెండు సంవత్సరాల్లో అంతర్ పంటల సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఫామ్ ఆయిల్ పంట సాగు ను పరిశీలించడానికి సంస్థలు, సాంకేతిక మిషనరీ వస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం నుండి రైతులకు 4200 సబ్సిడీ అందించడం జరుగుతుందని, ఆయిల్ ఫెడ్ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆయిల్ దిగుమతి చేసుకునే అవకాశం లేకుండా పంటను సాగు చేయాలని సూచించారు.స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం కొరకు స్వర్గీయ ప్రొఫెసర్ జయశంకర్, గడ్డం వెంకటస్వామి కన్నకలలు కళ్ళ ముందు ఎలా నిజమయ్యాయో అదేవిధంగా తుమ్మల నాగేశ్వరరావు ఫార్మాయిల్ కంపెనీ కలలు నిజమయ్యాయని అన్నారు. రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆయిల్ పామ్ అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చని, మొదటి మూడు సంవత్సరాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతుండగా, రాబోయే మూడేళ్లలో మరింత విస్తరణకు కృషి చేస్తున్నామని చెప్పారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా, నర్మెట్ట ఆయిల్ ఫ్యాక్టరీ చరిత్రాత్మక ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని, ఇక్కడ బయట నుంచి విద్యుత్ తెచ్చుకోవాల్సిన అవసరం లేకుండా ఇక్కడే 4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని, అవసరమైతే ప్రభుత్వానికి సరఫరా చేయగలమన్నారు. సిద్దిపేటలో రిఫైనరీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో పంట మార్పిడి అవసరమని, రైతులు ఆదాయపరంగా బలపడే పంటలను ఎంచుకోవాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంటను అధికంగా ప్రోత్సహిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు ఆయిల్ ఫామ్ కురియన్ అని అన్నారు. 150 స్టాళ్లతో నిర్వహిస్తున్న రైతు ఉత్సవాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 22 న ముఖ్యమంత్రి రానున్నారని తెలిపారు. ఈ ఫ్యాక్టరి ద్వారా గంటకు 120 టన్నులను క్రషింగ్ చేసే సామర్థ్యం ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తున్నాయని, దేశానికి వెన్నముకైన రైతు ఆయిల్ పామ్‌తో పాటు ఇతర పంట సాగుపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సిద్దిపేట కన్నా ఎక్కువ హుస్నాబాద్ నియోజకవర్గంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతుల సంక్షేమానికి అందరూ కృషి చేస్తున్నారని తెలిపారు. పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్లపాటు ప్రతి సంవత్సరం ఎకరానికి రూ.4200 ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈ పంట రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందిస్తుందని, దుబ్బాక నియోజకవర్గంలో మొదటి ఆయిల్ ఫామ్ పంటను వేసింది తానేనని పేర్కొన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ పూర్తి అయిన తరువాత ఈ ప్రాంతంలో తేమ శాతం పెరిగి ఆయిల్ పామ్ సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో పంచుకున్నది భాగ్యలక్ష్మి 2021 జూన్ 5న మొదటి మొక్కలు నాటినట్లు గుర్తుచేశారు. సిద్దిపేట జిల్లాలో 50 వేల ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంటలు పండించాలనేది తన కోరిక అని, ప్రభుత్వం మారిన ఈ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఆపకుండా పూర్తి చేసేందుకు కృషి చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు అని, ఖమ్మం రైతుల లాగే సిద్దిపేట రైతులు కూడా అభివృద్ధి చెందేలా రైతులందరూ ఆయిల్ ఫామ్ పంటలు వేసుకోవాలని అన్నారు. ఈ పరిశ్రమను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంట దిగుబడి కి వచ్చే ఐదు సంవత్సరాలలోపు ప్రభుత్వం రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు .ఈ సందర్భంగా ఆదర్శ రైతు భాగ్యలక్ష్మి తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం అతిథులు ఆయిలఫామ్ ఫ్యాక్టరీలో తిరిగి ఆల్ఫా ఫ్యాక్టరీ పనితీరును పరిశీలించారుఈ కార్యక్రమంలో ఎంఎల్సీలు దేశపతి శ్రీనివాస్, వంటేరు యాదవ రెడ్డి, ఆయిల్ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్రమోహన్, జిల్లా కలెక్టర్ కె. హేమావతి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి సరూపారాణి, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆయిల్ ఫెడ్ అధికారులు, అధిక సంఖ్యలో రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి ఆరు గ్యారెంటీలు అమలు చేయిస్తాం

- **బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు**



**వనపర్తి బ్యూరో, మార్చి 18 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ మెడలు, వంచి అయినా ఆరు గ్యారెంటీలను, అమలు చేయిస్తామని, వనపర్తి జిల్లా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది రాజు అన్నారు. బుధవారం బిజెపి వనపర్తి పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలని కోరుతూ స్థానిక తహసిల్దార్‌కి మెమోరాండం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ, పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో ఉన్న సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే, వారి కన్నా అధికంగా ఇస్తామని, గ్యారెంటీ లిచ్చి యువకులు, మహిళలు, రైతులు ,వ్యవసాయ కూలీలతో ఓట్లు వేయించుకొని ,గద్దెనెక్కి 27 నెలలైనా ఒక్క హామీ కూడా అమలు చేయకుండా, తెలంగాణ రాష్ట్ర ప్రజానీకాన్ని తీవ్రంగా మోసం చేశారని విమర్శించారు. ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్, వ్యవసాయ డిక్లరేషన్, పేరిట హామీలిచ్చి అధికారంలోకొస్తే, వాటికి చట్టబద్ధత కల్పిస్తామని, మాయ మాటలు చెప్పి, ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదని, తెలంగాణ ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు హామీలను అమలు, చేసే వరకు ప్రజలతో కలిసి బిజెపి పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు కొనసాగిస్తుందని రేవంత్ రెడ్డి మెడలు వంచి పథకాల అమలు సాధించేవరకు బిజెపి పార్టీ విశ్రమించబోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు పట్టణ అధ్యక్షుడు ఏ రాజశేఖర్ గౌడ్, మాజీ ఉపాధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్ రెడ్డి, 26వ వార్డు కౌన్సిలర్ ఎం. విజయసాగర్, సీనియర్ నాయకులు ఆగపోగు కుమార్, దాసరాజు ప్రవీణ్, కొమ్ము శ్రీనివాసులు, ఆరో వార్డు మాజీ కౌన్సిలర్ కంచరవి, 13వ వార్డు కంటెస్టెంట్ కౌన్సిలర్ కే గోపీనాథ్, పట్టణ నాయకులు సూర్యవంశం శీను, రాయన్న సాగర్, ఆగపోగు చాణిక్య, ఉపేందర్ యాదవ్, చిన్న రాయుడు, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ చేసిన అభిమన్యు యువసేన



**రాజాపూర్, మార్చి 19 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ యువనేత చించొడ్ అభిమన్యు రెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి రంజాన్ పండుగ సందర్భంగా, ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తారు. అందులో భాగంగా గురువారం మండల పరిధిలోని ముదిరెడ్డి పల్లి, రాజాపూర్ మండల కేంద్రంలో అభిమన్యు యువసేన సభ్యుల సమక్షంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజాపూర్ సర్పంచ్ రామకృష్ణ, అభిమన్యు యువసేన మండల అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్, మాజీ ఎంపీపీ నర్సింహులు, నజీమ్ బేగ్,ఆరీఫ్,తిరుపతయ్య, ముదిరెడ్డి పల్లి గ్రామంలో శేఖర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెట్ల గౌరారం లో ఉచిత వాటర్ ప్లాంట్ ఏర్పాటు




**తూప్రాన్, మార్చి 19 (జనం సాక్షి) :** మనోహరాబాద్ మండలం చెట్ల గౌరారం గ్రామంలో సర్పంచ్ చింతకింది దివ్య శ్రీహరి గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో ప్రజలకు ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ను ఉగాది పురస్కరించుకొని పాలకవర్గం సభ్యులు గురువారం ప్రారంభించారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటు తో గ్రామస్తులు తాగునీటీ సమస్య తీరింది. ఉచిత మినరల్ వాటర్ ఏర్పాటు తో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## టైగర్ నర్సమ్మ మృతి పార్టీకి తీరని లోటు



**సిద్దిపేట బ్యూరో, మార్చి 19 (జనంసాక్షి) :** ఇటీవల మృతి చెందిన మలిదశ ఉద్యమ కారిణి పార్టీ మహిళా అధ్యక్షురాలు గాడిచెర్ల ( టైగర్ )నర్సమ్మ కుటుంబాన్ని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పరామర్శించారు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నర్సమ్మ మృతి ఎంతో బాధాకరమని, పార్టీ కి తీరని లోటన్నారు.కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామన్నారు.

## మల్లన్నగుట్టలో మల్లన్న కళ్యాణం



**నిజాంపేట, మార్చి 19 (జనం సాక్షి) :** నిజాంపేట మండలం చల్మెడ గ్రామ మల్లన్న గుట్ట వద్ద శ్రీ మల్లన్న కేతమ్మ, మేడలమ్మల కళ్యాణ మహోత్సవం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లన్న కళ్యాణం అనంతరం అగ్నిగుండాలు, అన్నదాన కార్యక్రమం, ఎడ్లబండ్ల ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మల్లన్న గుట్ట వద్ద స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ల మండల ఫోరం అధ్యక్షుడు భాను ప్రకాష్ రెడ్డి, సర్పంచు బొమ్మన మల్లేశం, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## అంగరంగ వైభవంగా బండ్ల ఊరేగింపు

- **గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు**



**కొల్చారం, మార్చి 19 (జనం సాక్షి) :** కొల్చారం మండలంలో ఉగాది పండగను పురస్కరించుకొని గురువారం మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఉగాది పండుగ ప్రజలు రైతులు వైభవంగా జరుపుకున్నారు. వరిగుంతం రాంపూర్ కొల్చారం రంగంపేట తో పాటు ఆయా గ్రామాలలో గ్రామ దేవతలకు దుర్గమ్మ నల్ల పోచమ్మ తో పాటు దేవతలకు బండ్ల ఊరేగింపు నిర్వహించారు పాల్గొన్నారు. ఈ సందర్భంగ రాంపూర్ సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్ మాట్లాడుతూ ఉగాది పండుగ ప్రజలు సంతోషంగా జరుపుకున్నారని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం గ్రామంలో ఉన్న గ్రామ దేవతలకు బండ్ల ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు రైతులు ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ప్రశాంత్ ఉపాధ్యక్షుడు మోహన్ నర్సింలు సాయిరాం నాగరాజు సంతోష్ మధు రవి తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు చల్లూరిపల్లిలో చెలిమేటి లింగయ్యకు చెందిన ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైంది. బాధితుడు లింగయ్య తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. చల్లూరుపల్లికి చెందిన లింగయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కోళ్లు, ఆవులను కూడా పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ఉగాది పండుగకు కుమారుని ఇంటికి వెళ్లగా, బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి నిప్పు అంటించడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేల అస్థి నష్టం జరిగిందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితుడు లింగయ్య కోరాడు.

# ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



**ములుగు బ్యూరో,మార్చి19(జనం సాక్షి):** ములుగు జిల్లా కేంద్రంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శ్రీ పరాభవ నామ తెలుగు నూతన సంవత్సర ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ డైరీని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ ఆవిష్కరించారు. అనంతరం ములుగు జిల్లా రైతులకు, ప్రజలకు శ్రీ పరాభవనామ తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సహోదరు రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్ ఉపాధ్యక్షులు అక్కల రగోతం సహాయ కార్యదర్శులు దేగల భద్రయ్య, వి ఎన్ రెడ్డి గౌరవ సలహాదారులు రామిని శ్రవణ్, వల్లాల అనిల్ కుమార్ ,మాజీ కోశాధికారి ఆరే విజయేందర్ రైస్ మిల్లర్లు రాజేష్, నాగరాజు, అరవింద్, ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐలనేని నవీన్ రావ్‌కు వివేకానంద సేవాసమితి ఉగాది సేవారత్న రాష్ట్రస్థాయి అవార్డు




**కాటారం, మార్చ్ 19 (జనంసాక్షి) :** కాటారం మండల పరిధిలోని దేవరాంపల్లి నివాసి రేగుల గూడెం మాజీ సర్పంచ్ అయిలినేని నవీన్ రావు ఉగాది సేవ రత్న పురస్కారం అవార్డు అందుకున్నారు. వివేకానంద సేవాసమితి వారు 2026 సంవత్సరమునకు ఇచ్చిన అవార్డు ను నవీన్ రావు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా అందుకున్నారు. తను రాజకీయ జీవితంలో సర్పంచిగా పనిచేసిన నుండి ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. చిన్న వయసు నుండి ఈ ప్రాంతంలో పేరుగాంచిన సేవా నీతిపరుడు, ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి ఈ ప్రాంతంలో వ్యవసాయ రైతుగా మంచి పంటలు పండిస్తూ ఆదర్శంగా ఉంటున్నాడు. రైతులతో ఉదయం సాయంత్రం సమయంలో వారితో కలిసి వ్యవసాయానికి సంబంధించిన సమస్యలను మాట్లాడుతుంటాడు. పేద ప్రజల కష్టాల్లో ఉన్నప్పుడు తనవంతు కృషిగా సేవను అందిస్తున్నారు. ఈ అవార్డుకు ఎన్నిక కావడం పట్ల అతని సన్నిహితులు మండల ప్రజలు హర్ష భావం వ్యక్తం చేస్తున్నారు.

# అసెంబ్లీలో సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యే



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 19(జనంసాక్షి):** ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ పనులు, నిధుల కొరత, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై గళం విప్పారు. నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జిలు ఏళ్లుగా పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. గతంలో ఎస్టీ సబ్ప్లాన్ కింద నిధులు వచ్చేవని, ప్రస్తుతం మాత్రం నిధుల కేటాయింపు లేక పనులు నిలిచిపోయాయని విమర్శించారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు కొత్త పనులకు ముందుకు రావడం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా మంగి, గుండాల, మోడీగూడ ప్రాంతాల్లో అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు చేరుకోవడం కష్టంగా మారిందని చెప్పారు. ఆదిలాబాద్ ఘాట్ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, డబుల్ రోడ్ నిర్మాణం అత్యవసరమని డిమాండ్ చేశారు. గుండి అనార్పల్లి బ్రిడ్జి సహా పలు బ్రిడ్జి పనులు అసంపూర్తిగా ఉండటంతో వర్షాకాలంలో ప్రజలు ప్రమాదంలో పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, బోర్లు వేయడానికి కూడా నిధులు లేవన్నారు. అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యేలకు సీడీపీ నిధులు కేటాయించాలని కోరారు. అసెంబ్లీలో సమస్యలు ప్రస్తావించినా అమలు లేకపోతే ఎలా, కొండలు, గుట్టలు ఉన్న ప్రాంతాల ప్రజల కష్టాలను ఎవరు తీర్చాలని ప్రశ్నిస్తూ ప్రభుత్వ వైఖరిపై ఎమ్మెల్యే స్పందించారు.

# రంజాన్ తోఫా పంపిణీ

- ముస్లిం సోదరులకు అందించిన కార్మిక శాఖ మంత్రి వివేక్



**మంచిర్యాల ప్రతినిధి , మార్చి19 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామంలో ముస్లిం సోదరి,సోదరీమణులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి రంజాన్ తోఫాను కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు. అనంతరం మసీదు ప్రాంగణంలో వాటర్ షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు . ఇందారం గ్రామ అభివృద్ధికి కృషి చేస్తా. అధికారం లేకపోయినా ఇందారం గ్రామంలో 36 బోర్ వెల్స్ విశాఖ చారిటబుల్ నుంచి వేయించానని గుర్తు చేశారు. చెన్నూరు నియోజకవర్గంలో ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కరిస్తున్నామని అన్నారు. ముస్లింల కోసం చెన్నూరులో 50 లక్షల నిధులతో షాదీఖానా నిర్మిస్తున్నామని తెలిపారు. జైపూర్ లో అతి త్వరలో 3ఐ800 మెగావాట్ల పవర్ ప్లాంట్ ప్రారంభించబోతున్నామని అన్నారు .దీంతో మన ప్రాంత యువకులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆర్కే-5 లో కొత్త మైన్ ఓపెన్ కాస్ట్ రాబోతుందని అన్నారు. చెన్నూరులో ఏటీసీ సెంటర్‌ను నిర్మించుకుంటున్నామని యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని,మంచి స్కిల్స్ ఉంటే ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు . 250 కోట్లతో సోమనపల్లిలో నిమిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభించుకున్నామని తెలిపారు.

# పారిశ్రామిక వ్యాపారవేత్తలు సిఎస్ఆర్ నిధులు సేవా సంస్థలకు మళ్లించాలి

- పార్లమెంట్‌లో మానసిక దివ్యాంగుల సమస్యలపై పోరాటం చేస్తా
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- ఫిజికల్, మెంటల్ దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠశాలల ఏర్పాటు కోసం శాసనసభలో కృషి : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**హనుమకొండ ప్రతినిధి మార్చి 19 (జనం సాక్షి) :** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని హన్మకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మానసిక దివ్యాంగ చిన్నారులతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుటుంబ సమేతంగా ఆనందంగా వేడుకలు జరుపుకున్నారు.కడియం ఫౌండేషన్ ద్వారా చిన్నారులకు కొత్త బట్టలు అందజేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీ, ఎమ్మెల్యే స్వయంగా పిల్లలకు భోజనం వడ్డించి మానవతా దృక్పథాన్ని చాటిచెప్పారు. అదనంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.

**25 ఏళ్ల అనుబంధం... నిరంతర సేవ**

మల్లికాంబ మనోవికాస కేంద్రంతో కడియం కుటుంబానికి దాదాపు 25 ఏళ్ల అనుబంధం ఉందని వారు పేర్కొన్నారు. ప్రతి ఏడాది పండుగలు, ప్రత్యేక రోజులు ఇక్కడి చిన్నారుల మధ్య జరుపుకుంటూ బట్టలు, ఆర్థిక సహాయం, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా విద్యార్థులకు బట్టలు అందజేసి, లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, మానసిక దివ్యాంగులపై సమాజంలో ఉన్న అపోహలు, వివక్ష తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ఆధార్ లింకేజీ సమస్యల కారణంగా పలువురు దివ్యాంగులు పెన్షన్, వైద్య సదుపాయాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ మల్లికాంబ మనోవికాస కేంద్రం సమస్యలను 25 ఏళ్ల క్రితమే తన దృష్టికి తీసుకువచ్చినప్పటి నుంచి ఈ సంస్థకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నామని తెలిపారు.మానసిక దివ్యాంగ చిన్నారుల కోసం పనిచేసే సంస్థలకు ప్రభుత్వ సహాయం మరింతగా అవసరమని పేర్కొన్నారు. సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా పరిశ్రమలు, వ్యాపారవేత్తలు ఇలాంటి సంస్థలకు తోడ్పాటు అందించాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దివ్యాంగుల భద్రత, సంక్షేమానికి ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు రామలీల, కళ్యాణ్, మాజీ కార్పొరేటర్ మాధవి, ఎమ్మెల్యే సతీమణి వినయరాణి తదితరులు పాల్గొన్నారు.

# మత సమరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్ పూర్,నవంబర్ 18(జనం సాక్షి) :** ఆత్మీయ మత సమరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని, భారతదేశంలోఎన్నో ప్రాంతాలు, మతాలు, కులాలు ఉన్నప్పటికీ సోదర భావం తో కలిసిమెలిసి ఉంటున్నాం అంటే అది డాక్ట ర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ స్ఫూర్తితోనే అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.పవిత్రరంజాన్ మాసన్ని పురస్కరిం చుకొని ముస్లిం సోదరుల కోసం స్టేషన్ ఘన పూర్ పట్టణ కేంద్రం శివునిపల్లి లోని కే ఆర్ గార్డెన్స్ లో అధికారికంగా ఏర్పాటు చేసిన దావత్ ఏ ఇఫ్తార్ కు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లిం సోదరులకు పండ్లు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యంత భక్తి శ్రద్దలతో పవిత్ర రంజాన్ ఉపవాసదీక్షలు చేస్తున్న ముస్లింసోదర సోదరిమను లందరికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలోఉండే ముస్లింసోదరుల కోసం ఏర్పాటుచేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సమరస్యానికి ప్రతీకఅని తెలిపారు.సమాజం లో సోదర భావాన్ని పెంపొందించే గొప్ప పండుగ రంజాన్ పండుగ అని పేర్కొన్నారు. రంజాన్ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించి అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత దేశం ఒక గొప్ప సంస్కృతి, ప్రజాస్వామ్య దేశమని అన్నారు.భిన్నత్వంలో ఏకత్వంగా అన్నిమతాలు,కులాలు కలిసి సహజీవనం చేయడం భారతదేశ గొప్పతనమని పేర్కొన్నా రు. ఇతర దేశాలలో మత, వర్గ వైశమ్యాలతో ఏవిధంగా గొడవలు జాతుగుతున్నాయో మనం దరికీ తెలుసనీ అన్నారు. భారత దేశం లో ఎన్నో ప్రాంతాలు, మతాలు, కులాలు ఉన్న ప్పటికీ అందరం కలిసి మెలిసిఉంట్టున్నామం టే అది డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన గొప్ప రాజ్యాంగ స్ఫూర్తితోనే స్పష్టం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా మతాల మధ్య, కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఒకరి మతాన్ని ఒకరు గౌరవించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా మరొ కసారి ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, మైనారిటీశాఖ అధికారులు, తహసీ ల్దార్లు, ఎంపిడివోలు, ఇతర అధికారులు, ముస్లిం మత పెద్దలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



### ఆ ప్రాంతంలో పొగాకు ఉత్పత్తులు అమ్మితే కఠిన చర్యలు

- దామెర ఎస్సై కొంక అశోక్

**హనుమకొండ ప్రతినిధి, మార్చి 19 (జనంసాక్షి) :** ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల పరిసర ప్రాంతాలలో పొగాకు ఉత్పత్తులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని దామెర ఎస్సై కొంకా అశోక్ తెలిపారు గురువారం దామెర ఎస్సై కొంక అశోక్ తన సిబ్బంది తో దామెర మండల పరిధిలోని లాదెళ్ల గ్రామం, సింగరాజుపల్లి గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలకు సమీపంలో 100 యార్డ్స్ లోపు ఉన్న కిరాణ షాపులలో సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు అమ్ముతున్న నాలుగు షాపుల యజమానులపై యాక్ట్ 2003 ప్రకారం గా కేసులు నమోదు చేసినారు.

### లారీలో తరలిస్తున్న నల్లబెల్లం, పట్టిక స్వాధీనం

ముగ్గురి అరెస్ట్, లారీ సీజ్

**మహబూబాబాద్ బ్యూరో, మార్చి 19(జనం సాక్షి):** మహబూబాబాద్ టాస్క్ ఫోర్స్ మరియు కురవి పోలీస్ సంయుక్త ఆపరేషన్ లో అక్రమ సారాయి వ్యాపారం గురించి చిత్తూరు నుండి మహబూబాబాద్ కి నల్లబెల్లం తరలిస్తున్న లారీ నీ కురవి శివారు సోమ్లా తండా దగ్గర పట్టుకొని అందులో తరలిస్తున్న 70 క్వింటాల నల్లబెల్లం,10 క్వింటల పట్టిక స్వాధీనం చేసుకొన్నారు. దీనికి బాద్యులైన మహబూబాబాద్‌కు చెందిన గుగులోత్ సుమన్, ఆరెపల్లి మధు, బెల్లం విజయ్ కుమార్ అనే వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్ లో టాస్కోర్స్ సి ఐ హతీరామ్, ఎస్సై తాహేర్ బాబా, మరియు కురవి ఎస్సై లు గంద్రాతి సతీష్, జయకుమార్, కానిస్టేబుల్ సమ్మయ్య, హరిబాబు, నరేష్, బద్రు, బాబు పాల్గొన్నారు.



# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఉగాది

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఉగాది పండుగ అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్ లో గురువారం ఉగాది ఉత్సవ నిర్వహణ కమిటీ, శ్రీ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉగాది పురస్కారాలు, సంజీవనము పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి ఉత్సవాలు సమాజంలో ఐక్యతను, సాంప్రదాయ విలువలను పెంపొందిస్తాయని అన్నారు. సంజీవనము వంటి పుస్తకాలు మన సంస్కృతి, జీవన విధానాలను భవిష్యత్ తరాలకు అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉగాది పురస్కారాలు అందుకున్న ప్రతిభావంతులను అభినందిస్తూ, వారు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. కళలు, సాహిత్యం, సేవా కార్యక్రమాల్లో ముందుండే వారిని ప్రోత్సహించడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. అలాగే, ప్రజల సహకారంతో ఇటువంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఉగాది సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, కౌన్సిలర్లు, ఉగాది ఉత్సవ నిర్వహణ కమిటీ, శ్రీ వివేకానంద సేవా సమితి సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తున్న సింగరేణి యాజమాన్యం

- ఏఐటీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి



**బెల్లంపల్లి, మార్చ్ 19, (జనంసాక్షి) :** నాన్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ కోడ్ ఆఫ్ డిసిప్లిన్ కంపెనీ లెవెల్ టెక్చర్ మీటింగ్స్ మినిట్స్ ఆఫ్ అగ్రిమెంట్స్ అండర్ సెక్షన్ 12 సబ్ సెక్షన్ 3 ఐడిఏ 1947 లను సింగరేణి యజమాన్యం ఉల్లంఘిస్తుందని ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి ఆరోపించారు. గురువారం ఆయన బెల్లంపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కంపెనీ లెవల్లో 1998వ సంవత్సరం నుండి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తూ, కంపెనీ గుర్తింపు సంఘంతో, సమన్వయంతో కోడ్ ఆఫ్ డిసిప్లేన్ ను ఆర్ ఎల్ సి సమక్షంలో రూపొందించుకోవడం జరిగిందన్నారు. గత రెండు సంవత్సరాలుగా గుర్తింపు కార్మిక సంఘంతో సద్భవన వాతావరణంలో చర్చించుకున్న కార్మికుల డిమాండ్లను అమలు చేయవలసిన బాధ్యతలను అమలు చేయకుండా మేనేజ్మెంట్ అనుచితంగా వ్యవహరిస్తూ అన్ఫేర్ లేబర్ ప్రాక్టీస్ కొనసాగిస్తుందని ఆరోపించారు. పారిశ్రామిక వివాదాల చట్టం 1947 ఐదవ షెడ్యూల్ లోని అన్ఫేర్ లేబర్ ప్రాక్టీస్ కొనసాగిస్తూ ఐదవ షెడ్యూల్లోని సబ్ సెక్షన్ 1 2 3 లను ప్రయోగిస్తూ అన్ఫేర్ లేబర్ ప్రాక్టీస్ కొనసాగిస్తున్నారన్నారు. అన్ఫేర్ లేబర్ ప్రాక్టీసును సెక్షన్ 25 టి నిషేధిస్తుందని, సెక్షన్ 25 యు శిక్షలను ఖరారు చేస్తుందని, పారిశ్రామిక వివాదాలు చట్టం 1947 అండ్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీసు కొనసాగించిన మేనేజ్మెంట్ పై కఠిన చర్యలు తీసుకోవాలని చట్టం సూచిస్తుందని అన్నారు. పారిశ్రామిక సంబంధాలను కొనసాగించడానికి పారిశ్రామిక ప్రశాంతత నెలకొల్పడానికి చట్ట సమ్మతంగా పనిచేయవలసిన యజమాన్యం యూనియన్ తో జరిగిన ఒప్పందాలను అమలు చేయకుండా అన్ఫేర్ లేబర్ ప్రాక్టీస్ కొనసాగిస్తుందన్నారు. కంపెనీ ప్రగతిని ఆటంకపరుస్తుందని, యజమాన్యం ఈవిధానాలను కొనసాగించడం వల్ల పారిశ్రామిక ప్రశాంతతను కోల్పోతుందన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం కంపెనీ ప్రగతిని దృష్టిలో పెట్టుకొని తక్షణమే గుర్తింపు సంఘంతో జరిగిన ఒప్పందాలను అమలు చేయాలని, ఎలాంటి రాజకీయ ఒత్తిడులకు తలవంచకుండా పారిశ్రామిక సంబంధాలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం గుర్తింపు సంఘంతో స్ట్రక్చర్ సమావేశంలో జరిగిన ఒప్పందాలను అమలు చేయకుండా తెల్లదొరలను మరిపించే పద్ధతులలో కాలయాపన చేస్తున్న మేనేజ్మెంట్ తమ విధానాలను మార్చుకొని మినిట్స్ ఆఫ్ సెటిల్మెంట్లను వెంటనే అమలు చేయాలన్నారు. 136 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో నాడు కెసిఆర్ ప్రభుత్వంతో, నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దాసోహమై కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా సింగరేణి సొమ్మును కార్మికుల శ్రమశక్తిని దోపిడీ చేసే విధంగా పాలకులకు కంపెనీ సొమ్మును దారదత్తం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. సింగరేణిలో పాత గనులు మూతపడడం నూతన గనులు రాకపోవడం కార్మికుల సంఖ్య రోజురోజుకు తగ్గుతుందని, కనీసం పనిముట్లను సక్రమంగా సరఫరా చేయకపోవడానికి, గత 13 సంవత్సరాలుగా సింగరేణి కంపెనీకి 50 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం బకాయి పడిందని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నెలవారీగా జరిగే మెడికల్ బోర్డును ప్రారంభించి, రెగ్యులర్గా ప్రతినెల కారుణ్య నియమకాలలో కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. మారుపేర్లపై ఉన్న కార్మికులకు వారి పిల్లలకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలని, కార్మికుల అల్లుళ్ళు డిపెండెంట్ కేసులను మెడికల్ ఫిట్ అయినంక అప్పోయింట్మెంట్ ఆర్డర్ ఇచ్చే ముందు విజిలెన్స్ ఎంక్వయిరీ పేరుతో కార్మిక కుటుంబాలను ఇబ్బంది పెట్టడం అన్వేర్ లేబర్ ప్రాక్టీస్ కిందికి వస్తుందన్నారు. డిస్మిస్ అయిన కార్మికులకు ఒక అవకాశాన్ని కల్పించాలని, నాణ్యత కలిగిన పనిముట్లను సరఫరా చేయాలని, గనులు, డిపార్ట్మెంట్లపై విజిలెన్స్ విచారణ పేరుతో కార్మికులను, వారి కుటుంబాలను మానసికంగా కుంగదిసే విధానాలకు స్వస్తి చెప్పాలన్నారు. ఏరియా హాస్పిటల్ లలో కార్పొరేట్ వైద్యము అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో ఏఐటీయూసీ నాయకులు బియ్యాల వెంకటస్వామి, మీనుగు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఉన్న చండూరులో రాజకీయ చిచ్చు



**చండూరు, మార్చి 19 (జనంసాక్షి) :** మున్సిపాలిటీ కేంద్రంలో గత కొన్ని రోజులుగా చోటుచేసుకుంటున్న పరిణామాలు తీవ్ర రాజకీయ రంగు పులుముకున్నాయి. ఆదివారం జరిగిన ఘర్షణలకు కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని, అది పూర్తిగా వ్యక్తిగత గొడవ అని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు. గురువారం రోజు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ కోడి వెంకన్న, మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు విలేకరుల సమావేశం నిర్వహించి ప్రతిపక్ష బిజెపి, బిఆర్ఎస్ లపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ గొడవల్లో పోలీసులు రిమాండ్ చేసిన 16 మందిలో 12 మంది బీఆర్ఎస్ కార్యకర్తలేనని మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు ఆధారాలతో సహా వెల్లడించారు. నిందితులు గతంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డితో కలిసి ఉన్న ఫోటోలను మీడియాకు ప్రదర్శించారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఒకటో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి తేలుకుంట్ల రాజకుమారి కోసం పనిచేసిన వారే ఇప్పుడు గొడవలకు కారణం అని. తుమ్మలపల్లి జాతరలో జరిగిన పాత కక్షలను మనసులో పెట్టుకుని వారు గొడవ పడితే, దాన్ని కాంగ్రెస్‌కు ఆపాదించడం హాస్యాస్పదం" అని నేతలు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని నేతలు ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క వార్డు కూడా గెలిపించుకోలేని బీజేపీ నేతలు గంగిడి మనోహర్ రెడ్డి, నాగం వర్షిత్ రెడ్డిలు ఇక్కడకు వచ్చి రాజకీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. మునుగోడు నియోజకవర్గంలో శాసనసభ్యులుగా పోటీ చేస్తూ వస్తున్న గంగిడి మనోహర్ రెడ్డికి 10 నుండి 12 వేల ఓట్లు మాత్రమే పడుతున్న క్రమం చూస్తుంటే.. మునుగోడు నియోజకవర్గంలో బిజెపి పార్టీ ఎక్కడ ఉందని ఆయన ఎద్దేవా చేశారు. మునుగోడు నియోజకవర్గం నుండి గంగిడి మనోహర్ రెడ్డి వెళ్లిపోవాలని సొంత పార్టీ కార్యకర్తలే కోరుకుంటున్నారని అన్నారు. ప్రశాంతంగా ఉన్న చండూరులో రాజకీయ చిచ్చు పెట్టవద్దు అంటూ.. "ఖబడ్దార్ బీజేపీ నేతల్లారా..!" అని హెచ్చరించారు. పోలీసులు అధికార యంత్రాంగం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ కి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. దళిత యువకుడు గడ్డం లోకేష్‌పై దాడి చేసిన వారిని వదిలేసి, బాధితులపైనే కేసులు పెట్టడం దారుణమన్నారు. ఒక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కూడా ఈ గొడవల్లో పాల్గొని దాడులు చేసిన వీడియోలు తమ వద్ద ఉన్నాయని వెల్లడించారు. ఇసుక మాఫియా ముసుగులో అరాచకాలు చేస్తున్న దోటి కిరణ్ వెనుక ఉన్న శక్తులను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిలు పార్టీలకు అతీతంగా చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఈ కుట్రలు చేస్తున్నారని నేతలు వాపోయారు. వేలాది మందికి చూపునిచ్చిన కంటి వైద్య శిబిరాలను, అభివృద్ధిని విమర్శించే బీజేపీ నేతలకు కళ్లు కనిపించడం లేదని, కోమటిరెడ్డి సుశీలమ్మ కంటి వైద్య శిబిరంలో చికిత్స చేయించుకొమ్మని ఎద్దేవా చేశారు. అబద్ధపు ప్రచారాలు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారు. చండూరులో తాము కొత్తగా మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకోవడాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. రాజగోపాల్ రెడ్డి ని కానీ, కాంగ్రెస్ పార్టీని కానీ అనవసరంగా విమర్శిస్తే ఊరుకోబోమని, వాస్తవాలను గమనించి ప్రజలే వారికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కౌన్సిలర్లు కటకం రమేష్, వాసు, మాజీ కౌన్సిలర్ కోడి వెంకన్న, పున్న ధర్మేందర్, కల్లెట్ల మారయ్య, భీమనపల్లి శేఖర్, ఐయితరాజు మల్లేష్, బ్రహ్మం, డీలర్ వెంకన్న ఇరి వెంకటేశం, గజ్జల కృష్ణారెడ్డి, లతీఫ్ ఖలీల్, జన్ను, వెంకన్న, దశరథ, ఐమద్, నాగరాజు, పందుల సత్యం, రవి, బోడ వెంకటేశం, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో నలుగురి అరెస్టు



**కరీంనగర్ క్రైమ్, మార్చి 19 (జనం సాక్షి) :** నగునూరు గ్రామంలో ఉన్న సిల్వర్ స్ప్రింగ్ విల్లాస్ లోని ఒక స్టోర్ రూమ్ లో ఉన్న కరెంటు కు సంబంధించిన సుమారు 60 వేల రూపాయల విలువగల కరెంటు వైర్ బండల్స్ ను దొంగలించబడింది అని యజమాని రూరల్ పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి దొంగిలించుకుని పారిపోయిన వ్యక్తుల కేసును దర్యాప్తు చేస్తున్న సమయంలో తీగలగుట్టపల్లి నుండి ఆరేపల్లికి పోవు దారిలో ఎల్లమ్మ గుడి దగ్గరలో నలుగురు వ్యక్తులు కనబడగా ఆ వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవుటకు ప్రయత్నం చేయగా వ్యక్తులను పట్టుకొని విచారించగా నగునూరులో జరిగిన దొంగతనం గురించి ఒప్పుకొని దొంగిలించుకుని పోయిన కరెంటు వైర్ సామానును పక్కనే గల చెట్ల పొదలో మట్టి కప్పి దాచి ఉంచినమని ఒప్పుకోవడం జరిగింది. దరఖాస్తుదారుల్ని పిలిపించి అక్కడే పంచనామా చేసి కరెంటు వైర్ చుట్టాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ కేసుకు సంబంధించిన బొంత కుమార్, అలకుంట్ల జంపయ్య అలియాస్ జంపరాజు, సూర శివాజీ, సూర నవీన్ వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగింది. ఈ నలుగురు దొంగలను రిమాండ్ గురించి మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరచడం జరిగింది. ఈ కేసు కు సంబంధించి చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్నందుకు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ లక్ష్మారెడ్డి, కానిస్టేబుళ్లు సల్మాన్, అఫ్జల్ అభినందించనైనది.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 19 (జనంసాక్షి) :** రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఉగాది సందర్బంగా ఏరువాక సాగు పనులను గురువారం వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్నలు ప్రకృతి ఆరాధనే ఏరువాక కార్యక్రమం అన్నారు. 4 వార్డ్ లోని మహాలక్ష్మి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఉత్సాహంగా సాగు పనులు ప్రారంభించారన్నారు. ఏరు అంటే నాగలి అని, వాక అంటే ప్రారంభమన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో రాబోయే వర్షాకాలం కోసం భూమిని సిద్ధం చేసే ఈ పవిత్ర కార్యం మన సంస్కృతిలో ఒక భాగమన్నారు. రైతులు తమ జీవనాధారమైన పశువులను, నాగలిని పూజించి, భూమాతకు నైవేద్యం సమర్పించి తొలి దుక్కి దున్నడం ఆనవాయితీగా వస్తోందని ఆయన గుర్తుచేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని కోరుకుంటూ సామూహికంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వకారణమన్నారు. వేములవాడ పరిధిలో రైతు సంఘాల ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వ్యవసాయం పట్ల ఉన్న మక్కువను, ఐక్యతను చాటుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చెర్మన్ రొండి రాజు, మున్సిపల్ వైస్ చెర్మెన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు తోట రాజు, కొక్కుల బాలకృష్ణ, కొండ రాజశేఖర్, తుం మధు, రామతీర్థపు కృష్ణవేణి హరీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహాలక్ష్మి రైతు మిత్ర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఎరాజ్‌పల్లిలో అలరించిన కుస్తీ పోటీలు



**బోధన్, మార్చి 19 (జనంసాక్షి) :** బోధన్ మండలం ఎరాజ్ పల్లి గ్రామంలో గురువారం ఉగాది పండుగను పురస్కరించుకొని నిర్వహించిన కుస్తీ పోటీలు ప్రతీ ఒక్కరినీ అలరించాయి. ఈ మేరకు గ్రామంలో నిర్వహించిన కుస్తీ పోటీలలో మల్ల యోధులు దూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో వచ్చి కుస్తీ పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవిదాస్ గౌడ్, ఉప సర్పంచ్ పవన్, మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ, గ్రామ పెద్ద కాపు సంతోష్ రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు రజనీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకన్న, గోపాల్, గ్రామస్తులు పెద్దోళ్ల నరసింహ రెడ్డి, నడిపి గంగారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కామారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉగాది వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 19 (జనం సాక్షి) :** కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగ శ్రవణం మరియు ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన సంవత్సర పంచాంగ శ్రవణాన్ని ఆలకించారు. అనంతరం విచ్చేసిన వారందరికీ ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఉగాది పచ్చడి అంటే కేవలం ఆరు రుచుల సమ్మేళనం మాత్రమే కాదని, అది మన భారతీయ సంస్కృతి యొక్క గొప్పదనానికి ప్రతీక అని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను, వివిధ అనుభవాలను సమానంగా స్వీకరించాలని, ఉగాది పచ్చడి మనకు గుర్తు చేస్తుందని వివరించారు. మన గొప్ప సాంప్రదాయాలను గౌరవిస్తూ, వాటిని స్ఫూర్తిగా తీసుకుని ఈ నూతన సంవత్సరానికి ఉత్సాహంగా స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ, వారి కుటుంబ సభ్యులకు ఎస్పీ మనస్ఫూర్తిగా ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల సంతోషాలను పంచుకోవడమే కాకుండా, కష్టకాలంలో కూడా వారికి వెన్నుముకగా నిలుస్తాం అని ఆయన భరోసా ఇచ్చారు. ఈ నూతన సంవత్సరంలో అందరికీ ఆయురారోగ్యాలు కలగాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటిని ధైర్యంగా ఎదుర్కొనే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు ఈ వేడుకల్లో కామారెడ్డి ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, కామారెడ్డి టౌన్ ఎస్హెచ్ఓ నరహరి, రూరల్ సీఐ రామన్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది మరియు పట్టణ ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం విచ్చేసిన వారందరికీ ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.

## ఉగాది పర్వదినాన 45 ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు



**హాలియా, మార్చి 19 (జనం సాక్షి) :** ఉగాది పండుగ శుభ సందర్భంగా హాలియా మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను గృహప్రవేశ కార్యక్రమంతో గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాలియా మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు గృహవసతి కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సురక్షిత నివాసాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఉగాది పర్వదినాన గృహప్రవేశాలు జరగడం లబ్ధిదారులకు మరింత ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 45 ఇళ్ల గృహప్రవేశాలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, మున్సిపాలిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఉప చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి, 2వ వార్డు కౌన్సిలర్ సలహాదారు నకిరేకంటి సైదులు, 3వ వార్డు కౌన్సిలర్ కుందూరు వెంకటరెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ కడమంచి ప్రమీల, 5వ వార్డు కౌన్సిలర్ చిట్టిపోలు శ్రీదేవి, 8వ వార్డు కౌన్సిలర్ గౌహర్ జబీన్, 9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, 10వ వార్డు కౌన్సిలర్ సలహాదారు పిల్లి ఆంజనేయులు, 11వ వార్డు కౌన్సిలర్ డి. ప్రసాద్ బాబు, 12వ వార్డు కౌన్సిలర్ సలహాదారు ఎడవల్లి రంజిత్, గృహనిర్మాణ శాఖ అధికారులు, వార్డు అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక పెద్దలు, సిబ్బంది, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు మున్సిపాలిటీ, గృహనిర్మాణ శాఖ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు.

## కుక్కదాడిలో 8 మందికి గాయాలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 19 (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో గురువారం సాయంత్రం సమయంలో కుక్క పలువురు చిన్నారులు పెద్దవారు మొత్తం 8 మందిని కరవడంతో గ్రామం అంత ఉలిక్కిపడింది. బైక్ పై వెళుతున్నా వారిపై బైక్ పైకి ఎగిరి కరవడం చాలా దారుణమైన సంఘటన చోటు చేసుకుంది. రామారెడ్డి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇంజెక్షన్ లు చేశారు విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ లింగం, ఉప సర్ంచ్ అంజయ్య, మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి, వార్డ్ సభ్యులు, గ్రామస్తులు ఆసుపత్రికి చేరుకుని మెరుగైన చికిత్స అందించాలని కోరారు. వెంటనే స్పందించిన డాక్టరు, ఆసుపత్రి స్టాఫ్ కు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రతి పేదవారికి సొంతిల్లు

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**మొయినాబాద్, మార్చి 19 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి గృహ వసంతి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. గురువారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని 18, 25 వార్డులలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని గృహ ప్రవేశ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి గృహ వసంతి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన అన్నారు. పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ.. మరోవైపు అభివృద్ధిలో ముందుకు దూసుకువెళ్తుందన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ముర్తుజగూడలోని 12వ వార్డులో దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరై సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లోనూ వ్యక్తిగతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపల్ చైర్మన్ దుబ్బ సోనియా దర్శన్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మొయినాబాద్ కౌన్సిలర్లు పల్లగోల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్, విక్రం రెడ్డి, గీతా వనజాక్షి, వాజీద్, నాయకులు జైపాల్ రెడ్డి, నేరెట్ల రాజు గౌడ్, మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదిదారులు పాల్గొన్నారు.

# కృత్రిమ పానీయాలు మానేసి సహజమైనవి తాగాలి

- బి. చంద్రశేఖర్ నల్లగొండ జిల్లా కలెక్టర్



**నల్లగొండ ప్రతినిధి, మార్చి 19 (జనం సాక్షి) :** తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నల్లగొండ జిల్లా మరియు జ్ఞాన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నన్నూరి రమణారెడ్డి మరియు నర్రా శేఖర్ రెడ్డి అధ్యక్షతన జిల్లా గడియారం సెంటర్ వద్ద నిర్వహించిన ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రకృతిలో సహజంగా దొరికే పానీయాలను తాగాలని కృత్రిమంగా తయారై పానీయాల వల్ల ఆరోగ్యం చెడి పోతుందని తెలుపుతూ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కృత్రిమ పానీయాలు మానేద్దాం సహజ పానీయాలు సేవిద్దాం అనే నినాదంతో ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమాన్ని చేపట్టిన టీఎస్ యుటిఎఫ్ నల్లగొండ జిల్లా కమిటీని అభినందించారు. నల్లగొండ కార్పొరేషన్ మొదటి మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సర మైన ఉగాది యొక్క విశిష్టతను కాలంలో వచ్చే మార్పులు కనుగుణంగా మన శరీరానికి సరైన పోషకాలు ఇచ్చేటటువంటి సహజ పానీయాలను తాగాలనే మోటీవ్ ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఆ రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు ఎం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ టీఎస్ యుటిఎఫ్ అధ్యయనం అధ్యాపనం సామాజిక స్పృహలో భాగంగా సమాజంలో కృత్రిమ పానీయాల వల్ల జరిగేటటువంటి అనర్థాలను ప్రజలకు వివరించి సహజ పానీయాలను సేవించడం ద్వారా జరిగే లాభాలను ప్రజలకు వివరించడం మా సంఘ బాధ్యత అని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం మాట్లాడుతూ యువత ఈనాడు శీతల పానీయాలను విచ్చలవిడిగా తాగుతూ తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని అందుకే గత కొన్ని సంవత్సరాలుగా నల్లగొండ జిల్లా కమిటీ జన విజ్ఞాన వేదిక కలిసి ప్రతి ఉగాది రోజున షడ్రుచులు కలిగినటువంటి ఉగాది పచ్చడిని పంపిణీ చేస్తూ శీతల పానీయాలతో జరిగేటటువంటి అనర్థాల పట్ల అవగాహన కల్పిస్తూ హక్కులతో పాటు బాధ్యతగా సమాజంలో కృత్రిమ పానీయాల వల్ల జరిగే అనర్థాలు తగ్గించడానికి తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉగాది పచ్చడి వితరణ కేంద్రాన్ని సందర్శించినటువంటి డిఎస్పి గారు మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగిన టీఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయ సంగం సహజ పానీయాల వల్ల కలిగే ఎటువంటి లాభాలను సమాజానికి తెలపడం ఎంతో మంచి పరిణామం అని అందరూ ఈ వేసవిలో కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మకాయ రసం, చెరుకు రసం వంటి సహజపానియాలే తాగాలని అన్నారు. మాజీ నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈరోజు నుండి తెలుగువారికి నూతన సంవత్సరం ప్రారంభం అవుతుందని పంచాంగం పఠనం చేసి రాబోయే సంవత్సర కాలంలో రాశులు, నక్షత్రాలు, కాలాల గురించి ఎలా ఉంటుందో తెలుసుకోవడం జరుగుతుందని ఇది హిందువులకు గొప్ప పండుగని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎడ్ల సైదులు జిల్లా కార్యదర్శులు గేర నరసింహ, మురలయ్య, నలపరాజు వెంకన్న కొమర్రాజు సైదులు, మధుసూదన్, జన విజ్ఞాన వేదిక బాధ్యులు చంద్రశేఖర్, పిడి విమల, టాప్రా జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్, అడ్వకేట్ శంకరయ్య, వివిధ మండలాల బాధ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లో ప్రసవం

- తల్లి, శిశువు సురక్షితం..



**దమ్మపేట మార్చి 19 (జనం సాక్షి) :** దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామానికి చెందిన తాటి కృష్ణకుమారి ప్రసవ వేదనలతో బాధపడుతుండగా 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే దమ్మపేట 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈఎంటి రాము చీమల పరీక్షించగా ఆమెకు తీవ్ర ప్రసవ వేదనలు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఆమెను అంబులెన్స్‌లోకి తీసుకుని వైద్య పరీక్షలు చేసి ఆసుపత్రికి తరలిస్తుండగా కృష్ణకుమారి ప్రసవ వేదనలు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లోనే సురక్షితంగా పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉండగా, అనంతరం సమీప దమ్మపేట ఆసుపత్రికి తరలించారు. అత్యవసర సమయంలో చాకచక్యంగా స్పందించిన ఈఎంటి రాము చీమల, పైలట్ లాల్‌సింగ్‌ను స్థానికులు అభినందించారు.

## విపణి

# హెచ్‌డీఎఫ్‌సీ ఛైర్మన్ అనూహ్య రాజీనామా

### 9 శాతం కుంగిన షేర్లు

**న్యూఢిల్లీ:**హెచ్‌డీఎఫ్‌సీ పార్ట్ టైం ఛైర్మన్, స్వతంత్ర డైరెక్టర్ అయిన అతాను చక్రబర్తి అనూహ్య రాజీనామాతో ఆ బ్యాంక్ షేర్లు భారీగా కుంగాయి. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఒక దశలో 9 శాతం మేర పతనమయ్యాయి. బ్యాంక్ నిఫ్టీ 3 శాతం మేర పడిపోయింది. బ్యాంకులో గత రెండేళ్లలో జరిగిన కొన్ని సంఘటనలు, ధోరణులను అంగీకరించలేకపోతున్నానని అతాను వెల్లడించడం ప్రభావం చూపిస్తోంది. "ఆయన నిర్దిష్ట కారణం మాత్రం వెల్లడించలేదు. విశ్వసనీయమైన చర్యలు తీసుకునేవరకు ఇప్పుడు ఏర్పడిన అభిప్రాయమే ప్రభావం చూపిస్తుంది" అని జేపీమోర్గాన్ విశ్లేషకులు అనుజ్ సింగ్లా పేర్కొన్నారు. తాజా పరిణామాలతో దేశంలోనే అతిపెద్ద ప్రైవేటు బ్యాంకులో మదుపర్ల సంపద లక్ష కోట్లకు పైగా తుడిచిపెట్టుకుపోయింది.

పెద్ద సమస్యలేవీ లేవు.. కేకీ మిస్త్రీ

చక్రబర్తి రాజీనామా తక్షణం అమల్లోకి రావడంతో కేకీ మిస్త్రీని మధ్యంతర పార్ట్ టైం ఛైర్మన్‌గా బ్యాంకు నియమించింది. "ఈ రాజీనామా వెనక బ్యాంక్‌లో ఎలాంటి తీర్చలేని సమస్యలు లేవు. చిన్న అంశాలపై అభిప్రాయ భేదాలు వస్తుంటాయి. అవి సాధారణమే తప్ప, ఆందోళన కలిగించేవి కావు" అని ఇన్వెస్టర్ కాల్‌లో మిస్త్రీ భరోసా ఇచ్చారు. తన రాజీనామా లేఖలో లేవనెత్తిన ఆందోళనలపై చక్రబర్తి నుంచి బోర్డ్‌కు పూర్తి వివరాలు అందలేదని పేర్కొన్నారు. బ్యాంకుపై మదుపర్ల విశ్వాసాన్ని బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటామని హెచ్‌డీఎఫ్‌సీ సీఈఓ శశిధర్ జగదీషన్ వాటాదారులతో వెల్లడించారు.

ఆర్‌బీఐ ఏమందంటే..?

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పందించింది. బ్యాంక్ గవర్నెన్స్‌కు సంబంధించి ఎలాంటి తీవ్రమైన ఆందోళనలు లేవని పేర్కొంది. బ్యాంక్ వద్ద తగినంత మూలధనం ఉందని, దాని ఆర్థిక స్థితి సంతృప్తికరంగా ఉందని తెలిపింది.




# మార్కెట్‌కు చమురు మంటలు

### సెన్సెక్స్ 2497 పాయింట్లు పతనం



**ముంబయి:** పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రతరం అవుతోంది. తమ దేశంలోని గ్యాస్ క్షేత్రంపై దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా పొరుగుదేశాల్లో దాడులకు తెగబడుతోంది. ఖతార్, సౌదీలోని ఇంధన మౌలిక వసతులే లక్ష్యంగా దాడులు చేస్తోంది. దీంతో చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 115 డాలర్ల స్థాయికి చేరింది. ఈ మంటలు దలాల్ స్ట్రీట్‌నూ తాకాయి. దీనికితోడు వడ్డీ రేట్లను స్థిరంగా కొనసాగిస్తున్నట్లు అమెరికా ప్రకటించడమూ ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో మూడు రోజుల పాటు వరుస లాభాలు చవిచూసిన స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా పతనమయ్యాయి. సెన్సెక్స్ ఓ దశలో 2700 పాయింట్ల మేర క్షీణించగా.. నిఫ్టీ 23వేల దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.13 లక్షల కోట్లు క్షీణించి రూ.426 లక్షల కోట్లకు చేరింది.సెన్సెక్స్ ఉదయం 74,750.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,704.13) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 73,950.95 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 2496.89 పాయింట్ల నష్టంతో 74,207.24 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 775.65 పాయింట్ల నష్టంతో 23,002.15 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో అన్ని స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. ఎటర్నల్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 114 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4700 డాలర్ల స్థాయికి చేరింది.

కారణాలు ఇవీ..

చమురు ధరలు: ఖతార్‌లోని అత్యంత కీలకమైన రస్ లాఫాన్ ఇండస్ట్రియల్ సిటీపై ఇరాన్ క్షిపణితో దాడి చేసింది. ఇది ఖతార్ ఆర్థికవ్యవస్థకు పునాది. ఈ దాడి ఉద్రిక్తతలను మరింత పెంచనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. రస్ లాఫాన్ గ్యాస్ క్షేత్రం నుంచి అత్యధికంగా ఫెర్టిలైజర్స్, సీఎన్‌జీ, పీఎన్‌జీ అవసరాల కోసం భారత్ ఆధారపడుతుంది. భారత్ కొనుగోలు చేసే లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్‌లో 47శాతం ఖతార్ నుంచే లభిస్తుంది. సౌదీ ఆరామ్‌కో రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడులకు దిగింది. దీంతో అంతర్జాతీయంగా చమురు ధరలు మళ్లీ 115 డాలర్ల మార్కును చేరింది.

ఫెడ్ నిర్ణయం: పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను సవరించలేదు. ద్రవ్యోల్బణం ఊహించిన స్థాయిలో దిగువకు రాలేదని, అందుకే వడ్డీ రేట్లను స్థిరంగా కొనసాగిస్తున్నట్లు ఫెడ్ చీఫ్ జెరోమ్ పావెల్ పేర్కొన్నారు. దీంతో నిన్నటి అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఈ ప్రభావం ఆసియా సహా మన మార్కెట్లపైనా పడింది. దీనికితోడు అమెరికా బాండ్ రాబడులు మళ్లీ పెరగడం ఈక్విటీ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది.

**హెచ్‌డీఎఫ్‌సీ షేర్ల పతనం:**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాత్కాలిక ఛైర్మన్ అతాను చక్రవర్తి రాజీనామాతో ఆ బ్యాంక్ షేర్లు 9 శాతం మేర పతనమయ్యాయి. అధిక వెయిటేజీ కలిగిన స్టాక్ కావడంతో సూచీలపై ఆ ప్రభావం కనిపించింది.ఎఫ్ఐఐల విక్రయాలు: దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ మదుపర్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. బుధవారం కూడా రూ.2714 కోట్ల విలువైన షేర్లను వీరు విక్రయించారు. గడిచిన 14 రోజులుగా నెట్ సెలర్లుగా నిలుస్తుండడం మన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది.లాభాల స్వీకరణ: గత మూడు ట్రేడింగ్ సెషన్లలో బెంచ్ మార్క్ సూచీలు లాభాలు చవిచూశాయి. అంతర్జాతీయంగా మరోసారి నెగిటివ్ వార్తల నేపథ్యంలో మదుపర్లు కొంత లాభాలకు స్వీకరణకు దిగడంతో మార్కెట్‌పై ఆ ప్రభావం కనిపించింది.

# బడ్జెట్ సెగ్మెంట్‌లో రియల్‌మీ నుంచి పీ4 లైట్..

**న్యూఢిల్లీ:**ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ రియల్‌మీ.. పీ4 లైట్ పేరిట బడ్జెట్ ధరలో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను తీసుకొచ్చింది. ఇప్పటికే పీ4 సిరీస్‌లో పీ4, పీ4ఎక్స్, పీ4 ప్రో 5జీ మోడళ్లను కంపెనీ లాంచ్ చేసింది. తాజాగా బడ్జెట్ సెగ్మెంట్‌లో పీ4 లైట్‌ను తీసుకొచ్చింది. డైమెన్‌సిటీ 6300 5జీ చిప్‌సెట్, ఎయిర్‌ఫ్లో వేపర్ ఛాంబర్ హీట్ తొలగించే వ్యవస్థతో పాటు 7000 ఎంఏహెచ్ బిగ్ బ్యాటరీ ఈ ఫోన్ ప్రధాన ఫీచర్లు. పూర్తి వివరాల్లోకి వెళితే..

పీ4 లైట్ ప్రత్యేకతలు

6.8 అంగుళాల హెచ్‌డీ+ ఎల్‌సీడీ స్క్రీన్ 144 ఊళి రిఫ్రెష్ రేట్, 900 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఆండ్రాయిడ్ 16 ఆధారిత రియల్‌మీయూఐ 7.0

రెండేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, మూడేళ్లపాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ మీడియాటెక్ 6300 5జీ ప్రాసెసర్ 13 ఎంపీ ప్రధాన కెమెరా, 5 ఎంపీ సెల్ఫీ కెమెరా

7000 ఎంఏహెచ్ బ్యాటరీ, 15చి ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్ బరువు 212 గ్రాములు ధర ఎంత: 4జీబీ+ 64జీబీ ధర రూ.12,999; 4జీబీ+ 128జీబీ ధర రూ.13,999; 6జీబీ+ 128జీబీ వేరియంట్ ధర రూ.15,999గా కంపెనీ నిర్ణయించింది. మొసాయిక్ బ్లూ, మొసాయిక్ గ్రీన్ రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, రియల్‌మీ ఇండియా వెబ్‌సైట్, ఇతర ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్లలో మార్చి 25 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. లాంచ్ ఆఫర్‌లో భాగంగా రూ.1000 డిస్కౌంట్ లభిస్తుంది. బ్యాంక్ ఆఫర్ కింద రూ.500, రియల్‌మీ కస్టమర్లకు రూ.500 అదనపు ఎక్స్ఛేంజ్ బోనస్ లభిస్తుంది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,44,600 | ₹ 1,57,750 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,75,000

# గల్ఫ్ దేశాల నుంచి దిగుమతులకు స్థానిక కరెన్సీల్లోనే చెల్లింపులు

### మార్గాలు అన్వేషిస్తున్న భారత్



**వాషింగ్టన్:**గల్ఫ్ దేశాలకు వాణిజ్య చెల్లింపులను ఆయా దేశాల స్థానిక కరెన్సీల్లోనే చేసేందుకు ఉన్న మార్గాలను భారత్ అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ ఆందోళనల నేపథ్యంలో చమురు సహా ఇతర వస్తువుల దిగుమతుల బిల్లు పెరగకుండా చూడాలన్నదే దీని వెనక ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. 'అంతర్జాతీయ అనిశ్చితుల వల్ల సరఫరాపరమైన అవరోధాలు ఏర్పడుతున్నాయి. చమురు, పెట్రోలియం ఉత్పత్తులు సహా పలు వస్తువుల దిగుమతుల బిల్లు పెరుగుతోంది. అందుకే అంతర్జాతీయ అనిశ్చితులు ఎప్పుడు తలెత్తినా.. ఆ ప్రభావం నుంచి దిగుమతుల బిల్లును కాపాడుకోవాలని భారత్ అనుకుంటోంద'ని ప్రభుత్వ అధికారి ఒకరు వెల్లడించినట్లు ఓ ఆంగ్ల వార్తా కథనం తెలిపింది. పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతల కారణంగా బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ధర 70 డాలర్ల నుంచి పెరిగి ఏకంగా 110 డాలర్లను మించిన సంగతి తెలిసిందే. భారత్ తన ముడి చమురు అవసరాల్లో 85 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడుతున్నందున.. ఇటీవలి ధరల పెరుగుదల వల్ల భారత్‌కు దిగుమతి బిల్లు భారీగా పెరగనుంది. ఈ ప్రభావం వాణిజ్య లోటు, ద్రవ్యోల్బణం మీద కనిపించనుంది. మరోవైపు 2024-25లో భారత్ మొత్తం చమురు దిగుమతుల్లో గల్ఫ్ దేశాల నుంచే 28% ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక కరెన్సీల్లో వాణిజ్య చెల్లింపులు చేస్తే.. దిగుమతి బిల్లుపై పడే భారాన్ని కొంతైనా తగ్గించుకోవచ్చన్నది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది.

### పశ్చిమాసియా గగనతలంలో

# ప్రళయకాల విమానం

- దీని తోకపొడవు 5 మైళ్లు..!
- గాల్లో అణు కమాండ్ సెంటర్..!
- అణు జలాంతర్గాములకు ఆదేశాలు




**వాషింగ్టన్:**అమెరికా అమ్ములపొదిలోని ఆ విమానం గాల్లోకి లేస్తే.. శత్రువుకు కంటిమీద కునుకు ఉండదు. అమెరికా ఎంత దెబ్బతిన్నా.. శత్రువుపై ప్రతిదాడి చేసేందుకు అవసరమైన న్యూక్లియర్ కోడ్స్‌ను జాగ్రత్తగా సముద్రగర్భంలోని అణు జలాంతర్గాములు.. ఖండాంతర క్షిపణులు.. బాంబర్ విమానాలకు ఇది చేరుస్తుంది. గాల్లో ఓ న్యూక్లియర్ కమాండ్ పోస్టులా పనిచేస్తుంది. సాధారణంగా ఈ విమానాలు అమెరికా దాటి బయటకు వెళ్లిన సందర్భాలు అరుదు. కానీ.. ఈసారి ఇరాన్ యుద్ధం వేళ పశ్చిమాసియా గగనతలంలో దీని కదలికలు కనిపిస్తున్నాయి. ఈ విమానమే నేవీ బోయింగ్ 'ఇ-6బి మెర్క్యూరి'..! తీవ్ర సంక్షోభ సమయంలో దళాలకు అత్యవసర సమాచారం పంపించడానికి ఈ విమానాలు స్ట్రాటజిక్ కమాండ్ పోస్టుల పాత్రను పోషిస్తాయి. ఇవి నేషనల్ కమాండ్ అథారిటీ కి అమెరికా స్ట్రాటజిక్ (అణ్వాయుధ), నాన్ స్ట్రాటజిక్ దళాలకు మధ్య అనుసంధానంగా వ్యవహరిస్తాయి. అమెరికా నౌకాదళానికి సంక్షోభ సమయంలో టేక్ ఛార్జ్ అండ్ మూవ్ ఔట్ విధులను ఇవే నిర్వహిస్తాయి. ఇలాంటి విమానాలు అమెరికా వద్ద 16 ఉన్నాయి. ప్రస్తుతం అమెరికాలోని ఓక్లహోమాలోని టింకర్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో ఐరన్‌మెన్, షాడోస్ స్క్వాడ్రన్లు వీటిని నిర్వహిస్తున్నాయి. సాధారణ బోయింగ్ 707 మోడల్ విమానాల్లో మార్పులు చేసి వీటిని సిద్ధం చేశారు. సాధారణంగా అత్యంత కీలకమైన వీఎల్ఎఫ్ సందేశాలను ప్రసారం చేసే గ్రౌండ్ స్టేషన్లు కూడా ఇందులో ఉన్నాయి. సాధారణంగా యుద్ధాలు మొదలైతే శత్రువుల తొలి లక్ష్యాల్లో గ్రౌండ్ స్టేషన్లు ఉంటాయి. ఈ నేపథ్యంలో ఇ-6బి మెర్క్యూరి విమానాలను వీఎల్ఎఫ్ సందేశాలు పంపే సేవల కోసం అమెరికా ఉపయోగించనుంది.టేక్ ఛార్జ్ అండ్ మూవ్ ఔట్ ఆపరేషన్ల వేళ ఇవి నేవల్ బాలిస్టిక్ మిసైల్ ఫోర్స్‌కు నేషనల్ కమాండ్ సెంటర్ ఆదేశాలను చేరవేయగలవు. సాధారణంగా న్యూక్లియర్ సబ్‌మెరైన్లు సముద్ర జలాల్లో అత్యంత రహస్యంగా సంచరిస్తాయి. వీటికి సందేశాలను పంపేందుకు ఈ డూమ్స్‌డే విమానానికి ప్రత్యేకంగా 'వెరీ లో ఫ్రీక్వెన్సీ' కమ్యూనికేషన్ యాంటెనా ఉంటుంది. దీని పొడవు సుమారు 5 మైళ్లు ఉండటం విశేషం. దీని ట్రాప్‌డోర్‌లో మరో చిన్న యాంటెనా కూడా ఉంటుంది. వీటినుంచి వెలువడే వీఎల్ఎఫ్ సంకేతాలు చాలా శక్తిమంతమైనవి. ఇవి సముద్రజలాల్లో 60 అడుగుల కింద వరకు చొచ్చుకెళ్లి జలాంతర్గాములతో సంభాషిస్తాయి.

**పొడవైన తోకతో.. ప్రత్యేక పద్ధతిలో..**

ఇ-6బి మెర్క్యూరికి ఉన్న 5 మైళ్ల పొడవైన యాంటెనా గాల్లో ఉన్న సమయంలో విమానానికి సమాంతరంగా వస్తుంది. దీనిని సముద్రం వైపు నిలువుగా తీసుకురావడానికి ఈ విమానం 20,000 అడుగుల ఎత్తుకు చేరుకొని చాలా నెమ్మదిగా ఒక వైపునకు ఒరిగి ప్రత్యేక విధానంలో ప్రయాణిస్తుంది. ఆ సమయంలో దాని 5 మైళ్ల యాంటెనా నిలువుగా సముద్రం పైకి వస్తుంది. అలా నీటి అడుగులో ఉన్న అణు జలాంతర్గాములకు సందేశాలను పంపిస్తుంది. ఈ ప్రక్రియ చాలా నిదానంగా జరుగుతుంది. ఒక్కోసారి దీనికి కొన్ని గంటల సమయం పట్టొచ్చు.ఇక అమెరికాలోని వివిధ ప్రదేశాల్లో మోహరించిన ఖండాంతర క్షిపణులను ఈ విమానాలు గాల్లో నుంచే రిమోట్ విధానంలో ప్రయోగించగలవు. దీంతోపాటు అణ్వస్త్రాలను మోసుకెళ్లే బాంబర్లతో సమన్వయం చేసుకొంటూ దాడులు చేయించగలవు. ఇరాన్ అణు కార్యక్రమమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ వేళ ఈ ఎగిరే అణు కమాండ్ సెంటర్ పశ్చిమాసియాలో కనిపించడం ఆందోళనకరంగా మారింది. అమెరికా నౌకాదళంలో అత్యంత శక్తిమంతమైన ఆయుధాలు మొత్తం ఇప్పుడు పశ్చిమాసియా పైనే గురిపెట్టి ఉన్నాయి. ఇరాన్ తన వద్దనున్న యురేనియంతో డర్టీబాంబ్ ప్రయోగం వంటి చర్యలకు పాల్పడితే యుద్ధం మరింత ముదరనుంది.

# 'ఖెష్మ్'ను అమెరికా నిలువరించేనా?

- ఇరాన్‌కు 'ఆయుధ'పట్టుగా నిలుస్తున్న దీవి
- అద్భుత ప్రకృతి అందాలకూ నిలయం



న్యూఢిల్లీ:అమెరికా-ఇజ్రాయెల్ దేశాలు భారీ దాడులతో విధ్వంసం సృష్టిస్తున్నా.. క్షిపణులు, డ్రోన్ల ప్రయోగ కేంద్రాలపై దాడులు చేస్తున్నా.. ఇరాన్‌కు ఏమాత్రం ఆయుధాల కొరత రావడం లేదు. దీనికి ఆ దేశం చేపట్టిన ముందస్తు చర్యలే కారణం. అంతలా ఇరాన్ ఏం చేయగలిగిందంటే.. భూగర్భంలో క్షిపణుల కోటను నిర్మించుకుంది. ఖెష్మ్ అనే దీవిలో అది నిర్మించిన ఈ కోట దుర్భేద్యం. అది ఇరాన్‌కు ఆయుధ పట్టుగానే కాకుండా అద్భుత పర్యాటక కేంద్రంగానూ ఉంది. పురాతన ఎరిత్రాస్ సమాధుల నుంచి ఆధునిక క్షిపణుల కేంద్రందాకా ఇది ఎంతో కీలకమైంది. గల్ఫ్‌లోనే అతి పెద్ద దీవి అయిన ఖెష్మ్.. యుద్ధంలో కీలకంగా నిలుస్తోంది. హర్మూజ్ ప్రాంతంలో ఇది ఉంది.ఖెష్మ్‌లో ఉప్పు గుహలు, మడ అడవుల కింద అద్భుత శిల్పకళా సౌందర్యం ఉంది. ఒకప్పుడు పర్యాటకులు ఈ ప్రాంతంలోని అద్భుతమైన ప్రకృతిని ఆస్వాదించేందుకు వచ్చేవారు. కానీ ఇప్పుడా ప్రాంతంలో క్షిపణుల కోట ఉంది. 1,445 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఖెష్మ్ విస్తరించి ఉంది. గల్ఫ్ నుంచి రవాణాకు ప్రవేశమార్గంగా ఉండే ఈ దీవి.. చమురు మార్గాన్ని అడ్డుకోగలిగే వ్యూహాత్మక ప్రాంతంలో ఉంది. అందుకే ఇక్కడి నుంచే హర్మూజ్‌లో రవాణాను ఇరాన్ అడ్డుకోగలుగుతోంది. ఈ దీవిలో 1,48,000 మంది సున్నీ ముస్లింలుంటారు. వారిది బందరీ మాండలికం. ప్రస్తుతం వారు తీవ్ర ఉద్రిక్తతల మధ్య జీవిస్తున్నారు.ఈ నెల 7వ తేదీన ఈ దీవిలోని డీశాలినేషన్ ప్లాంటుపై అమెరికా దాడి చేసింది. దీంతో 30 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. బందర్ అబ్బాస్ పోర్టు నగరానికి 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖెష్మ్.. ఇరాన్ నౌకా శక్తికి వేదికగా ఉంది. దీనిద్వారానే హర్మూజ్‌లో నౌకలను ఇరాన్ అడ్డుకోగలుగుతోంది. ఇక్కడి భూగర్భంలో క్షిపణుల నగరమే ఉంది. అందుకే ఇది 21వ శతాబ్దపు ఇంధన యుద్ధానికి వేదికగా నిలుస్తోంది. ఇక్కడ ఏయే ఆయుధాలను దాచారన్నది పూర్తిగా రహస్యమే అయినా.. ఇరాన్ అమ్ముల పొదిలో ఇక్కడి నుంచి వాడగలిగే ఆయుధాలన్నీ ఉన్నాయని అంటున్నారు. ఇక్కడ ఇరాన్‌కు చెందిన నౌకా విధ్వంసక క్రూజ్ క్షిపణులున్నాయి. జలసంధిలోని నౌకలను లక్ష్యంగా చేసుకోవడం కోసం వీటిని వాడతారు.

# 100 పారిశ్రామిక పార్కుల అభివృద్ధి

### రూ.33,600 కోట్లతో 'భవ్య' పథకం

### ప్రత్యక్షంగా 15 లక్షల ఉద్యోగాల సృష్టి

**న్యూఢిల్లీ:**దేశంలో పారిశ్రామిక ప్రగతికి ఊతం ఇచ్చేందుకు రూ.33,600 కోట్లతో భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య) పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 100 పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయనున్నారు. ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి, దేశీయ తయారీ రంగ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పాటును అందించడమే ఈ పథకం ఉద్దేశమని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ భవ్య పథకం ప్రత్యక్షంగా 15 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తుందని పేర్కొన్నారు. 2026-27 నుంచి 2031-32 వరకు ఆరేళ్ల పాటు కొనసాగే ఈ పథకం కింద 100 నుంచి 1000 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తారు. ఇందుకు ఒక ఎకరాకు రూ.1 కోటి వరకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. తొలి విడతలో 50 పార్కులను అభివృద్ధి చేస్తారు. ఈ పార్కులకు అంతర్గత రహదారులు, అండర్‌గ్రౌండ్ సదుపాయాలు, డ్రైనేజీ, కామన్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీస్, ఐసీటీ, పాలనా వ్యవస్థలు లాంటి కీలక మౌలిక వసతులన్నీ సమకూరుస్తారు. ఇవేకాకుండా రెడీ-బిల్ట్ ఫ్యాక్టరీ షెడ్‌లు, బిల్ట్- టు- సూట్ యూనిట్‌లు, ప్రయోగశాలలు, గిడ్డంగులు, సిబ్బంది కోసం గృహాలతో పాటు ఇతరత్రా సదుపాయాలనూ ఏర్పాటు చేస్తారు. రాష్ట్రాలు, ప్రైవేట్ రంగ సంస్థల భాగస్వామ్యంలో భవ్య పథకాన్ని అమలు చేస్తారు.

చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టులకు రూ.2,585 కోట్ల కేటాయింపు: చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టులకు సహకారం అందించేందుకు రూ.2,585 కోట్ల పథకానికి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఇందులో భాగంగా ప్రాజెక్టు వ్యయంలో 30 శాతం లేదా మెగావాట్‌కు రూ.3.6 కోట్ల వరకు సాయం అందించనుంది. 25 మెగావాట్ల వరకు సామర్థ్యం ఉన్న చిన్న హైడ్రో ప్రాజెక్టులు సుమారు రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ పథకం తోడ్పడనుంది.సీసీఐకి రూ.1,718.56 కోట్ల నిధులు: 2023-24 సీజన్‌లో పత్తి సేకరణ సమయంలో మద్దతు ధర కోసం వెచ్చించిన నిధులకు గాను రీఎంబర్స్‌మెంట్ కింద రూ.1,718.56 కోట్లను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు (సీసీఐ) కేంద్రం ఇవ్వనుంది. 2023-24 సీజన్‌లో పత్తి ధర కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) దిగువకు పడిపోవడంతో.. 32.84 లక్షల బేళ్ల పత్తికి ఎంఎస్‌పీ కార్యకలాపాల కింద ధర మద్దతును అందివ్వాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. దీనివల్ల 7.25 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలిగిందని.. సుమారు రూ.11,712 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసిందని పేర్కొన్నారు.



## కేరళ అసెంబ్లీ ఎన్నికలు.. నామినేషన్ వేసిన ముఖ్యమంత్రి

తిరువనంతపురం:దేశవ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగిన విషయం తెలిసిందే. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధర్మదం నుంచి బరిలో దిగనున్నారు. ఏప్రిల్ 9న రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. గురువారం ఆయన నామినేషన్ వేశారు.ఉదయం 11 గంటల సమయంలో తలస్సెరి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో నామినేషన్ పత్రాలను సమర్పించారు. బుధవారం తన నియోజకవర్గంలో విజయన్ రోడ్‌షో నిర్వహించారు . 80 ఏళ్ల వయసులోనూ ఉత్సాహంగా ప్రచారం మొదలుపెట్టిన విజయన్ తన రాజకీయ జీవితంలో అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేయడం ఇది ఏడోసారి. ధర్మదం నుంచి బరిలోకి దిగడం ఇది మూడోసారి. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున వీపీ అబ్దుల్ రషీద్ బరిలో నిలవగా, భాజపా అభ్యర్థిగా రంజిత్ పోటీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 9న 140 అసెంబ్లీ స్థానాల్లో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

## ఆరేళ్లలో 18వేల గుండెపోటు మరణాలు

న్యూఢిల్లీ:ఈ మధ్య కాలంలో వయసుతో సంబంధం లేకుండా గుండెపోటుతో మరణించే వారి సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. హరియాణాలో గత ఆరేళ్లలో 18-45 ఏళ్ల వయసు వారు దాదాపు 18వేల మంది హార్ట్‌ఎటాక్‌తో మరణించినట్టు అసెంబ్లీలో హరియాణా ప్రభుత్వం వెల్లడించింది. యువతలో గుండెపోటు కారణంగా సంభవించిన మరణాలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రశ్నించారు. జనవరి, 2020 నుంచి జనవరి, 2026 వరకు ఏ జిల్లా నుంచి ఎంతమంది, ఏ వయసు వారు హార్ట్‌ఫెయిల్ అవడం వల్ల చనిపోయారో తెలపాలని ఎమ్మెల్యే అడిగారు. "ఈ మరణాలకు కరోనా వైరస్, కొవిడ్ వ్యాక్సినేషన్‌తో ఏమైనా సంబంధం ఉందా.. ఆ దిశగా ఏమైనా సర్వే చేపట్టారా..?" అని అడిగారు. అలాంటి సర్వే నిర్వహించలేదని ప్రభుత్వం సమాధానమిచ్చింది. కాకపోతే జిల్లాల వారీగా సమాచారాన్ని వెల్లడించింది.



# రూ. 18 లక్షలతో భోజనశాల ప్రారంభం

- ఎడపల్లి జిల్లా పరిషత్ పాఠశాల మన్‌కీ బాత్ వరకు చేరాలి
- అభయ వ్యవస్థాపకులు సుంకు బాలచందర్

**ఎడపల్లి, మార్చి 19 ( జనంసాక్షి ) :** గ్రామస్తులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, దాతల సమిష్టి సహకారంతో ఎడపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్ వరకు చేరాలని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుంకు బాలచందర్ స్వామి అన్నారు. గురువారం ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 18 లక్షలతో విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన భోజనశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుంకు బాలచందర్ స్వామి మాట్లాడుతూ, గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల సమిష్టి కృషితో నిర్మించిన భోజన శాలను ఎంతో శుభ్రంగా నిర్వహించుకోవాలని సూచించారు. మంచి కార్యక్రమంలో ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం ఉండడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దత్తాద్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేములపల్లి రవికుమార్ దంపతులు, సర్పంచ్ కందగట్ల రాంచందర్, ఉప సర్పంచ్ మచ్కూర్ గంగాధర్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రజిత, గ్రామస్తులు పోల మల్కారెడ్డి, బంజ శంకర్, ఎల్లయ్య యాదవ్, మార లింగేశ్వర్ గుప్తా, మార రాజేందర్ గుప్తా, మోహన్ రెడ్డి, నరసింహ రెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పోల రాధ, ఎంఈఓ శంకర్, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### తెలంగాణ ప్రజలకు నూతన సంవత్సరాది

# శుభాలను అందించాలి

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 19 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సరాది 'శ్రీ పరాభవ నామ సంవత్సరం' సకల శుభాలను, అష్ట ఐశ్వర్యాలను అందజేయాలని భారత రాష్ట్ర సమితి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆకాంక్షించారు. ఉగాది మహా పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు చిర్రా రవీందర్ యాదవ్ నగరంలోని కెటిఆర్ నివాసానికి తరలివెళ్లి 'శ్రీ పరాభవ నామ' ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కెటిఆర్‌కు రవీందర్ యాదవ్ పూల బొకేను అందించి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ క్రమంలో కెటిఆర్ చిర్రా రవీందర్ యాదవ్ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శేరిలింగంపల్లి లో ఏర్పాటు చేసిన సమావేశంలో రవీందర్ యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి ప్రజలకు ఉగాది మహా పర్వదిన శుభాకాంక్షలు అందజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన దోపిడిగా మారిందని, శేరిలింగంపల్లి పరిధి హెచ్.సి.యు భూములు సహా రాష్ట్రంలోని ప్రభుత్వ భూములను పూర్తిగా అమ్మేసుకుని సొమ్ము చేసుకోవడానికి కుట్రలు పన్నుతోందన్నారు. మరో రెండు యేళ్లలో రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో తప్పకుండా బిఆర్ఎస్ పార్టీ అఖండ మెజార్టీతో విజయం సాధించి అధికార పీఠం కైవసం చేసుకుని ఉందని, శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ప్రతి కార్యకర్త పార్టీ గెలుపు కోసం కంకణ బద్ధులై ముందుకు సాగాలని రవీందర్ యాదవ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ కుట్రలను తిప్పికొడుతూ, ప్రజాక్షేత్రంలో వారి అవినీతిని ఎండబెట్టడం ద్వారా శేరిలింగంపల్లి ప్రజల అభిమానాన్ని చురగొంటూనే ఓటర్లను పార్టీ వైపు మళ్ళించడానికి ప్రతి కార్యకర్త సైనికుడై పోరాడాల్సిన అవసరం ఉందని చెర్ర రవీందర్ యాదవ్ అభిప్రాయపడ్డారు.



# నేడు మాదాపూర్ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్

### ఎస్సై జి. నరేందర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

**గన్నేరువరం, మార్చి 19 (జనంసాక్షి):** గన్నేరువరం మండలంలోని మాదాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ మాధరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాదాపూర్ ప్రీమియర్ లీగ్ సీజన్ 2, శుక్రవారం 20 మార్చి 2026 రోజున ఉదయం 10 గంటలకు గన్నేరువరం ఎస్ఐ జి. నరేందర్ రెడ్డి, సర్పంచ్ మాధరి శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు క్రికెట్ మేనేజ్మెంట్ వారు తెలిపారు. జిల్లా, మండల, క్రీడాకారులు యువకులు, అధిక సంఖ్యలో సర్పంచ్ టోర్నమెంటును విజయవంతం చేయాలని కోరారు. మాదాపూర్ ప్రీమియర్ లీగ్ మేనేజ్మెంట్ కన్నం మనోజ్ కుమార్, మాడుగుల కరుణాకర్ రెడ్డి, కుమ్మరి రమేష్, సావనంపెల్లి కరుణాకర్, దమ్మగల సురేష్ పరివేక్షణలో క్రీడలు జరుగుతుందని తెలిపారు.



### జిల్లా ఎస్పీ, ఏఎస్పీలకు శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్ పర్సన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లా ఎస్ పి రాజేష్ చంద్ర, ఏ ఎస్పి చైతన్య రెడ్డిని కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, వైస్ చైర్మన్ కాసర్ల గోదావరిలు గురువారం ఉగాది పర్వదినం పురస్కరించుకొని వారిని మర్యాద పూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పి, ఏఎస్పిలకు మెమెంటోతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పోలీస్‌ల సేవలు వేల కట్టలేనివన్నారు. ఉగాది పండుగను ప్రశాంతంగా జరిగేలా శాంతి భద్రతలు చేపట్టాలని వారు కోరారు.

# ఉగాది పచ్చడి చేదు లాగే జీవిత మార్పులు ఆరోగ్యకరమైనవి

- శ్రీ సంతోషిమాత దేవాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు
- శ్రీ సంతోషిమాత దేవాలయ కమిటీ చైర్మన్ కొక్కిరాల సాగర్ రావు



**కరీంనగర్ బ్యూరో, మార్చి 19 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరపాలక సంస్థ 49వ డివిజన్ పరిధిలోని సంతోష్ నగర్‌లో గల శ్రీ సంతోషిమాత దేవాలయంలో ఉగాది పర్వదిన మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీ సంతోషిమాత దేవాలయ కమిటీ చైర్మన్ కొక్కిరాల సాగర్ రావు ఆధ్వర్యంలో శ్రీ పట్టాభి రామచంద్రస్వామి, ఆంజనేయస్వామి దేవతలకు ప్రత్యేక పూజలు చేపట్టి, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు పంచాంగ శ్రవణం వినిపించి, ఉగాది, పరాభ నామ సంవత్సర విశిష్టత గురించి ఆధ్యాత్మిక సందేశాన్ని తెలియజేశారు. 'పరాభవ' నామ సంవత్సరం – వైఫల్యం నుంచి వైభవం వైపు ప్రయాణం చేసేలా కొనసాగు తుందన్నారు."తెలుగు వారి పండుగలలో ఉగాదికి ఒక ప్రత్యేక స్థానం ఉందనీ, ఇది కేవలం క్యాలెండర్ మారే రోజు మాత్రమే కాదు, మన ఆలోచనలను, ఆశయాలను కొత్తగా నిర్దేశించుకునే సమయం అన్నారు. అయితే, 2026 మార్చి 19న ప్రారంభం కాబోయే కొత్త ఏడాదికి 'పరాభవ' అనే పేరు ఉండటం చాలా మందిలో ఆసక్తిని, మరికొందరిలో ఆందోళనను కలిగిస్తోందన్నారు. సాధారణంగా 'పరాభవం' అంటే అవమానం లేదా ఓటమి అని మనం భావిస్తాం, కానీ, ఈ పేరు వెనుక ఉన్న లోతైన ఆధ్యాత్మిక అర్థం తెలిస్తే, మనం ఈ ఏడాదిని ఎంత ఉత్సాహంగా ఆహ్వానించా లో అర్థమవుతుందన్నారు. 'పరాభవ' అనే పదాన్ని విడదీసి చూస్తే, 'పరా' అంటే అత్యున్నతమైన, గొప్పదైన లేదా అతీతమైన అని అర్థం అన్నారు. 'భవ' అంటే పుట్టుక, లేదా స్థితి అని అర్థం అన్నారు. అంటే, మనలోని అజ్ఞానాన్ని, అహంకారాన్ని, బలహీనతలను ఓడించి ('పరాభవం'), ఒక ఉన్నతమైన స్థితిలో కొత్తగా జన్మించడమే ఈ ఏడాది అసలు సందేశం అని తెలియజేశారు. 'నేను' అనే అహంకారాన్ని తగ్గించుకుని, వినయం తో కూడిన జ్ఞానాన్ని సంపాదించాలన్నారు. మార్పు ఎప్పుడూ చేదుగానే ఉంటుందని, ఉగాది పచ్చడిలో వేపపువ్వు చేదును మనం ఎందుకు ఇష్టంగా స్వీకరిస్తాం? ఎందుకంటే, ఆ చేదు మన శరీరానికి ఆరోగ్యాన్ని ఇస్తుంది. అలాగే, జీవితంలో వచ్చే కొన్ని కఠినమైన మార్పులు ప్రారంభంలో ఇబ్బందిగా అనిపించినా, అవి మనల్ని మరింత దృఢంగా మారుస్తాయి. 'విశ్వావసు' సంవత్సరంలో మనం నేర్చుకున్న పాఠాలను పునాదిగా చేసుకుని, ఈ 'పరాభవ' సంవత్సరంలో మనల్ని మనం ఒక కొత్త వ్యక్తిగా మలుచుకోవాల న్నారు. 2026 ఉగాది మనకు ఒక కొత్త ఆరంభం, 2026 ఉగాది మనకు ఇచ్చే గొప్ప అవకాశం ఏమిటంటే మనల్ని మనం పునర్ నిర్మించుకోవడం, ఓటమిని చూసి కుంగిపోకుండా, దాన్ని గెలుపుకు మెట్టుగా మార్చుకోవడమే ఈ పరాభవ నామ సంవత్సర విశిష్టత అని పండితులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషిమాత దేవాలయ కమిటీ డైరెక్టర్లు, ప్రత్యేక ఆహ్వానితులు, సభ్యులు, స్థానిక కార్పొరేటర్ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.


జ్యోతినగర్ హనుమాన్ టెంపుల్


శ్రీ మహాశక్తి దేవాలయం


అభయాంజనేయ స్వామి టెంపుల్ కట్టరాపూర్


యజ్ఞ వరాహస్వామి టెంపుల్ హౌసింగ్ బోర్డ్ కాలనీ

### గ్రామ గ్రామాన ముదిరాజ్ జెండా

# ఉగాది వేళ ఐక్యత గర్జన



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 19 (జనం సాక్షి) :** దేవునిపల్లిలో ఘనంగా ఆవిష్కరణ సంప్రదాయాల నడుమ ఉగాది సంబరాల సందడి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ముదిరాజ్ జాతి ఐక్యతకు ప్రతీకగా ప్రతీ సంవత్సరంలాగే ఈ సంవత్స రం కూడా గ్రామ గ్రామాన జెండా ఎగురవేయాలన్న తెలంగాణ ముదిరాజ్ మహాసభ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు డా. బట్టు విఠల్ ముదిరాజ్ పిలుపు ఎల్లారెడ్డిలో కార్యరూపం దాల్చింది. పట్టణంలోని నాలుగో వార్డు పరిధిలోని కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు కలిసి ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుంకుమ, పసుపుతో ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి జెండా ఆవిష్కరణను శుభప్రదంగా ప్రారంభించారు. ఉగాది పచ్చడిలోని రుచుల మాదిరిగానే జీవితం సుఖదుఃఖాల సమ్మేళనమని, వాటిని సమానంగా స్వీకరించే సంస్కృతి మనదని నాయకులు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా సామాజిక బంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సంఘ నాయకులు ముదిరాజ్ జాతి చారిత్రక సంప్రదాయాలను కాపాడుతూ కొత్త తరానికి అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ మూలవాసి జాతిగా ముదిరాజ్ సమాజం తన ప్రత్యేకతను నిలబెట్టుకొని, గ్రామ గ్రామాన ముదిరాజ్ జెండా ఎగురవేసి జాతి గౌరవాన్ని పెంపొందించడమే కాకుండా గ్రామ గ్రామాన నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజ్ జాతి ఐక్యతకు నాంది పలికిందని డా. బట్టు విఠల్ ముదిరాజ్ అన్నారు.

# టీఎన్జీవో భవన్లో పంచాంగ శ్రవణం



**నాగర్ కర్నూల్, మార్చి 19 (జనంసాక్షి):** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా గురువారం నాడు టీఎన్జీవో భవనం నాగర్ కర్నూల్‌లో పండితులు శ్రీనివాస శర్మ పంచాంగ శ్రవణము చేసినారు. జన్మ రిత్యా గోచార రీత్యా పేర్లతో మరియు నక్షత్రాల ఫలితాలను తెలిపారు. ఆదాయ వ్యాయ వివరాలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో టీఎన్జీవో అసోసియేట్ ప్రెసిడెంట్ బాలాజీ టీఎన్జీవో సభ్యులు సురేష్ కుమార్, చెన్నకేశవులు, శ్రావణ్, యాదగిరి, ఆనంద్, అమర్, కళ్యాణ్, కృష్ణ పాల్గొన్నారు.

# రంజాన్ సందర్భంగా సేవా స్ఫూర్తి

### మహమ్మద్ ఖాన్ జ్ఞాపకార్థం 100 కుటుంబాలకు నిత్యవసరాల పంపిణీ



**మంథని, (జనం సాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కీర్తిశేషులు మహమ్మద్ ఖాన్ (విద్యుత్ శాఖ రిటైర్డ్ సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్) జ్ఞాపకార్థం పవిత్ర రంజాన్ మాసంలో మానవత్వాన్ని చాటే సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆయన కుమారుడు, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకుడు మెహరాజ్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో కలిసి కమాన్‌పూర్, గుండారం, రొంపికుంట గ్రామాలకు చెందిన 100 నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సహాయం అందుకున్న కుటుంబాలు ఆయనను స్మరించుకుంటూ కృతజ్ఞతాభావంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించాయి. షౌకత్ ఖాన్ ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు సాగాయి. ఈ కార్యక్రమంలో మహమ్మద్ యూసుఫ్ లల్లు, సయ్యద్ నజీబ్, అఫ్రోజ్, అహ్మద్ హుస్సేన్, అబ్రోజ్, షోహెబ్, వాజీద్, అస్మాత్, ముజాహిద్, సద్దాం, గౌస్, అజ్జు తదితర మైనారిటీ సోదరులు పాల్గొన్నారు. సేవా భావంతో చేపట్టిన ఈ కార్యక్రమం రంజాన్ ఆత్మను ప్రతిబింబిస్తూ సమాజంలో ఐక్యతను మరింత బలపరిచింది.

### పాఠశాలల పరిసరాల్లో సిగరెట్ ఉత్పత్తులు అమ్మితే కఠిన చర్యలు

### సిఐ రంజిత్ రావు



**శాయంపేట, మార్చి 19 ( జనం సాక్షి) :** శాయంపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో సిగరెట్ ఉత్పత్తుల విక్రయంపై శాయంపేట పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తిపాక గ్రామంలో ఇద్దరు కిరాణా షాపు వ్యక్తులు ప్రభుత్వ పాఠశాల నుండి 100 మీటర్ల పరిధిలోపల సిగరెట్లు అమ్ముతున్నారని నమ్మదగిన సమాచారం అందడంతో వెంటనే పత్తిపాక గ్రామంలోని సుధా కర్ కిరాణం, అన్నపూర్ణ కిరాణంలో వెళ్లి తనిఖీ చేయగా అందులో సిగరెట్ బాక్సులు లభించగా వెంటనే సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని సిఐ రంజిత్ రావు తెలిపారు. అదేవిధంగా, ప్రభుత్వ పాఠశాలల పరిసరాల్లో 100 మీటర్ల లోపల సిగరెట్ ఉత్పత్తుల విక్రయం నిషేధించబడినది, పబ్లిక్ ప్రదేశాల్లో ధూమపానం చేయడం, మైనర్లకు సిగరెట్లు అమ్మడం చట్టవిరుద్ధం అన్నారు. ఈ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శాయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ రంజిత్ రావు తెలిపారు.

## క్రమశిక్షణకు ప్రతీక రంజాన్ : జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** క్రమశిక్షణకు ప్రతీక రంజాన్ మాసమని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ముస్లిం సోదరులకు, పోలీస్ సిబ్బందికి ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్‌పర్సన్ అంబాల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ రంజాన్ మాసం క్రమశిక్షణ, త్యాగం, దాతృత్వానికి ప్రతీక అని తెలిపారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో ఐక్యమత్యంగా ఉండాలని, శాంతి, సామరస్యాలతో సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థలో మతసామరస్యాన్ని పెంపొందించే లక్ష్యంతో పండుగలను సమిష్టిగా నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ప్రజల సేవలో పోలీసులు కలిసికట్టుగా పనిచేస్తూ శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ముందుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రార్థనల అనంతరం ఉపవాస దీక్షలను విరమించి, పోలీస్ సిబ్బందితో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రంజాన్ మాసం శాంతి, సహనం, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని, సమాజంలో ఐక్యతను మరింత బలపరచే పండుగగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు సంపత్ రావు, సూర్యనారాయణ, సీఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మద్యం వద్దు.. మైదానం ముద్దు

- గంజాయి వద్దు గ్రౌండ్ మనకు హద్దు
- క్రీడలు స్నేహ భావాన్ని,మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి
- గ్రామ సర్పంచ్ ఓగులాపురం లక్ష్మివెంకట్



**ధారూర్ మార్చి 19(జనంసాక్షి) :** యువకులకు "క్రీడలు స్నేహానికి,మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి" శారీరక దృఢత్వమే కాకుండా మనిషి ఎదుగుదలకు క్రీడలు ఎంతో అవసర పడతాయని క్రీడల వల్ల స్నేహం సామాజిక సంబంధాలు బలపడతాయని గ్రామ సర్పంచ్ ఓగులాపురం లక్ష్మీ వెంకట్ అన్నారు.మండల పరిధిలోని గట్టేపల్లి గ్రామంలో గ్రామ పెద్దలు యువకులు ఉగాది సందర్భంగా గ్రామంలో వాలీబాల్.కబడ్డీ.క్రీడలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ ఓబులాపురం లక్ష్మి వెంకట్.రిబ్బన్ కట్ చేసి పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి వెంకట్ మాట్లాడుతూ.... యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని "మద్యం వద్దు" మైదానమే ముద్దు అనే విధంగా ముందుకు సాగాలని యువతకు చదువు క్రీడలు ఎంతో ముఖ్యమని మాదకద్రవ్యాలు వద్దు గ్రౌండే మనకు హద్దు అనే నినాదాన్ని యువత అందరూ పాటించాలని అన్నారు. ఆటలు కలిసి ఆడుతున్నప్పుడు ఒకరిపై ఒకరికి నమ్మకం ఏర్పడుతుందని ఇది కొత్త స్నేహాలకు పునాది ఐక్యత కుల.మత.ప్రాంతీయ భేదాలు లేకుండా అందరూ ఒకే లక్ష్యం కోసం పని చేయడం నేర్పిస్తుందని మైదానంలో ఆటగాళ్ల మధ్య జరిగే సంభాషణలు వారిలో సామాజిక నైపుణ్యాలను పెంచుతాయని మానసిక ఉల్లాసం మరియు ఆరోగ్యం వ్యాయామం వల్ల మానసిక ప్రశాంతతను ఇచ్చి ఒత్తిడిని తగ్గిస్తాయని ఆత్మవిశ్వాసం ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించడం వల్ల మానసిక స్థైర్యం పెరిగి ఆటపై దృష్టి పెట్టడం వల్ల మెదడు చురుగ్గా మారి, ఏకాగ్రత మెరుగుపడుతుందని అన్నారు.సమయపాలన, నియమ నిబంధనలను పాటించడం వంటి లక్షణాలు క్రీడల ద్వారా అలవడతాయి.ఇవి నిజ జీవితంలో కూడా వ్యక్తిని ఉన్నత శిఖరాలకు చేరుస్తాయి."ఆరోగ్యమే మహాభాగ్యం"అని అన్నారు. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సరిత నరేష్.గ్రామ పెద్దలు భీమ్సేన్ చారి. నరేందర్ రావు.వెంకటయ్య. ఏర్పుల శ్రీనివాస్.ప్రభాకర్ రెడ్డి.నార్సింగ్ రావు.రమేష్ కృష్ణ.ఏర్పుల బాలయ్య.గ్రామ యువకులు పాల్గొన్నారు.

# 100 రోజుల్లో దేవనూర్ అభివృద్ధి పరుగులు

- సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు కృషి
- విద్యుత్, నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి
- మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం.. వృద్ధులకు దుప్పట్ల పంపిణీ
- మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు..







**తాండూరు, మార్చి 18 (జనంసాక్షి):** పంచాయతీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు 100 రోజుల పాలనను ఘనంగా పూర్తి చేసుకున్నారు. గ్రామ అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తూ.. నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరిత పరిష్కారాలు చేపట్టారు. గెలుపు సాధించిన నాటి నుండి ఇప్పటి వరకు గ్రామ ప్రజల సమస్యలపైనే పూర్తి దృష్టి పెట్టి కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించారు. వీధి దీపాల మరమ్మతులు చేయించి.. చీకట్లో మునిగిపోయిన గ్రామానికి కాంతి నింపారు. మానవతా దృక్పథంతో మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. సేవా సంస్థల ఆధ్వర్యంలో చలికాలంలో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని విజ యవంతం చేశారు. ఈ సందర్భంగా (జనంసాక్షి ప్రతినిధితో) మాట్లాడిన సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు.. గ్రామ ప్రజల ఆశీస్సులతో మరింత అభివృద్ధికి బాటలు వేస్తామని తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి.. వారి సమస్యలను గుర్తించి త్వరితంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపడతామని, రానున్న వేసవి కాలంలో ప్రజలకు నీటి కష్టాలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి వార్డులో పర్యటించి.. నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. వార్డుల వారీగా నీటి సమస్యలను గుర్తించి.. అక్కడక్కడ నీటి ట్యాంకులు ఏర్పాటు చేసి.. కులాయిల ద్వారా మంచినీటిని అందుబాటులో ఉంచే ఏర్పాట్లు చేస్తామని వివరించారు.

ప్రజలకు ఏ సమస్య ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో కూడా గ్రామ ప్రజల ఆదరాభిమానాలు ఇలాగే ఉండాలని విజ్ఞప్తి చేశారు. దేవనూర్ గ్రామ ప్రజలు సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు 100 రోజుల పాలనను ప్రశంసిస్తూ.. గ్రామ అభివృద్ధిలో ఆమె చేపట్టిన చర్యలను హర్షిస్తున్నారు.

# ప్రారంభమైన శ్రీరామనవమి ఉత్సవాలు



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : హరిహర క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో జరిగే శ్రీ రామ నవరాత్రి మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 19 నుండి 27 వరకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించే శ్రీరామ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉగాది సందర్బంగా పంచాంగ పూజ, పంచాంగ శ్రవణ కార్యక్రమం, శ్రీరామ నవరాత్రులు సందర్బంగా తొమ్మిది రోజులపాటు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి పంచోపనిషత్ ద్వారా అభిషేకములు ఆలయ అర్చకులు నిర్వహించనున్నారు, అలాగే 25 నుండి 27 వరకు భక్తోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 27న శ్రీరామనవమి సందర్బంగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారిలో దివ్య కళ్యాణ మహోత్సవం ఆలయ శివార్చన వేదికపై ఉదయం 11:30 గంటల నుండి 1 వరకు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు, అదే రోజు సాయంత్రం స్వామివారి రథోత్సవం పట్టణ పురవీధుల గుండ నిర్వహించి, రాత్రి డోలోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ఉత్సవాలను ఏకాంతంగానే నిర్వహిస్తామని తెలిపారు.

# కాంగ్రెస్ సర్కార్, స్పీకర్‌పై నిప్పులు చెరిగిన బండి సంజయ్

- 'తొక్కుకుంటూ సీఎం అయ్యాను' అనడం ఏమిటి?
- వందేమాతరం బహిష్కరణపై స్పీకర్ నిశ్శబ్దం.. దుర్మార్గం
- పరాభవ సంవత్సరం విజయ పునాదిగా మారాలని ఉగాది శుభాకాంక్షలు



కరీంనగర్ బ్యూరో, మార్చి 19 (జనంసాక్షి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తనదైన శైలిలో కాంగ్రెస్ ప్రభుత్వం, స్పీకర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి 'ఒక్కొక్కరినీ తొక్కుకుంటూ సీఎం సీట్లోకి వచ్చాను' అని చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. పార్టీలో ఎంతో మంది సీనియర్ నాయకులుంటే.. వారందరినీ తొక్కుకుంటూ సీఎం పదవి తెచ్చుకున్నారని, ఇప్పుడు కొంతమంది సీనియర్లు అసమ్మతి మీటింగ్‌లు పెడుతుంటే వారికే ఆ వ్యాఖ్య హెచ్చరికగా ఉందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచి సీఎం అయ్యానని చెబితే అందరూ సంతోషిస్తారని, కానీ 'తొక్కుకుంటూ' పదవుల్లోకి వచ్చాననడం ఏమిటో రేవంత్ రెడ్డే వివరించాలని ఆయన సవాలు విసిరారు. బీఆర్ఎస్ నేతల భాష కూడా అదేలా ఉందని, రెండు పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని ఆరోపించారు. దీంతోనే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై బీఆర్ఎస్ నేతలు నిలదీయడం లేదని, బీఆర్ఎస్ నేతల అవినీతిపై కాంగ్రెస్ చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ మండిపడ్డారు.

గురువారం కరీంనగర్‌కు వచ్చిన బండి సంజయ్ పరాభవ నామ సంవత్సరం సందర్భంగా మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైతన్యపురిలోని తన నివాసంలో మీడియా ప్రతినిధులు, స్థానిక నేతలు, కార్యకర్తలతో కలిసి ఉగాది వేడుకలు జరిపారు. ఉగాది పచ్చడి, భక్షాలు, పులిహోర తిని ఆనందించారు.

మీడియాతో మాట్లాడుతూ హిందూ బంధువులందరికీ, దేశ విదేశాల్లోని తెలుగు ప్రజలందరికీ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. 'పరాభవ' అంటే మనలోని అహంకారం, చెడు ఆలోచనలను ఓడించి విజయానికి పునాది వేసేదని, అందరికీ విజయవంతమైన సంవత్సరంగా మిగిలిపోవాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నానని ఆయన తెలిపారు. అసెంబ్లీలో వందేమాతరం గేయ ఆలాపన సందర్భంగా గవర్నర్, మండలి చైర్మన్, స్పీకర్, సీఎం, మంత్రుల సమక్షంలోనే మజ్లిస్ ఎమ్మెల్యేలు బహిష్కరణ చేయడం దుర్మార్గమని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత జాతీయ గేయాన్ని, భారతమాతను అవమానించినట్లైందని మండిపడ్డారు. రాష్ట్రపతి, గవర్నర్ అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం తప్పనిసరి చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందని, వాటిని మజ్లిస్ ధిక్కరించడం సరైంది కాదన్నారు. సభలో గవర్నర్, సీఎం, స్పీకర్, మండలి చైర్మన్ సహా సభ్యులంతా ఉండగా సభ్యులు తప్పు చేస్తే శిక్షించే అధికారం స్పీకర్‌కే ఉందని, శాసనసభ కస్టోడియన్‌గా స్పీకర్ ఎందుకు ఇంతవరకు నోటీసులు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో స్పీకర్ ఇచ్చిన తీర్పుపై ప్రజల్లో చులకన భావన ఏర్పడిందని, ఇప్పుడు వందేమాతరం బహిష్కరణపై చర్యలు తీసుకోకపోతే శాసన వ్యవస్థపట్ల, స్పీకర్‌పట్ల మరింత చులకన భావం పెరుగుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలో ఉంటే ఎంఐఎం మెడలు పట్టి తప్పనిసరిగా వందేమాతరం ఆలపించేలా చర్యలు తీసుకునేవారమని బండి సంజయ్ స్పష్టం చేశారు.



# రంజాన్ తోఫాను అందజేసిన ఎమ్మెల్యే

వనపర్తి బ్యూరో మార్చి 19 జనవరి సాక్షి : వనపర్తి పట్టణం ఎనిమిదో వార్డుకు చెందిన షబ్బీర్ మరియు హలీం కుటుంబ సభ్యులకు గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి రంజాన్ పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అందజేసిన తోఫాను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల అభివృద్ధికి పెద్దపీట వేసిందని మతసామరస్యానికి ప్రత్యేకగా నిలిచే రంజాన్ పండుగను వనపర్తి నియోజకవర్గం పరిధిలోని ముస్లిం సోదరులందరూ ఆనందంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

# జిఎం సమావేశ మందిరంలో ఉగాది వేడుకలు

## ఆర్జీ.వన్ జిఎం లలిత్ కుమార్..



గోదావరిఖని, జనంసాక్షి :తెలుగు సంవత్సర శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాధి శుభాకాంక్షలు తెలిపి అందరికి ఉగాది పచ్చిడి పంపిణీ చేసిన ఆర్జీ-1 జియం లలిత్ కుమార్. రామగుండం ఏరియా -1 జియం కార్యాలయ సమావేశహాలులో సింగరేణి ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు, అధికారులకు, సూపర్వైజర్లకు, యూనియన్ ప్రతినిదులకు, పుర ప్రజలకు ఆర్జీ-1 జియం లలిత్ కుమార్ శ్రీ పరాభవ నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జియం కార్యాలయ ఉద్యోగులకు ఉగాది పచ్చడిని పంపిణి చేసారు. ఈ సందర్భంగా ఆర్జీ-1 జియం లలిత్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యేకించి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఉగాది శుభాకాంక్షల సందేశాన్ని అధికారులకు, ఉద్యోగులకు ప్రత్యేకంగా తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సరం ప్రతీ ఒక్కరు సుఖ సంతోషాలతో భాసిల్లాలని, ఆయురారోగ్యలతో వర్ధిల్లాలని తెలిపారు. వసంత రుతువులో వచ్చే ఉగాది పండగ మార్పునకు సంకేతమని మనం కూడా మార్పుకు అనుగుణంగా మన నడవడిని మార్చుకొని కొత్త ఒరవడికి స్వాగతించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం రీజియన్ క్వాలిటీ జనరల్ మేనేజర్ సుజోయ్ మజుందార్, ఎజియం క్వాలిటి నాగేశ్వర్ రావు, ఏజంట్ చిలుక శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ యం.రవీందర్ రెడ్డి, (సియంవోఐఏ) ప్రతినిధి క్రాంతి కుమార్, జి ఎం ఆఫీస్ ప్రతినిది, ఏఐటీయూసీ ఇజ్జగిరి రాజు, డిజియం (ఫైనాన్స్) ధనలక్ష్మి బాయి, వివిధ శాఖాధిపతులు, అధికారులు, జిఎం ఆఫీస్ ఉద్యోగులు పాల్గోన్నారు.

# కార్పొరేషన్ కార్యాలయంలో ఉగాది వేడుకలు



గోదావరిఖని, జనంసాక్షి : పరాభవ నామ సంవత్సరశీ రామగుండం నగరానికి ప్రగతిదాయకమని మేయర్ మహంకాళి స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పరాభవమంటే పంచాంగ శ్రవణం లో చెప్పినట్టుగా ధర్మబద్ధంగా కష్టపడేవారికి విజయాన్ని, అవినీతి పరులకు అపజయాన్ని అందించే సంవత్సరమని అన్నారు. రామగుండంలో అవినీతి రహిత పాలన అందించి ధర్మబద్దంగా పని చేసి అభివృద్ధి సాధిద్దామని అన్నారు. రెండేళ్ల కాలంలోనే రామగుండశీ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుండి సుమారు 800 కోట్ల రూపాయలు ఎంఎల్ఎ ఎంఎస్ రాజ్ ఠాకూర్ మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడుతున్నారని మన పాలకవర్గం అంకిత భావంతో పని చేసి అభివృద్ధి పనులు మరింత చురుగ్గా కొనసాగేటట్లు చేద్దామని అన్నారు. కాగా ఈ సంధర్భంగా పండితులు ఒజ్జల వేంకటేశ్వర శర్మ పంచాంగ శ్రవణం చేశారు. రామగుండం నగరానికి మంచి రోజులు నడుస్తున్నాయని మరో ఎనిమిది నెలల తరువాత ఉన్నత స్థానానికి చేరుకుంటుందని పంచాంగ శ్రవణంలో ఆయన పేర్కొన్నారు. శ్రీరామ పాద క్షేత్రం కొలువై ఉన్న రామగుండం నగర గోదావరి తీరాన పుష్కర స్నానాలు ఆచరించడం శ్రేష్టమని అన్నారు. రాశి ఫలాల వారిగా పరాభవ నామ నామసంవత్సర ఫలితాలు వివరిశీచారు. ఉగాది పచ్చడితో పాటు భక్ష్యాలు వడ్డించారు ఈ కార్యక్రమంలో రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్య, పలువురు కార్పొరేటర్లు వారి కుటుంబ సభ్యులు, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, నగర పాలక సంస్థ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఆర్‌పిలు పాల్గొన్నారు.

## మతతత్వ రాజకీయాలకు

# బీజేపీ కేరాఫ్ అడ్రస్ అయింది

- క్యాంపు కార్యాలయంలో ఉగాది వేడుకలు
- బిజెపిపై మంత్రి పొన్నం ఫైర్



కరీంనగర్ బ్యూరో, మార్చి 19 (జనంసాక్షి) : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. 'శ్రీ పరాభవ నామ' సంవత్సర ఆరంభం సందర్భంగా మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం ఉగాది పచ్చడి సేవించి రాష్ట్ర ప్రజలకు, కాంగ్రెస్ శ్రేణులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ కొత్త సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రజలకు చేరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పేదల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

### బిజెపిపై నిప్పులు చెరిగిన మంత్రి

బండి సంజయ్ వ్యాఖ్యల పై స్పందిస్తూ మంత్రి పొన్నం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గాంధీ వారసులను గాడ్సే వారసులని విమర్శించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని, ఆంగ్లేయులను తరిమికొట్టిన జాతిపితను చంపిన గాడ్సే వారసులు ఎవరో ప్రపంచానికి తెలుసు అని ఎద్దేవా చేశారు. విభజించి పాలించే మతతత్వ రాజకీయాలకు బిజెపి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేర్యాల గణయాదికి గద్దర్ అవార్డు

## అభినందించిన చేర్యాల మండల ప్రజలు



చేర్యాల మార్చి 19 (జనంసాక్షి) : చేర్యాల మండలం ఆకునూరు గ్రామ శివారు మాసిరెడ్డిపల్లికి చెందిన ఘనపురం యాదయ్య (ఘనయాది) కి అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల చేర్యాల మండలం కడవెరుగు గ్రామంలో తీసిన "వనజీవి రామయ్య" సినిమా రాష్ట్రస్థాయి అవార్డు పొందింది. ఆ సినిమా పాట రచయిత గణపురం యాదయ్య గద్దర్ అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం ఉగాది పర్వదినం సందర్భంగా మాదాపూర్ హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ లో ఏర్పాటుచేసిన అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో గద్దర్ అవార్డు ప్రశంసా పత్రంతోపాటు నగదు ప్రోత్సాహకాన్ని అందుకున్నారు. ఆయనకు గద్దర్ అవార్డు రావడం పట్ల సినిమాలో నటించిన స్థానికులు, మండల ప్రజలు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# కేంద్రీయ విద్యాలయం నల్లగొండలో అడ్మిషన్లుకు నోటిఫికేషన్ జారీ




నల్లగొండ ప్రతినిధి,జనం సాక్షి: కేంద్రీయ విద్యాలయ నల్గొండలో బాలవాటిక 3, 1వ తరగతి వరకు అడ్మిషన్స్ ఈనెల 20వ తేదీ నుండి ఆన్లైన్‌లో ప్రారంభం అవుతుందని ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రింద పేర్కొన్న ఎవఎంట్‌వలో అడ్మిషన్ ఫారం Onlineలో చేయవలసి ఉంటుంది. https://admission.kvs.gov.in/ చివరి తేదీ 02.04.26 గా చెప్పారు. మిగతా తరగతులకు అనగా 2వ తరగతి నుండి 9వ తరగతి వరకు అడ్మిషన్స్ మార్చి 31వ తర్వాత ఖాళీల ప్రకారం ఆఫ్ లైన్ లో కేవీ స్కూల్ షెడ్యూల్ ప్రకారం 02.04.26 నుండి 08.04.26 వరకు జరుగును. ఈ మొత్తం ప్రక్రియ కేవీ రూపొందించిన అడ్మిషన్స్ గైడెన్స్ ప్రకారం జరుగును. అడ్మిషన్స్ పూర్తి సమాచారం కొరకు https://kvsangathan.nic.in/en/admission/ ఈ వెబ్సైట్ ను చూడగలరు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంకు అడ్మిషన్స్ సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల తర్వాత మాత్రమే అప్లికేషన్స్ ఇవ్వబడునని తెలిపారు.

# మహిళా సంక్షేమమే ప్రధాన ధ్యేయం.. స్వశక్తి సంఘ భవనాలకు శంకుస్థాపన

- మహిళలకు పెద్దపీట వేస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



చొప్పదండి, మార్చి 19 (జనం సాక్షి ): మహిళా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఆదిశగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రభుత్వ అమలు చేస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో స్వశక్తి మహిళా సంఘాల నూతన భవనాల నిర్మాణానికి స్థానిక నాయకులు మహిళలతో కలిసి చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి సత్యం భూమి పూజ చేశారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామని వారిని గౌరవించుకుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్న ఆశా భావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, రుక్మాపూర్ సర్పంచ్ కర్రె ప్రేమలత శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ ,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నీజానాపురం చందు,జిల్లా కిసాన్ జిల్లా అధ్యక్షులు రాజేశం, మున్సిపల్ కౌన్సిలర్లు, స్వశక్తి సంఘం మహిళలు, వివిధ గ్రామాల సర్పంచులు,మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# మహిళా సమైక్య సంఘాలకు బలమైన భవనాలు

- శంకుస్థాపన చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్
- 30 లక్షలతో మూడు నూతన భవనాల నిర్మాణం

కథలాపూర్, మార్చి 19 (జనంసాక్షి): మహిళల స్వయం సాధికారత, గ్రామీణ అభివృద్ధికి మహిళా సమైక్య సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కథలాపూర్ మండలంలోని పోసానిపేట, చింతకుంట గ్రామాల్లో 30 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న మూడు మహిళా సమైక్య సంఘం నూతన భవనాల నిర్మాణానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. అదే సమయంలో రాజారామ్ తాండ గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆది శ్రీనివాస్.. గ్రామీణ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, మహిళా సమైక్య సంఘాల బలోపేతం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళల స్వయం సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ ఇటువంటి మౌలిక సదుపాయాలను అందించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

మహిళా సమైక్య సంఘాల భవనాల నిర్మాణం ద్వారా స్థానిక మహిళలకు సమావేశాలు, శిక్షణలు, ఆర్థిక కార్యకలాపాలకు అనువైన వాతావరణం కల్పించబడుతుందని, ఇది వారి సామర్థ్యాన్ని మరింత పెంచుతుందని ఆయన వివరించారు. గ్రామ పంచాయతీ భవనం ప్రారంభంతో రాజారామ్ తాండలో పరిపాలనా సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సమైక్య సంఘం సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉత్సాహంగా... ఉల్లాసంగా...





- అంగరంగ వైభవంగా శ్రేయస్ వన్ సిటీ బ్రోచర్ ఆవిష్కరణ
- ఉర్రూతలూగించిన సునీత సినీ గేయాలు
- సందడి చేసిన సినీ హీరోయిన్లు మీనాక్షి చౌదరి, అనుపమ పరమేశ్వర్

ఖమ్మం, (జనంసాక్షి) : వందనం గ్రామం రోడ్డులో గురువారం సాయంత్రం అద్భుతమైన వాతావరణంలో శ్రేయస్ ఫ్యూచర్ సిటీ డెవలపర్స్ ఆధ్వర్యంలో "శ్రేయస్ వన్ సిటీ" బ్రోచర్ ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగర అభివృద్ధికి నూతన దిశను సూచించే ఈ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం ఉత్సాహభరితంగా, సందడిగా సాగింది. ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా సినీ ప్రముఖులు హాజరై కార్యక్రమానికి మరింత మెరుగులు చేకూర్చారు. యువత హృదయాలను గెలుచుకున్న హీరోయిన్లు మీనాక్షి చౌదరి, అనుపమ పరమేశ్వరన్ పాల్గొని అభిమానులను అలరించారు. వారి సందడి, అభిమానులతో సెల్ఫీలు, నవ్వు లు కార్యక్రమాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చాయి. అదే విధంగా, సినీ గాయని సునీత తన మధుర గాత్రం తో, సినీ గేయాలతో సభను ఉర్రూతలూగించారు. ఆమె పాటలకు ప్రేక్షకులు కేరింతలు కొడుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. శ్రేయస్ వన్ సిటీ ప్రాజెక్ట్ ఆధునిక సదుపాయాలతో, నూతన జీవన విధానానికి తగిన విధంగా రూపుదిద్దుకుం టుందని నిర్వాహకులు శ్రేయాస్ శ్రీనివాస్ తెలిపారు. భవిష్యత్ నగర రూపకల్పనలో ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి, ఈ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం ఖమ్మం నగరంలో ఒక ప్రత్యేకమైన సంబరంగా నిలిచింది. ఉత్సాహం, వినోదం, అభివృద్ధి అన్నీ కలిసిన ఈ వేడుక హాజరైన వారందరికీ చిరస్మరణీయ అనుభూతిని అందించింది.

# మతసామరస్యం ఐక్యత సోదర భావానికి ప్రతీక ఇఫ్తార్

## మధు యాస్కీ గౌడ్



హయత్ నగర్, మార్చి 19 (జనం సాక్షి) : పవిత్రమైన రంజాన్ మాసం సందర్భంగా హయత్ నగర్ డివిజన్ అనుమగల్, హయత్ నగర్ లోని వక్ఫ్ బోర్డు స్థలంలో డివిజన్ ముస్లిం మైనారిటీ యువ నాయకుడు మహమ్మద్ సల్మాన్ (షమ్మూ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "ఇఫ్తార్" విందు కార్యక్రమంలో టీపీసీసీ క్యాంపెయిన్ చైర్మన్, ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ మధు యాస్కీ గౌడ్, హయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నాగౌని రవీందర్ గౌడ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధు యాస్కీ గౌడ్ మాట్లాడుతూ ఇఫ్తార్ అనేది కేవలం ఉపవాస విరమణ మాత్రమే కాదని, మతసామరస్యం, ఐక్యత, సోదరభావానికి ప్రతీక అని, సమాజంలో అందరూ కలిసిమెలిసి ఉండాలని వారు కోరారు. తమ తాతల కాలం నుంచే పీర్ల పండుగ, రంజాన్, దసరా వంటి పండుగలను సోదరభావంతో జరుపుకుంటూ వచ్చామని తెలిపారు. చిన్నప్పటి నుంచి హయత్ నగర్ ప్రాంతంలో మత భేదాలు లేకుండా ప్రతి పండుగను కలిసి జరుపుకునేవాళ్లమని, ఈరోజు మళ్లీ ఆ చిన్ననాటి రోజులు గుర్తుకు వచ్చాయని, మీ అందరితో కలిసి జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మతాల మధ్య వైషమ్యాలు పెంచి రాజకీయ లబ్ధి పొందుతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ కూడా బీజేపీకి మద్దతుగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత మైనారిటీ సోదరులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని గుర్తు చేశారు. గెలుపోటములతో సంబంధం లేకుండా తాను పుట్టి పెరిగిన హయత్ నగర్ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా మైనారిటీ సోదరులు వక్ఫ్ బోర్డు స్థలాన్ని కబ్జాదారుల నుంచి రక్షించాలని, ఆ స్థలంలో ఫంక్షన్ హాల్ నిర్మించాలని కోరారు. దీనికి స్పందించిన మధు యాస్కీ సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీధర్ బాబు లతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. మైనారిటీ నాయకులు మాట్లాడుతూ మధు యాస్కీ వలన వక్ఫ్ ల్యాండ్ ఇప్పటి వరకు సురక్షితంగా ఉందని, కబ్జాదారులు భయపడుతున్నారని తెలిపారు. అయినప్పటికీ పూర్తిస్థాయి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉపవాస దీక్ష విరమణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సలీం బేగ్, సజీద్ పాషా, ముస్లిం పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మాదాపూర్‌లో హ్యాష్ ఆయిల్ విక్రయదారుడు అరెస్ట్

- నలుగురు పరారీ.. 920 గ్రాముల హ్యాష్ ఆయిల్ సీసాలు స్వాధీనం.. రూ.2.50 లక్షల విలువ
- ఐటీ కారిడార్‌లో అమ్మకాలకు తెచ్చుకున్న నిందితుడు

శేరిలింగంపల్లి, మార్చి 19 (జనంసాక్షి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మాదాపూర్ ప్రాంతంలో హ్యాష్ ఆయిల్ విక్రయిస్తున్న ఓ వ్యక్తిని శేరిలింగంపల్లి ఎస్ఓటీ విభాగం పోలీసులు గురువారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న అతడిని పట్టుకుని విచారించగా.. అతడి వద్ద 920 గ్రాముల హ్యాష్ ఆయిల్ ఉన్న 180 సీసాలు లభ్యమయ్యాయి. ఈ హ్యాష్ ఆయిల్ మార్కెట్ విలువ దాదాపు రూ.2.50 లక్షలుగా అంచనా వేశారు. పోలీసు అధికారుల విచారణలో నిందితుడు.. తక్కువ ధరకు ఇతర ప్రాంతాల నుండి హ్యాష్ ఆయిల్ కొనుగోలు చేసి.. నగరంలోని ఐటీ కారిడార్ ప్రాంతాల్లో భారీగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు వెల్లడించాడు. గురువారం నలుగురు వ్యక్తులకు హ్యాష్ ఆయిల్ అందజేయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు స్పటికంగా పట్టుకోవడంతో అసలు కథ వెలుగులోకి వచ్చింది. అయితే హ్యాష్ ఆయిల్ తీసుకోవడానికి వచ్చిన నలుగురు వ్యక్తులు సంఘటనా స్థలం నుండి తప్పించుకుని పారిపోయారు. వారిని గుర్తించి త్వరలోనే అదుపులోకి తీసుకుని దర్యాప్తును మరింత ముమ్మరం చేస్తామని పోలీసు అధికారులు తెలిపారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప సోసైటీ ప్రాంతంలో జరిగిన ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోంది. ఐటీ ఉద్యోగులు, యువత మధ్య హ్యాష్ ఆయిల్ అమ్మకాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ఈ రకమైన అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
20 మార్చి 2026

# సీనియర్లకు, సీఎంకు అంతర్గత వైరం

## సీనియర్లను ఉద్దేశించే సీఎం తన పదవి గురించి పదేపదే వ్యాఖ్యలు

- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



**కరీంనగర్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీలో ఎంతో మంది సీనియర్లు ఉన్న వాళ్లందరినీ తొక్కుకుంటూ వెళ్లి సీఎం పదవి రేవంత్‌రెడ్డి తెచ్చుకున్నాడని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. కొంతమంది సీనియర్లు అసమ్మతి అంతర్గత సమావేశం జరిపితే వాళ్లను ఉద్దేశించే ముఖ్యమంత్రి హెచ్చరికలు ఇస్తున్నట్లు ఉందన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే గెలిచి సీఎం పదవిలోకి వచ్చానని చెబితే అందరూ హర్షిస్తారే తప్ప ఈ తొక్కుకుంటూ పదవుల్లోకి వస్తామనడం ఏమిటో ఆయనే సమాధానం చెప్పాలన్నారు. రాహుల్ గాంధీ సైతం తొక్కుకుంటూ వస్తున్న రేవంత్ రెడ్డిపైనే ఆధారపడి ఐదు రాష్ట్రాల ఎన్నికల బాధ్యతలను అప్పగించారని చెప్పారు. ఆ ఎన్నికల్లో సర్వేల దగ్గర నుంచి పైసలు సమకూర్చే వరకు అన్ని బాధ్యతలు రేవంత్ రెడ్డికే అప్పగించారని, సీఎం వాడుతున్న భాషను చూసి జనం అసహ్యించుకుంటున్నారని బండి సంజయ్ విమర్శించారు.

బీఆర్ఎస్ నేతల భాష సైతం అట్లాగే ఉందని, రెండు పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. అందులో భాగంగానే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై బీఆర్ఎస్ నేతలు నిలదీయడం లేదని, బీఆర్ఎస్ నేతల అవినీతిపై కాంగ్రెస్ చర్యలు తీసుకోవడం లేదన్నారు. గురువారం తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ వందేమాతరం గేయ ఆలాపన సమయంలో అసెంబ్లీలో గవర్నర్, మండలి చైర్మన్, స్పీకర్, సీఎం, మంత్రుల సమక్షంలోనే మజ్లిస్ ఎమ్మెల్యేల బహిష్కరించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభలో సభ్యులు తప్పు చేస్తే శిక్షించే అధికారం ఒక్క స్పీకర్‌కు మాత్రమే ఉందని, ఇంతవరకు నోటీసులు ఎందుకు ఇవ్వలేదని మండిపడ్డారు. దీనివల్ల శాసన వ్యవస్థపట్ల, స్పీకర్ పట్ల ప్రజల్లో మరింత చులకన భావం ఏర్పడుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాననసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు ఎందుకు స్పందించలేదని తెలిపారు.

బీజేపీ అధికారంలో ఉంటే ఎంఐఎం మెడలు పట్టి తప్పనిసరిగా వందేమాతరం ఆలపించేలా చర్యలు తీసుకునేవాళ్లమన్నారు. మజ్లిస్ మోచేతి నీళ్లు తాగే పార్టీలు అధికారంలో ఉండటంతో స్పందించడం లేదన్నారు. ఒవైసీ అప్పడప్పుడు వచ్చి దేశభక్తుడిని అని చెప్పుకోవడం కాదు. ఆచరణలో చూపాలని, ఉగ్రవాదులను తన కాలేజీలో పెట్టుకుని దేశభక్తి మాట్లాడే ఒవైసీ మాటలను ఎవరు నమ్మరన్నారు. కరీంనగర్ ఎంపీకి ప్రాధాన్యతలేని శాఖను మోడీ కట్టబెట్టారంటూ శ్రీధర్ బాబు చేసిన వ్యాఖ్యలు సరికాదని, హోంశాఖ చాలా కీలకమైందని తెలిపారు. అంత ప్రాధాన్యత ఉందని, కేంద్రంలో అంతటి ముఖ్యమైన శాఖను మోడీ తనకు అప్పగించారని, బీసీని ప్రధాని చేయడంతోపాటు 27 మంది ఓబీసీలకు మంత్రి పదవులిచ్చిన ఘనత బీజేపీదేనని కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖానించారు.

# పెంపుడి పిల్లి చనిపోయిందని యువతి ఆత్మహత్య





**హైదరాబాద్ (జనంసాక్షి) :** చాలా ఇష్టంగా పెంపుడు జంతువులను పెంచుకునేవాళ్లు ఉంటారని తెలిసిందే. అయితే పెంపుడు జంతువుల పట్ల చూపించే ప్రేమకు కూడా కొన్ని హద్దులుండాలి. ఎందుకంటే కొన్నిసార్లు ఆ మితిమీరిన ప్రేమ ప్రాణాల మీదికొస్తుంది. అలాంటి ఘటనే మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పెంపుడు పిల్లి మరణం తట్టుకోలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఉంటున్న హిమబిందు (20) బీఎస్సీ చదువుతోంది. హిమబిందు గత రెండు సంవత్సరాలుగా పిల్లిని ఎంతో ఇష్టంగా పెంచుకొని, గారాబంగా చూసుకుంటుంది. అయితే హిమబిందుకెంతో ఇష్టమైన పిల్లి చనిపోయింది. దీంతో హిమబిందు తీవ్రమనస్తాపానికి లోనైంది. పిల్లి మృతి చెందిన విషయాన్ని జీర్ణించుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. వెంటనే అప్రమత్తమైన కుటుంబసభ్యులు హిమబందును దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారు. హిమబిందు తీసుకున్న నిర్ణయం పట్ల నెటిజన్లు పలు రకాలుగా స్పందిస్తున్నారు. ఒకటి చనిపోతే ఇంకో పిల్లిని తీసుకొచ్చి పెంచుకోవచ్చు కానీ.. ఇలా ప్రాణాలు తీసుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పెంపుడు జంతువులతో బాండింగ్ ఏర్పడితే మనుషుల కంటే ఎక్కువగా ప్రేమిస్తామని.. కానీ పిల్లి కోసం ఇలా చనిపోవడం సరికాదని కామెంట్స్ పెడుతున్నారు.



# డాడీ, మోడీ, చిన్నమోడీపైనే పోరాటం

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ (జనంసాక్షి) :** డాడీ, మోడీ, చిన్నమోడీపైనే తన పోరాటమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఉగాది వేడుకల సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన కొత్త పార్టీ అజెండాపై కసరత్తు జరుగుతోందని అన్నారు. గాంధీజీ సర్వోదయ సిద్ధాంతాన్ని లోతుగా అధ్యయనం చేస్తున్నానని తెలిపారు. మంచి ముహూర్తం చూసుకుని కొత్త పార్టీ ప్రకటిస్తానని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో నా ఇష్యూను కాంగ్రెస్, సీఎం రేవంత్ అడ్వాంటేజ్‌గా తీసుకుంటున్నారని ఫైర్ అయ్యారు. పార్టీ ప్రారంభించగానే అజెండా, లక్ష్యాలను కూడా ప్రకటిస్తానని అన్నారు. అయితే, కొత్త పార్టీకి 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరును అనుకుంటున్నారు. పార్టీ గుర్తుగా 'ధర్మ గంట'ను ఫిక్స్ చేసినట్లుగా తెలుస్తోంది. రానున్న శ్రీరామనవమికి పార్టీ పేరుతో పాటు గుర్తను కవిత అనౌన్స్ చేయనున్నారు. మరోవైపు కొత్త పొలిటికల్ పార్టీ వ్యవహారంలో కల్వకుంట్ల కవితకు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. కవిత కొత్త పార్టీ అంశంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈసీకి సూచించింది. 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో నూతన రాజకీయ పార్టీ నమోదు కోసం కవిత కేంద్ర ఎన్నికల సంఘానికి గతంలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ విషయంలో ఈసీ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని కవిత తాజాగా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కవిత పిటిషన్‌పై ఇవాళ విచారణ జరిపిన ధర్మాసనం 'తెలంగాణ ప్రజా జాగృతి'పై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది.

# ఖమ్మం రహదారులకు మహర్దశ!

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేక కృషితో రూ.594 కోట్లు మంజూరు

- జిల్లాలో ఐదు కీలక మార్గాల విస్తరణకు గ్రీన్‌సిగ్నల్
- నాలుగు వరుసల రోడ్లుగా ఆధునికీకరణ.. మారనున్న రవాణా ముఖచిత్రం
- ఉగాది పండుగ పూట ఖమ్మం ప్రజలకు తీపి కబురు



**ఖమ్మం (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లా వాసుల దశాబ్దాల కల నెరవేరబోతోంది. జిల్లా రవాణా వ్యవస్థలో సరికొత్త అధ్యాయం మొదలుకానుంది. మారుమూల గ్రామాల నుంచి పట్టణాలకు మహర్దశ కల్పిస్తూ, జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసాధారణ చొరవ చూపారు. ఆయన పట్టుదలతో జిల్లాలోని ఐదు ప్రధాన రహదారుల విస్తరణకు (జీవో ఎంఎస్ 15 /16-03-2026) ఏకంగా రూ.594 కోట్ల భారీ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో కీలక మార్గాలను నాలుగు వరుసల (ఫోర్ లేన్) రహదారులుగా అభివృద్ధి చేయనున్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే జిల్లా అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (నావీ) పద్ధతిలో ఈ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో ఆయన పాత్ర కీలకం. ఈ రహదారుల వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు సౌకర్యవంతమైన రాకపోకలను కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాను సులభతరం చేయడం లక్ష్యంగా ఈ రహదారుల విస్తరణను ప్రభుత్వం చేపడుతోంది. ఈ రదారుల విస్తరణ వల్ల ఖమ్మం, వైరా, మధిర నియోజకవర్గంలో కనెక్టివిటీ పెరగండతో పాటు స్థానికంగా ఆర్థిక వ్యవస్థకు ఊతం లభించనుంది. రవాణా ఖర్చులు తగ్గడంతో రైతులు, వ్యాపారులకు ప్రయోజనం చేకూరనుంది.

### రహదారులు విస్తరణ

**1. వైరా నుండి జగ్గయ్యపేట వరకు హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిని కలుపుతూ నాలుగు వరుసల రహదారిగా విస్తరణ :** జగ్గయ్యపేట, బోనకల్ , రావినూతల, ముజఫర్ నగర్, జానకీపురం, పెద్దబీరవల్లి, పాలడుగు, సీతానగరం, గొల్లపూడి, రెబ్బవరం, తాటిపూడి, జింకల తాండా. సోమవరం మీదుగా వైరా వరకు. ఈ రహదారి మొత్తం 25.2 కిలోమీటర్ల రహదారి విస్తరణకు రూ.151.20 కోట్ల నిధుల మంజూరు

**2. మధిర నుంచి తూటికుంట్ల వరకు నాలుగు వరుసల రహదారిగా విస్తరణ :** మధిర, జిలుగుమాడు, ఆత్కూరు, కిష్టాపురం, సిరిపురం, కలకోట, బ్రాహ్మణపల్లి మీదుగా తూటికుంట్ల వరకు విస్తరణ. ఈ రహదారి మొత్తం 13.50 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ. 81 కోట్ల నిధుల మంజూరు.

**3. మధిర నుంచి ఎర్రుపాలెం వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ :** మధిర, ఎల్లెందులపాడు, దెందుకూరు, మీనవోలు మీదుగా ఎర్రుపాలెం వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ. ఈ రహదారి మొత్తం 18.40 కిలోమీటర్ల మేర రూ.110.40 కోట్ల నిధులు మంజూరు.

**4. ఖమ్మం నుంచి బోనకల్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ :** ఖమ్మం, కొత్తూరు, దంసలాపురం, గాంధీనగరం, రామకృష్ణాపురం, పందిళ్లపల్లి, జగన్నాథపురం, నాగులవంచ, ముష్టికుంట్ల మీదుగా బోనకల్ వరకు రహదారి విస్తరణ. మొత్తంగా 28.03 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణకు రూ.157.23 కోట్ల నిధుల మంజూరు.

**5. బోనకల్-ఆళ్లపాడు, రాయన్నపేట-వంగవీడు వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ :** బోనకల్, ఆళ్లపాడు, రాయన్న పేట మీదుగా వంగవీడు వరకు రహదారి విస్తరణ. మొత్తంగా 15.72 కిలోమీటర్ల మేర రహదారికి విస్తరణకు రూ.94.32 కోట్ల నిధుల మంజూరు అయ్యాయి.

# మత్తుమందు ఇచ్చి మహిళలపై లైంగికదాడి

- క్షుద్ర పూజల పేరుతో జ్యోతిష్కుడి రాసలీలలు
- అరెస్టు చేసిన మహారాష్ట్ర పోలీసులు



**ముంబయి (జనంసాక్షి) :** భక్తి, క్షుద్ర పూజల పేరుతో మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్న ఆస్ట్రాలజర్‌ను మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో నిందితుడు అశోక్ ఖారత్ పలువురు మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డట్లు తెలిసింది. ఒక బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అశోక్ ఖారత్.. మహారాష్ట్రలోని నాసిక్‌లో పేరుమోసిన ఆస్ట్రాలజర్. అతడి దగ్గరకు ఎందరో పెద్ద సెలబ్రిటీలు ఆస్ట్రాలజీ కోసం వస్తుంటారు. అతడు, తాను మర్చంట్ నేవీ ఆఫీసర్‌గా పని చేసి రిటైరయ్యానని చెబుతూ అందరితో కెప్టెన్ అని కూడా పిలిపించుకుంటాడు. అతడి దగ్గరికి పురుషులతోపాటు మహిళలు కూడా వివిధ సమస్యల్తో, పరిష్కారం కోసం ఆస్ట్రాలజీ చూపించుకోవడానికి వస్తుంటారు. వారిలో కొందరు మహిళల్ని అశోక్ ఖారత్ మోసం చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. తను చెప్పినట్లు చేయకపోతే వారి భర్తలు మరణిస్తారని మహిళల్ని నమ్మించేవాడు. పూజల పేరుతో తన ఫాంహౌజ్‌కు పిలిపించుకునేవాడు. అక్కడ పూజలు చేసే క్రమంలో ఎంతో మంది మహిళలపై మత్తు మందు ఇవ్వడం, హిప్నటైజ్ చేయడం ద్వారా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇటీవల ఒక మహిళ (35) ఏవో సమస్యలతో పరిష్కారం కోసం అతడి వద్దకు వచ్చింది. ఆ సమస్యలు తీరాలంటే కొన్ని పూజలు చేయాలని నమ్మించాడు. అలా ఆమెను తన ఫాంహౌజ్‌కు ఒంటరిగా పిలిపించి, పూజలు చేసే క్రమంలో మత్తు మందు ఇచ్చాడు. హిప్నటైజ్ చేసి, ఆ తర్వాత అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో అత్యాచారానికి గురైన మహిళ నాసిక్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో వారికి షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. అతడు ఆ ఒక్క మహిళపైనే కాకుండా, పలువురిపై అత్యాచారానికి పాల్పడ్డట్లు తేలింది. ఇంట్లో అతడు అనేక చోట్ల సీసీ కెమెరాలతోపాటు రహస్య కెమెరాలు అమర్చాడు. అతడు చేసిన నేరాలకు సంబంధించిన పలు దృశ్యాలు వాటిలో రికార్డయ్యాయి. వాటికి సంబంధించిన పెన్ డ్రైవ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో 58 మంది మహిళలకు సంబంధించిన అభ్యంతరకర వీడియోలను పోలీసులు గుర్తించారు. కేసు తీవ్రత దృష్ట్యా దీనిపై విచారణ జరిపేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్ తేజస్విని ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక టీంను ఏర్పాటు చేసింది. ఇక పోలీసులు అశోక్ ఖారత్‌ను అరెస్టు చేసేందుకు ఒక కోవర్ట్ ఆపరేషన్ నిర్వహించారు. నిందితుడి ఇంటి నుంచి పిస్టోల్, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. అతడికి పలువురు మహారాష్ట్రతోపాటు జాతీయస్థాయి రాజకీయ నాయకులతో సంబంధాలున్నట్లు తెలుస్తోంది.

# డ్రగ్స్ కేసులో టార్గెట్ చేశారు : నటి హేమ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** దాదాపు రెండేళ్ల క్రితం బెంగళూరులో జరిగిన డ్రగ్స్ పార్టీ కేసు అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ కేసులో పలువురు తెలుగు వ్యక్తుల పేర్లు వినిపించడంతో పాటు సీనియర్ నటి హేమ పేరు కూడా బయటకు రావడం తీవ్ర చర్చకు దారితీసింది. అయితే అనంతరం కోర్టు ఆమెకు క్లీన్ చిట్ ఇవ్వడంతో ఆ వివాదం క్రమంగా సద్దుమణిగింది. ఇటీవల తెలంగాణలో మరోసారి డ్రగ్స్ కేసులు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో, ఆ పాత కేసును ప్రస్తావిస్తూ హేమ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు.

# సాగుభూముల్లో ఆయిల్‌ఫాం సాగు చేయాలి

## శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**సిద్దిపేట (జనంసాక్షి) :** సాగుభూముల్లో ఆయిల్‌ఫాం సాగు చేయాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో ఏర్పాటు చేసిన ఆయిల్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన ప్రజా పాలనలో రైతు ఉత్సవాలు కార్యక్రమాన్నిరాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉద్యానవన, పట్టుపరిశ్రమ, మత్స్య, విత్తనాభివృద్ధి సంస్థ, చేనేత, జౌళి శాఖలతో పాటు వివిధ వ్యవసాయ ఉత్పత్తుల సంస్థలు, విజయ డైరీ, వ్యవసాయ యాంత్రికరణ సంస్థలస్టాళ్లను ప్రారంభించి పరిశీలించారు.. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ, స్వయంగా ఆయిల్ పామ్ సాగు చేసి మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. మొదటి రెండు సంవత్సరాల్లో అంతర్ పంటల సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఫామ్ ఆయిల్ పంట సాగు ను పరిశీలించడానికి సంస్థలు, సాంకేతిక మిషనరీ వస్తున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం నుండి రైతులకు 4200 సబ్సిడీ అందించడం జరుగుతుందని, ఆయిల్ ఫెడ్ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆయిల్ దిగుమతి చేసుకునే అవకాశం లేకుండా పంటను సాగు చేయాలని సూచించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావానికి ప్రొఫెసర్ జయశంకర్, గడ్డం వెంకటస్వామి కన్నకలలు కళ్ళ ముందు ఎలా నిజమయ్యాయో అదేవిధంగా తుమ్మల నాగేశ్వరరావు ఫార్మాయిల్ కంపెనీ కలలు నిజమయ్యాయని అన్నారు. రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఇప్పటికే నుండి 3 వెల ఎకరాల వరకు ఆయిల్ పామ్ సాగు చేయించడం జరిగిందని, పంట సాగు చేసే 4 సంవత్సరాలు రైతులను ఆదుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తుందని అన్నారు. ప్రతి రైతు పంటను సాగు చేసే అవకాశం ఉందని, రైతులు సాగు భూమి ఎంతుంటుందో దానిలో ఆయిల్ఫార్మ్ పంటను సాగు చేయాలని సూచించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. తెలంగాణ రైతాంగానికి ఆయిల్ పామ్ పంట కీలక ఆదాయ వనరుగా మారిందన్నారు. అకాల వర్షాలు, కోతులబెడద, దొంగల భయం లేకుండా ఆయిల్ పామ్ భరోసానిస్తోందని, ఎకరానికి రూ.51 వేల వరకు సబ్సిడీ అందిస్తున్న ఏకైక పంట ఇదేనని పేర్కొన్నారు. ఆయిల్ పామ్‌తోపాటు అంతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చని, మొదటి మూడు సంవత్సరాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతుండగా, రాబోయే మూడేళ్లలో మరింత విస్తరణకు కృషి చేస్తున్నామని చెప్పారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నర్మెట్ట ఆయిల్ ఫ్యాక్టరీ చరిత్రాత్మక ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని, ఇక్కడ బయట నుంచి విద్యుత్ తెచ్చుకోవాల్సిన అవసరం లేకుండా ఇక్కడే 4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని, అవసరమైతే ప్రభుత్వానికి సరఫరా చేయగలమన్నారు. సిద్దిపేటలో రిఫైనరీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో పంట మార్పిడి అవసరమని, రైతులు ఆదాయపరంగా బలపడే పంటలను ఎంచుకోవాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు కీలకమని. ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తోందని, రుణమాఫీ వంటి పథకాల ద్వారా రైతులకు మద్దతు అందిస్తోందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంటను అధికంగా ప్రోత్సహిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు ఆయిల్ ఫామ్ కురియన్ అని అన్నారు.150 స్టాళ్లతో నిర్వహిస్తున్న రైతు ఉత్సవాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 22 న ముఖ్యమంత్రి రానున్నారని తెలిపారు. ఈ ఫ్యాక్టరి ద్వారా గంటకు 120 టన్నులను క్రషింగ్ చేసే సామర్థ్యం ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తున్నాయని, దేశానికి వెన్నముకైన రైతు ఆయిల్ పామ్‌తో పాటు ఇతర పంట సాగుపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సిద్దిపేట కన్నా ఎక్కువ హుస్నాబాద్ నియోజకవర్గంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతుల సంక్షేమానికి అందరూ కృషి చేస్తున్నారని తెలిపారు.

పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావు మాట్లాడుతూ, ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్లపాటు ప్రతి సంవత్సరం ఎకరానికి రూ.4200 ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈ పంట రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందిస్తుందని, దుబ్బాక నియోజకవర్గంలో మొదటి ఆయిల్ ఫామ్ పంటను వేసింది తానేనని పేర్కొన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ పూర్తి అయిన తరువాత ఈ ప్రాంతంలో తేమ శాతం పెరిగి ఆయిల్ పామ్ సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గంలో పంచుకున్నది భాగ్యలక్ష్మి 2021 జూన్ 5న మొదటి మొక్కలు నాటినట్లు గుర్తుచేశారు. సిద్దిపేట జిల్లాలో 50 వేల ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంటలు పండించాలనేది తన కోరిక అని, ప్రభుత్వం మారిన ఈ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఆపకుండా పూర్తి చేసేందుకు కృషి చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు అని, ఖమ్మం రైతుల లాగే సిద్దిపేట రైతులు కూడా అభివృద్ధి చెందేలా రైతులందరూ ఆయిల్ ఫామ్ పంటలు వేసుకోవాలని అన్నారు. ఈ పరిశ్రమను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంట దిగుబడి కి వచ్చే ఐదు సంవత్సరాలలోపు ప్రభుత్వం రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతు భాగ్యలక్ష్మి తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం అతిథులు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో తిరిగి ఆల్ఫా ఫ్యాక్టరీ పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్సీలు దేశపతి శ్రీనివాస్, వంటేరు యాదవ రెడ్డి, ఆయిల్ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేంద్రమోహన్, జిల్లా కలెక్టర్ కె. హేమావతి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి సరూపారాణి, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆయిల్ ఫెడ్ అధికారులు, అధిక సంఖ్యలో రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370